మంగళవారం
10•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 255
• పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




- మార్కెట్ ఉసురు తీసిన మదుపరుల భయాలు
- కరోనా వైరస్, చమురు ధరల పతనంతో భీకర నష్టాలు
- ఆర్థికమాంద్యం అంచనాలతో అమ్మకాల ఒత్తిడి
- సెన్సెక్స్ 1,942, నిఫ్టీ 538 పాయింట్లు క్షీణత



# మార్కెట్లో ఉత్పాతం

## 7 లక్షల కోట్లు ఆవిరి




### నెల రోజుల్లో 5వేల పాయింట్లు మటాష్

ఉత్పాతం.. లక్షల కోట్ల సంపద ఆవిరి.. ఒక్కుదుటున భారీ పతనం.. ఒకవైపు కరోనా కల్లోలం.. మరోవైపు చమురు ధరల కలవరం.. ఇంకోవైపు ఆర్థికమాంద్యం అలజడి.. ఒకదానివెంట ఒకటిగా దేశీయస్టాక్‌మార్కెట్లను ముప్పిరిగొన్నాయి. ఫలితంగా సోమవారం మార్కెట్లలో నష్టపుటేరులుపారాయి. చుట్టుముట్టిన చమురు భయాలు ప్రపంచమార్కెట్లను కకావికలంచేశాయి. ఒకదశలో మార్కెట్లలో ట్రేడింగ్‌ను నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. అగ్రరాజ్యం అమెరికా సూచీలు సైతం ఏడుశాతానికి పడిపోయాయి. దేశీయ మార్కెట్లలో ఉదయం ఆరంభం దగ్గర్నుంచి, ముగింపు దాకా లాభాల స్వీకరణే లక్ష్యంగా మదుపరులు ముందుకు కదలడంతో ఆ రంగం.. ఈ రంగం అన్న తేడా లేకుండా అన్ని రంగాల షేర్లు పాతాళంలోకి పడిపోయాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 1,942 పాయింట్లు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 538 పాయింట్లు దిగజారాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ 2,400 పాయింట్లకుపైగా నష్టపోగా.. ఈ ఒక్కరోజే మదుపరుల సంపద దాదాపు రూ.7 లక్షల కోట్లు ఆవిరైపోయింది.

### రూపాయి తగ్గింది..



దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. కరోనాదెబ్బకు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలనుండటంతో అటు ఈక్విటీలు, మరోవైపు ప్రపంచ కరెన్సీలు తీవ్ర ఆటుపోట్లకు గురయ్యాయి. ఎన్నడూ లేనంతస్థాయిలో రూపాయి బక్కచిక్కింది. డాలర్‌ను కొనుగోలు చేయడానికి బ్యాంకర్లు, ఎగుమతిదారులు ఎగబడటంతో రూపాయి మారకం విలువ 17 నెలల కనిష్ఠ స్థాయిని తాకుతూ 30 పైసలు క్షీణించి 74.17 వద్దకు జారుకున్నది.

### చమురు వదిలింది..




అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఏకంగా 20 శాతానికి పైగా పడిపోయాయి. ప్రపంచ ప్రామాణిక బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర సోమవారం ఒక్కరోజే బ్యారెల్‌కు 9.74 డాలర్లు లేదా 21 శాతం దిగజారింది. 35.52 డాలర్ల వద్ద ట్రేడైంది. ఒకానొక దశలో ధరలు 30 శాతానికిపైగా పడిపోయి బ్యారెల్ 31.02 డాలర్లే పలికింది. 1991 గల్ఫ్‌యుద్ధం తర్వాత ఈ స్థాయిలో ధరల క్షీణత ఇదే కావడం గమనార్హం. 2008లో రికార్డు స్థాయి 147 డాలర్లు పలికిన బ్యారెల్ ధర ప్రస్తుతం 30 డాలర్ల స్థాయికి పడిపోయింది. కరోనా వైరస్ నేపథ్యంలో క్రమేణా క్షీణిస్తున్న ముడి చమురు ధరలను నియంత్రించేందుకు ఉత్పత్తిని మరింత తగ్గించాలన్న ప్రతిపాదనపై ఒపెక్, దాని భాగస్వామ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సౌదీ అరేబియా ధరల యుద్ధానికి తెరతీసింది.

### ఎందుకు పడింది..?

ప్రపంచ ఆర్థికవ్యవస్థను కరోనా వైరస్ పట్టి పీడిస్తున్న నేపథ్యంలో చమురు ధరల యుద్ధం మదుపరులను ఒక్కసారిగా కలవరపెట్టింది. తొలుత చమురు ఆధారిత షేర్లలో అమ్మకాల ఒత్తిడి నమోదవగా, ఆపై మిగతా రంగాలకూ పాకింది. యెస్ బ్యాంక్ సంక్షోభం ఆర్థికరంగ షేర్లను దెబ్బతీయగా, ఆటో, కన్జ్యూమర్ గూడ్స్ తదితర రంగాల షేర్లూ వరుసగా కుప్పకూలాయి. చివరకు భీకర నష్టాలు మిగిలాయి. 8

# రాజవుతున్న రైతు

## రాష్ట్రంలో వ్యవసాయం అనూహ్య పురోగతి

### మిగిలిన రంగాల్లోనూ తెలంగాణ జోరు

### పారిశ్రామిక ఉత్పత్తుల్లో జాతీయ సగటు కంటే ఎంతో మెరుగు




దేశం మొత్తాన్ని ఆర్థికరంగం వణికించవచ్చు.. మార్కెట్లు ఒడిదుడుకులకు లోనుకావచ్చు.. కానీ తెలంగాణ రాష్ట్రంమాత్రం అన్ని అవరోధాలను అధిగమిస్తూ వివిధ రంగాల్లో దూసుకుపోతున్నది. రాష్ట్ర సాధన ద్వారా ఏ వ్యవసాయాన్నైతే సుసంపన్నం కావాలని యావత్ తెలంగాణ సమాజం కోరుకొన్నదో.. ఆ వ్యవసాయం ఊహించినదానికంటే ఎక్కువగా ప్రగతిపథాన దూసుకుపోతున్నది. ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణతో తెలంగాణ రైతు రాజవుతున్నాడు. పాడిపంటలతోపాటు సేవారంగం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రియల్ ఎస్టేట్ వంటి పలురంగాల్లో తెలంగాణ ప్రగతి పరుగులు పెడుతున్నది. ఐటీ ఉత్పత్తుల్లో కర్ణాటకతో సమానంగా పోటీపడుతున్న తెలంగాణ.. రియల్‌రంగంలో దేశంలోనే అత్యధిక వృద్ధిరేటు (జీఆర్)ను నమోదు చేసుకొంటున్నది. మొత్తం రూ.9.6 లక్షల కోట్లుగా ఉన్న మన రాష్ట్ర సంపదలో సేవారంగం 65 శాతం, వ్యవసాయ, అనుబంధరంగాలు 19 శాతం, ద్వితీయరంగం 16 శాతం వాటాను కలిగివున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామిక ఉత్పత్తులపై ఆర్థికమాంద్యం నీడలు పడినప్పటికీ వృద్ధిరేటు జాతీయ సగటు కంటే ఎంతో ఎక్కువగా ఉన్నది.

వివరాలు 2వ పేజీలో

### కొత్త రాష్ట్రం.. భారీ బాధ్యత!

పెద్ద రాష్ట్రాలతో పోటీ 4

# కమల్‌నాథ్‌కు గండం



కమల్‌నాథ్



జ్యోతిరాదిత్య సింధియా

- జ్యోతిరాదిత్య సింధియా తిరుగుబాటు
- 17 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెంగళూరుకు తరలింపు
- వీరిలో ఆరుగురు మంత్రులు
- సీఎం కమల్‌నాథ్ అత్యవసర క్యాబినెట్ సమావేశం
- 20 మంది మంత్రులు రాజీనామా
- సంక్షోభాన్ని అనుకూలంగా మలుచుకొనే దిశగా బీజేపీ

## మధ్యప్రదేశ్‌లో ముసలం

మధ్యప్రదేశ్ రాజకీయాల్లో ముసలం పుట్టింది. కొన్నాళ్లుగా అసంతృప్తితో రగిలిపోతున్న కాంగ్రెస్ సీనియర్ నేత జ్యోతిరాదిత్య సింధియా తిరుగుబాటు చేశారు. తన వర్గానికి చెందిన దాదాపు 17 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగళూరులోని రిసార్ట్‌కు తరలించారు. వీరిలో ఆరుగురు మంత్రులు కూడా ఉన్నారు. దీంతో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం కమల్‌నాథ్ ఆగమేఘాల మీద భోపాల్‌కు తిరిగివచ్చారు. అత్యవసరంగా క్యాబినెట్ సమావేశం నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. అనంతరం 20 మంది మంత్రులు రాజీనామా లేఖలను సీఎంకు అప్పగించారు. క్యాబినెట్‌ను పునర్ వ్యవస్థీకరించాలని కోరారు. మరోవైపు జ్యోతిరాదిత్య సింధియా సోమవారం రాత్రి ఢిల్లీలో ప్రత్యక్షమయ్యారు. ఆయన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అవుతారని వార్తలు వచ్చాయి. తాజా పరిణామాలతో కమల్‌నాథ్‌కు పదవీ గండం పొంచి ఉన్నది. తమ వద్ద 20 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని సింధియా వర్గం చెప్తుండగా, తొమ్మిది మంది మాత్రమే ఉన్నారని కమల్‌నాథ్ వర్గం పేర్కొంటున్నది. మరోవైపు కాంగ్రెస్‌లో నెలకొన్న సంక్షోభాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ పావులు కదుపుతున్నది.

వివరాలు 5వ పేజీలో

# ఆధారాల గుట్టురట్టు!

కీలక కేసుల ఛేదనలో సూపర్‌లైట్ టెక్నాలజీ

ఇటీవల కరీంనగర్ రాధిక కేసు పరిష్కారం

దేశంలోనే అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న తెలంగాణ పోలీస్ క్లూస్‌టీం

3

# మన సోనా

### తెలంగాణ సోనా రకం షుగర్ పేషెంట్లకు అనుకూలం


### ధ్రువీకరించిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్

- దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఈ విత్తనానికి భారీ డిమాండ్
- ప్రతిష్ఠాత్మక అమెరికన్ జర్నల్‌లోనూ ఈ వంగడంపై ప్రత్యేక కథనం
- ప్రభుత్వ చొరవతో వ్యవసాయరంగానికి భారీ మేలు
- జయశంకర్ వర్సిటీకి జాతీయ స్థాయిలో మూడోస్థానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైస్ రిసెర్చ్ సెంటర్ సృష్టించిన 'తెలంగాణ సోనా' వరి వంగడం పేరుకు తగ్గట్టుగానే నిజంగా బంగారమే. టైప్-2 మధుమేహంతో బాధపడే వారికి వరంగా మారింది. సాధారణ బియ్యం కంటే భిన్నంగా జొన్నలు, సజ్జలు వంటి చిరు ధాన్యాల్లో ఉండేస్థాయిలోనే కార్బోహైడ్రేట్స్ ఉండటం దీని ప్రత్యేకత. ఈ తెలంగాణ సోనా వరి వంగడాన్ని హైదరాబాద్ తార్నాకలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) సంస్థ కూడా పరిశోధించి ఈ విషయాన్ని ధ్రువీకరించింది. దీంతో ఈ వంగడం దేశంలోని దాదాపు ఏడు రాష్ట్రాల రైతుల ఆదరణ పొందింది. తెలంగాణ సోనా వరి వంగడం లైసెన్స్ కోసం ఇతర రాష్ట్రాల వరి విత్తన వ్యాపారులు జయశంకర్ వర్సిటీని ఆశ్రయిస్తున్నారు. స్వరాష్ట్రంలో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో రూపుదిద్దుకున్న ఈ వంగడానికి అంతర్జాతీయస్థాయిలోనూ గుర్తింపు లభించింది. ప్రతిష్ఠాత్మక అమెరికన్ జర్నల్‌లోనూ దీనిపై కథనం ప్రచురితమైంది. ఆవిర్భవించిన అనతికాలంలోనే తెలంగాణ రాష్ట్రం జాతీయ, అంతర్జాతీయస్థాయిలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నదనడానికి దీనిని కూడా ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీ జాతీయస్థాయిలో 27వ స్థానంలో ఉండగా, స్వరాష్ట్రంలో ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో



# బాట బాగైంది

పక్కా ప్రణాళికతో గ్రామీణ రోడ్ల అభివృద్ధి

అన్ని ఊర్లకు కనెక్టివిటీ దిశగా పనులు

- పల్లెల నుంచి మండలాలకు.. జిల్లా కేంద్రాలకు మార్గాలు
- కొత్త పంచాయతీల్లో రహదారులకు రూ.5 వేల కోట్లు
- ప్రస్తుతం రూ.800 కోట్లతో పల్లెల్లో అంతర్గత సీసీ రోడ్లు
- బడ్జెట్‌లో సీసీ రోడ్లకు మరో రూ.600 కోట్లు కేటాయింపు

గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి రాచబాటలు పడ్డాయి. పల్లెప్రగతికి ప్రధానమైన బాటలు బాగయ్యాయి. ఆరేండ్ల కిందటివరకు దుమ్మురేగిన గ్రామీణ రోడ్లు పక్కాప్రణాళికతో అభివృద్ధిచెందాయి. పల్లెల నుంచి మండలాలకు.. అక్కడి నుంచి జిల్లా కేంద్రాలకు వేగంగాచేరేలా రహదారులు రూపుదిద్దుకున్నాయి. నాణ్యమైన రహదారులు.. నగరాల నుంచి మారుమూల ప్రాంతాలకు కనెక్టివిటీ ఉంటే పెట్టుబడిదారులు సైతం ముందుకు వస్తారని గుర్తించిన ప్రభుత్వం.. దాదాపు ఆరేండ్ల పాలనలో రాష్ట్రంలోని రోడ్ల రూపురేఖలనే మార్చేసింది.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఆరేండ్ల కిందటివరకు మట్టి, కంకర తేలిన గతుకుల రోడ్లు స్వరాష్ట్రంలో తారుగా మారాయి. పట్టణానికి పక్కనే ఉన్నా సరైన రోడ్డులేని దుస్థితినుంచి పల్లెలకు ప్రగతిదారులు పడ్డాయి. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజాప్రతినిధులే కాంట్రాక్టర్లుగా ఉండటంతో రహదారులు అధ్వాన్నంగా ఉండేవి. వానకాలం ముందు ఓసారి కంకర పోసి.. మట్టి వేసి పనులు చేసినట్టు చూపి లక్షల్లో బిల్లులు మింగిన సందర్భాలు అనేకం. అప్పట్లో గ్రామీణ రోడ్లను బీటీగా మార్చేందుకు ప్రతిపాదించినా.. పార్టీ నేతలకు పని కావాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనలు కార్యాలయాలు దాటేవికావు. స్వరాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా మారింది. గ్రామాలకు వెళ్లే రోడ్డే కాదు.. ఊరిలోని అంతర్గత రహదారులు కూడా సీసీగా మారిపోయాయి. రూ.వేల కోట్లతో పల్లె నుంచి పల్లెకు సింగిల్ బీటీ రోడ్డు.. మండల

మిగతా 2వ పేజీలో

**చికెన్ ధరలు** (వెన్‌కాబ్) (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 37.00 | రిటైల్ లైవ్ | 59.00 |
| డ్రెస్డ్ | 86.00 | స్కిన్‌లెస్ | 97.00 |

**గుడ్ల ధరలు** (వందకు) (రూ.)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 290.00 | రంగారెడ్డి | 290.00 |
| మెదక్ | 290.00 | కరీంనగర్ | 293.00 |
| వరంగల్ | 293.00 | డజన్ ధర | 54.00 |

## కొత్త కోర్సులకు రెడీ

జేఎన్టీయూహెచ్ పరిధిలో 70 ఇంజినీరింగ్ కాలేజీల ఆసక్తి 2

ఐసీఎమ్మార్ అధ్యయనంలో వెల్లడి



## శాకాహారంలోనే కొవ్వెక్కువ!

రోజువారీగా పురుషులు 34.1 గ్రాములు, మహిళలు 31.1 గ్రాముల వాడకం 4

# ప్రజలకు సీఎం కేసీఆర్ హోలీ శుభాకాంక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంగుల పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. హోలీ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని అభిలషించారు.

### సహజ రంగులతో హోలీ: కేటీఆర్

హోలీ పండుగను సహజ రంగులతోనే నిర్వహించుకోవాలని ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారక రామారావు సూచించారు. ఆయన ట్విట్టర్ ద్వారా రాష్ట్ర ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. 'రసాయనిక రంగులను వదిలేద్దాం. సహజమైన రంగులనే వాడుదాం. రంగుల పండుగను సంబురంగా జరుపుకుందా'మని ట్వీట్‌చేశారు.



హైదరాబాద్‌లోని కంటోన్మెంట్‌లో హోలీ సంబురాలకు తక్కువ సంఖ్యలో హాజరైన ప్రజలు

# కళ తప్పిన హోలీ!

## హైదరాబాద్‌లో కనిపించని సందడి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో సోమవారం హోలీ సందడి కనిపించలేదు. రంగుల కేళీ హోలీ ఆడేందుకు నగర ప్రజలు ఉత్సాహం చూపకపోవడంతో రంగుల దుకాణాలన్నీ వెలవెలబోయాయి. ఓ వైపు కరోనా వ్యాధి భయం.. మరోవైపు పండుగ తేదీ విషయంలో నెలకొన్న సందిగ్ధత ఇందుకు కారణమని భావిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో పౌర్ణమి రోజున కామునిదహనం చేసి, పండుగ చేసుకోవడం ఆనవాయితీ. కొంతమంది సోమవారం హోలీ నిర్వహించుకోగా.. మరికొందరు మంగళవారం జరుపుకొనేందుకు సిద్ధమవుతున్నారు.

# మే 17న జేఈఈ అడ్వాన్స్‌డ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా ఐఐటీల్లో ప్రవేశాల కోసం మే 17న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష జరుగనున్నది. ఈ మేరకు సరిచేసిన షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే) అధికారులు సోమవారం విడుదలచేశారు. జేఈఈ మెయిన్‌లో ర్యాంకు సాధించినవారు మే ఒకటినుంచి ఆరు వరకు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్మిట్ కార్డులు మే 12 నుంచి 17 వరకు పొందవచ్చు. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్‌లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు.



# కొత్త కోర్సులకు రెడీ

### జేఎన్టీయూహెచ్ పరిధిలో 70 ఇంజినీరింగ్ కాలేజీల ఆసక్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జేఎన్టీయూహెచ్ కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు కోర్సులను అందించేందుకు 70 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు ముందుకొచ్చాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఎల్వోటీ, కంప్యూటర్ ఇంజినీరింగ్, డాటా అనాలిసిస్ లాంటి కోర్సులను తెలంగాణలో ప్రవేశపెట్టేందుకు అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అనుమతించింది. కొత్త కోర్సు లు బోధించేందుకు అవసరమైన సదుపాయాలను ఆయా కాలేజీల్లో కల్పించారా? లేదా? అనే అంశాలను తనిఖీల బృందం పరిశీలించి యూనివర్సిటీకి నివేదిక అందజేస్తుందని, ఆ తర్వాతే ఎన్ని కాలేజీల్లో కొత్త కోర్సులకు అఫిలియేషన్ ఇవ్వాలన్న అంశంపై స్పష్టత ఇస్తామని జేఎన్టీయూహెచ్ ఇంచార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. కొత్త కోర్సుల బోధన, టీచింగ్ ఫ్యాకల్టీ విషయంలో అన్ని నిబంధనలు పాటిస్తామని చెప్పారు. 2020–21 విద్యాసంవత్సరానికి సంబంధించిన అఫిలియేషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఈ నెల 11 వరకు ఉన్నదని గోవర్ధన్ తెలిపారు.



### మూతపడనున్న 16 ఇంజినీరింగ్ కాలేజీలు


జేఎన్టీయూహెచ్ పరిధిలోని 16 ఇంజినీరింగ్ కాలేజీలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి తమ కాలేజీల మూసివేతకు అనుమతి ఇవ్వాలని ఆయా యాజమాన్యాలు వర్సిటీకి దరఖాస్తు చేసుకున్నాయి. 2015 నాటికి తెలంగాణలో 248 ఇంజినీరింగ్ కాలేజీలుండగా.. గతేడాదికి వాటి సంఖ్య 183 కి తగ్గింది.

# రాజవుతున్న రైతు

## వ్యవసాయరంగంలో అనూహ్య ప్రగతి

- మురిసిన పాడి, పంట
- సేవలరంగంలో దూసుకెళ్తున్న రాష్ట్రం
- పారిశ్రామిక ఉత్పత్తుల్లో జాతీయ సగటు కంటే ఎంతో మెరుగు
- సామాజిక, ఆర్థిక సర్వే నివేదిక వెల్లడి






**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

ఆర్థికమాంద్యాన్ని, ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లలో నెలకొన్న ఒడిదుడుకులను తట్టుకొని తెలంగాణలో దాదాపు అన్నిరంగాలు పురోగమిస్తున్నాయి. వ్యవసాయరంగం అనూహ్యవృద్ధిని సాధిస్తున్నది. పల్లెలు పాడి, పంటలతో మురిసిపోతుండటంతో రైతులు రాజులవుతున్నారు. సేవారంగం దూసుకుపోతున్నది. ఐటీ, రియల్ రంగాల్లో తెలంగాణ సంపద అన్నిరాష్ట్రాల కంటే అధికంగా పెరుగుతున్నది.

### మురుస్తున్న పాడి, పంట

సాగునీటిప్రాజెక్టులు, రైతన్నలకు ఆర్థికసాయంతో వస్తున్న సత్ఫలితాలు ఇప్పుడు కండ్లకుకడుతున్నాయి. 2019–20ఆర్థికసంవత్సరంలో పంటల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. దానికి అనుగుణంగా పంట గిట్టుబాటు కావడంతో రాష్ట్ర సంపద వృద్ధిచెందినట్టు ఆర్థిక, సామాజిక సర్వే నివేదిక వెల్లడించింది. గతేడాది 6.6 శాతంగా ఉన్న వృద్ధిరేటు ఈసారి అమాంతంగా 23.7 శాతానికి పెరిగింది. సాగునీటి ప్రాజెక్టుల పూర్తితో వ్యవసాయ రంగం పుంజుకున్నది. మరోవైపు పశుసంపద (లైవ్‌స్టాక్) గణనీయంగా పెరిగింది. లైవ్‌స్టాక్‌లో గతేడాది 15.9శాతంగా ఉన్న వృద్ధిరేటు ఈసారి 17.3 శాతానికి పెరిగింది. అటవీ ఉత్పత్తులు కూడా 3శాతం పెరిగాయి. మైనింగ్‌రంగంలో మాత్రం వృద్ధిరేటు 23.9శాతం నుంచి 1.1 శాతానికి తగ్గింది. మొత్తంగా ప్రాథమికరంగంలో గతేడాది కంటే ఈ ఏడాది 2.6 శాతం అధిక వృద్ధిరేటు నమోదైంది. ఇదే సమయంలో ప్రాథమిక రంగంలో జాతీయ సగటు వృద్ధిరేటు 10.1 శాతంగా ఉన్నది. దీనితో పోలిస్తే తెలంగాణలో ప్రాథమికరంగం వృద్ధిరేటు 4 శాతం ఎక్కువ.

### పారిశ్రామిక ఉత్పత్తులు తగ్గినా..

రాష్ట్రంలో ఈసారి ద్వితీయరంగం క్షీణించింది. ఆర్థికమాంద్యం, ఇతర ప్రతికూల ప్రభావాల వల్ల పారిశ్రామిక ఉత్పత్తుల వృద్ధిరేటు 3.5శాతానికి క్షీణించింది. ఇదేసమయంలో జాతీయ సగటు వృద్ధిరేటు 1.7శాతానికి పడిపోయింది. కానీ రాష్ట్రంలో విద్యుత్, గ్యాస్, నీటిసరఫరారంగాలు కాస్త మెరుగుపడ్డాయి. గతేడాది 17.3 శాతంగా ఉన్న వృద్ధిరేటు ఈసారి 17.5 శాతానికి పెరిగింది. ఐటీ, రియల్ ఎస్టేట్, రవాణా, విమానయాన, హోటళ్లు, రెస్టారెంట్ సర్వీసులు గతేడాది మాదిరిగానే ఈసారి కూడా 14.1 శాతం వృద్ధిరేటును సాధించడం విశేషం. ఇదే సమయంలో జాతీయ సగటు వృద్ధిరేటు 9.6 శాతానికి పరిమితమైంది.

### రాష్ట్ర సంపదను ఎలా లెక్కిస్తారంటే..

రాష్ట్రమొత్తం సంపదను ప్రాథమిక, ద్వితీయ, సేవా (టర్టియరీ) రంగాలుగా విభజించి ప్రస్తుత ధరల వద్ద, 2011 నాటి స్థిర ధరల వద్ద రెండు రకాలుగా లెక్కిస్తారు. ప్రాథమికరంగంలో వ్యవసాయం దానికి అనుబంధ రంగాలు, ద్వితీయరంగంలో పరిశ్రమలు, విద్యుత్, నిర్మాణ, నీటిసరఫరా లాంటివి ఉంటాయి. ఐటీ, కమ్యూనికేషన్స్, హోటళ్లు, రెస్టారెంట్లు, స్థిరాస్తి క్రయవిక్రయాలు, ప్రజారవాణా, ఆర్థికసేవలు. సాధారణ పరిపాలన సేవారంగం కిందికొస్తాయి. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను జీవీఏ నుంచి తీసేసిన తర్వాత వచ్చిన మొత్తానికి ప్రభుత్వ రాబడులను, ఆదాయాన్ని కలిపి రాష్ట్ర సంపద (జీఎస్డీపీ)ను లెక్కగడతారు. ఈ లెక్కన 2019–20లో రాష్ట్రసంపద 12.6 శాతంమేరకు వృద్ధిచెంది ప్రస్తుత ధరలవద్ద రూ.9,69,604 కోట్లకు పెరిగిందని, దేశసంపద 7.5శాతం వృద్ధిరేటుతో రూ.2,03,84,759 కోట్లుగా ఉన్నదని సర్వే వెల్లడించింది.

**రంగాల వారీగా వృద్ధిరేటు**

| రంగం | తెలంగాణ (రూ.కోట్లలో) | | | | జాతీయ సగటు (రూ.కోట్లలో) | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | ప్రస్తుత ధరలు | | స్థిర ధరలు | | ప్రస్తుత ధరలు | | స్థిర ధరలు | |
| | జీవీఏ | జీఆర్ | జీవీఏ | జీఆర్ | జీవీఏ | జీఆర్ | జీవీఏ | జీఆర్ |
| ప్రాథమిక | 1,62,384 | 15.8 | 94,285 | 10.7 | 36,45,898 | 10.1 | 22,95,559 | 3.5 |
| ద్వితీయ | 1,42,055 | 5.3 | 1,10,503 | 1.7 | 46,80,381 | 2.5 | 36,97,173 | 1.8 |
| తృతీయ | 5,70,058 | 14.1 | 3,85,146 | 9.6 | 1,01,67,407 | 9.8 | 74,41,872 | 7.0 |
| మొత్తం జీవీఏ | 8,74,496 | 12.9 | 5,89,934 | 8.2 | 1,84,93,686 | 7.9 | 1,34,34,606 | 4.9 |
| మొత్తం జీఎస్డీపీ/జీడీపీ | 9,69,604 | 12.6 | 6,63,258 | 8.2 | 2,03,84,759 | 7.5 | 1,46,83,835 | 5.0 |

### సంపద సృష్టికి భారీగా పెట్టుబడి

**పెట్టుబడి** వ్యయానికి రాష్ట్ర ప్రభుత్వం 2020–21 వార్షిక బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు జరిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.17,274 కోట్లుగా ఉన్న ఈ కేటాయింపులను ఈసారి రూ.22,061 కోట్లకు పెంచింది. ఓవైపు సొంత రాబడులను పెంచుకొంటూ మరోవైపు భవిష్యత్‌లో రాష్ట్ర సంపదను మరింత పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు చేపడుతున్నది. రెవెన్యూ ఖర్చులతోపాటు పెట్టుబడి వ్యయానికి కూడా పెద్దపీట వేస్తూ భవిష్యత్ తరాలకు స్థిరమైన రాబడి అందించేందుకు దూరదృష్టితో వ్యవహరిస్తున్నది. భవిష్యత్ అవసరాలకు ఎలాంటి అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టాలనే విషయంపై పక్కా ప్రణాళికతో నిధులు కేటాయిస్తున్నది. ప్రాజెక్టులు, రవాణా, ఖనిజాభివృద్ధి లాంటి రంగాలకు చేసే ఖర్చులను పెట్టుబడి వ్యయంగా చూపుతారు. ఉమ్మ డి రాష్ట్రంలో 2004 నుంచి 2014 వరకు పెట్టుబడి వ్యయానికి కేవలం రూ.59 వేల కోట్లు వెచ్చించగా.. తెలంగాణలో ఐదేండ్లలోనే రూ.1.60 లక్షల కోట్లకుపైగా ఖర్చుచేసి దేశంలోనే అగ్రభాగాన నిలిచింది.



# మన సోనా

మొదటిపేజీ తరువాయి...

అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రస్తుతం మూడో స్థానంలో, దక్షిణ భారత్‌లో మొదటిస్థానంలో నిలిచింది.

### 'తెలంగాణ సోనా వరి' ప్రత్యేకతలు

ఈ తెలంగాణ సోనా వరి వంగడం ప్రత్యేకతను సీఎం కేసీఆర్ కూడా ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించారు. ఇది తక్కువ కార్బోహైడ్రేట్స్ ఉండి టైప్– 2 షుగర్ పేషెట్లకు అనుకూలం. గ్లూకోజ్ శాతం కేవలం 51.6 మాత్రమే ఉండటం వల్ల తెలంగాణ సోనా వరి అన్నం తినేవారికి షుగర్ వచ్చే అవకాశాలుండవు. ఇతర వరి వంగడాల్లో గ్లూకోజ్ శాతం 55నుంచి 62వరకు ఉంటుంది. సాంబా మసూరి వంటి పంట పండించడానికి 155 నుంచి 160 రోజుల సమయం పడితే, తెలంగాణ సోనాకు కేవలం 125 రోజులు సరిపోతుంది. దిగుబడి కూడా ఇతర వంగడాల కంటే 5నుంచి 10శాతం ఎక్కువ రావడం విశేషం. సాంబా మసూ రి ఎకరానికి 22 క్వింటాళ్ల దిగుబడి వస్తే, తెలంగాణ సోనా 28 క్వింటాళ్ల వరకువస్తుం ది. ఈ వరి వంగడాన్ని రెండు సీజన్లలో పండించుకోవచ్చు. తక్కువ రోజుల్లో దిగుబడి రావడం వల్ల పంటకు పంటకు మధ్యలో జనుము, పిల్లి పెసర, పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల భూమి సారవంతమవుతుంది. ఎరువుల వినియోగం, ఖర్చు కూడా తగ్గుతుంది.

### పథకాల అమలుతోనే అద్భుత ఫలితాలు

కేసీఆర్ వంటి నేత ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రానికి ఎంత మేలు జరుగుతుందో తెలంగాణ సోనా వరి వంగడం సృష్టిస్తున్న అద్భుత ఫలితాలే నిదర్శనం. తెలంగాణలో రెండు సీజన్లలో కలిపి 225 లక్షల టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చినా ఇబ్బంది లేదని అసెంబ్లీ వేదికగా సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, సుమారు రెండు లక్షల కోట్ల ప్రణాళికతో సాగునీటి ప్రాజెక్టులను నిర్మిస్తున్న సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ వల్లే తెలంగాణ వ్యవసాయరంగం అద్భుత ప్రగతి దిశగా అడుగులు వేస్తున్నది. రానున్న రోజుల్లో తెలంగాణ వ్యవసాయరంగం ఇంకా విప్లవాత్మక మార్పులతో చరిత్ర సృష్టించే అవకాశాలున్నాయి.

# బీసీలకు మరో పూలే కేసీఆర్

## సంపద సృష్టి, పేదవర్గాలకు పంపకమే సీఎం కేసీఆర్ లక్ష్యం

- మాంద్యంలోనూ ప్రగతిశీల బడ్జెట్
- టీఆర్ఎస్ బీసీ అనుకూల విధానం వల్లే బీజేపీ అధ్యక్షుడిగా లక్ష్మణ్
- బీసీల తరఫున ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు
- మంత్రులు తలసాని శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్



సోమవారం టీఆర్ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని బీసీలకు సీఎం కేసీఆర్ మరో జ్యోతిబా పూలే అని, సంపద సృష్టించాలి, పేదవర్గాలకు పంచాలనేదే ఆయన లక్ష్యమని మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్ పేర్కొన్నారు. బీసీలకు బడ్జెట్‌లో భారీ కేటాయింపులతో ఆ వర్గాలు సంతోషంగా ఉన్నాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బీసీలకు నిధులు కేటాయించారని, బడ్జెట్‌లో బలహీనవర్గాలకు పెద్దపీట వేసినందుకు బీసీవర్గాల తరఫున ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సోమవారం టీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో మంత్రులు మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. ఆర్థిక మాంద్యంలోనూ బ్రహ్మాండమైన ప్రగతిశీల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని ప్రశంసించారు. ఎంబీసీలకు రూ.500 కోట్లు కేటాయించారని అన్నారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి సహా ఇతర పథకాలకు పెద్దఎత్తున నిధులు ప్రకటించారని చెప్పారు. రాజకీయంగా, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అని పేర్కొన్నారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నేతలు బయటికి వెళ్లి మాట్లాడం కంటే అసెంబ్లీ లోపలే ఉండి చర్చించవచ్చని సూచించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు బుద్ధితెచ్చుకోవాలని హితవుపలికారు.

### బిత్తరపోయిన కాంగ్రెస్, బీజేపీ నేతలు

బడ్జెట్‌లో బీసీలకు కేటాయింపులు చూసి కాంగ్రెస్, బీజేపీ నేతలు బిత్తరపోతున్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ఇన్నేండ్ల బీజేపీ, కాంగ్రెస్‌ల పాలనలో కేంద్రంలో కనీసం బీసీ మంత్రిత్వశాఖను కూడా ఏర్పాటు చేయలేకపోయాయని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు బడ్జెట్‌లో రూ.30వేల కోట్ల వరకు కేటాయించారని చెప్పారు. బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నేత లక్ష్మణ్ ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న బీసీ అనుకూల విధానాల వల్లే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మణ్ కొనసాగుతున్నారని తెలిపారు. ప్రధానిగా బీసీ ఉండి కూడా ఏమీచేయడంలేదని పేర్కొన్నారు. బీసీలకు సబ్‌ప్లాన్ కంటే ఎక్కువగా నిధులు కేటాయించారని గుర్తుచేశారు. సబ్‌ప్లాన్ ఉంటే ఎంబీసీలకు కేటాయించిన రూ.500కోట్లలో ఐదుశాతం కూడా రావన్నారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. బీసీలకు ఈ బడ్జెట్‌లో ప్రత్యక్షంగా రూ.4,356 కోట్లు, ఎంబీసీలకు రూ.500 కోట్లు కేటాయించామని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి బడ్జెట్‌లో బీసీలకు కేటాయించింది కేవలం రూ.2,900కోట్లు మాత్రమేనని గుర్తుచేశారు. కల్యాణలక్ష్మికి అదనంగా రూ.650 కోట్లు కేటాయించామని, దీనిద్వారా 70వేల మందికి అదనంగా లబ్ధిచేకూరుతుందని చెప్పారు. గీత కార్మికులకు రూ.25 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు.

### సీఎం కేసీఆర్‌కు గౌడసంఘం కృతజ్ఞతలు

వెనుకబడిన వర్గాలకు సీఎం కేసీఆర్ బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించి వెన్నుదన్నుగా నిలిచారని మోకు దెబ్బ నేతలు ప్రశంసించారు. మోకు దెబ్బ అధ్యక్షుడు అమరవేని నర్సాగౌడ్, సంఘం కార్యవర్గ సభ్యులు రాఘువుల సిద్ధిరాములుగౌడ్, శ్రీపతి లింగాగౌడ్, కేసరి ఆంజనేయులుగౌడ్, సత్యగౌడ్, మాదగోని పద్మ బాలరాజుగౌడ్ తదితరులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఆయుధాల ఎగుమతిలో

# అమెరికా ఫస్ట్!

### సగం ఆయుధాలు మధ్య ప్రాచ్యానికే

**స్టాక్‌హోం:** అంతర్జాతీయ ఆయుధాల వ్యాపారం ఐదేండ్లలో వృద్ధి చెందింది. ఆయుధాల విక్రయంలో రష్యాపై అమెరికా ఆధిపత్యం ప్రదర్శించిందని స్టాక్‌హోం అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ (సిప్రీ) పేర్కొన్నది. 2010–15 మధ్యకాలంతో పోలిస్తే 2015–19లో అంతర్జాతీయ ఆయుధ ఎగుమతులు 5.5శాతం పెరిగాయని సిప్రీ సీనియర్ పరిశోధకుడు పీటర్ వెజెమన్ తెలిపారు. 96 దేశాలకు అమెరికా ఆయుధాలను ఎగుమతిచేసింది. 2015–19 మధ్య కాలంలో అమెరికా విక్రయాలు 23శాతం పెరిగాయి. అంతర్జాతీయ ఆయుధాల ఎగుమతుల్లో తన వాటాను అమెరికా 36శాతానికి పెంచుకున్నది. అమెరికా ఆయుధ ఎగుమతుల్లో సగం మధ్య ప్రాచ్యానికే సాగితే.. అందులో సగం సౌదీ అరేబియాకు వెళ్లాయి. 2010–14తో పోలిస్తే 2015–19 మధ్య సౌదీ అరేబియా ఆయుధ దిగుమతులు 130 శాతమైతే.. అంతర్జాతీయ ఆయుధాల దిగుమతిలో ఇది 12శాతం. ఇక అంతర్జాతీయ ఆయుధాల ఎగుమతిదారుల్లో రెండో స్థానంలో ఉన్న రష్యా నుంచి భారత్‌కు విక్రయాలు భారీగా తగ్గాయి. భారత్ దిగుమతులు 32శాతం, పాకిస్థాన్ దిగుమతులు 39శాతానికి పడిపోయాయి. ఫ్రాన్స్ ఎగుమతులను 72శాతం పెంచుకున్నది. వాటిల్లో సగానికి పైగా ఈజిప్ట్, ఖతార్, భారత్‌కు ఎగుమతి కాగా.. వీటిలో అత్యధికం రాఫెల్ యుద్ధ విమానాలే కావడం గమనార్హం.

## లోకం పోకడ




మీ ఆవేశం చూస్తుంటే నా కెందుకో భయంగా వుందండీ.. ఎందుకైనా మంచిది హెల్త్ చెకప్ చేయించుకోండి!

### ముహూర్తం

సూర్యోదయం: 6.27 గంటలకు

సూర్యాస్తమయం: 6.19 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం పాడ్యమి సాయంత్రం 7.23 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: ఉత్తర రాత్రి 10.02 వరకు, తదుపరి హస్త, అమృతఘడియలు: మధ్యాహ్నం 3.46 నుంచి సాయంత్రం 5.10 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 4.49 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.50 నుంచి 9.37 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.22 నుంచి 3.09 వరకు, వర్జ్యం: లేదు.

# బాట బాగైంది

మొదటిపేజీ తరువాయి...

కేంద్రాలను కలుపుతూ డబుల్ లేన్ రోడ్లుగా మారాయి. 2014నాటికి కేవలం 2,527.46 కి.మీ.ల జాతీయ రహదారులు ఉండగా, ఇప్పుడు 5,682 కి.మీ. నెట్‌వర్క్‌గా మారింది. సింగిల్ రోడ్లకు స్వస్తి పలుకుతూ ఆర్‌అండ్‌బీ పరిధిలోని 15,731 కి.మీ. సింగిల్ లేన్ రోడ్లను రూ.7,029 కోట్లతో డబుల్ లేన్‌గా మారుస్తున్నారు. దాదాపు ఈ పనులన్నీ 80శాతం పూర్తయ్యాయి.

### పంచాయతీ రోడ్లకు భారీగా..

రాష్ట్రంలో 67,714 కి.మీ. మేర పంచాయతీరాజ్ రహదారులు ఉన్నాయి. ఇందులో 31,144 కి.మీ మట్టి రోడ్లు కాగా, 13,103 కి.మీ. కంకర, 23,467 కి.మీ. బీటీ రోడ్లు ఉన్నాయి. దశాబ్దాలపాటు కనీసం మరమ్మతులు చేయకపోవడంతో గతంలో ఇవ్వన్నీ అధ్వాన్న స్థితిలో ఉండేవి. తెలంగాణ ప్రభుత్వం మట్టి రోడ్లను బీటీగా మార్చడంతోపాటు బీటీ రోడ్లకు మరమ్మతులు చేపట్టింది. పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి రూ.8,750 కోట్లు కేటాయించింది. 9,645 కి.మీ. మట్టి రోడ్లను బీటీగా మారుస్తుండగా, ఇప్పటికే 7,454 కి.మీ. పని పూర్తయింది. బీటీ రోడ్లు 15,958 కి.మీ.గాను 14,583 కి.మీ. మరమ్మతులు పూర్తయ్యాయి. 635 వంతెనల నిర్మాణం చేపట్టగా 446 అందుబాటులోకి వచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో మొత్తం 16,661 కి.మీ. రోడ్లకు వివిధ విభాగాల్లో పనులు చేస్తే.. తెలంగాణ ప్రభుత్వం 25,171 కి.మీ. రోడ్లను అభివృద్ధి చేసింది. బీటీ రోడ్ల రెన్యువల్‌లో భాగంగా 14,980.09 కి.మీ. రహదారులకు రూ.2,246.41 కోట్లతో పనులుచేసింది. ఇందుకు ఎంఆర్ఆర్, ఎంఆర్ఆర్ స్పెషల్, 13, 14వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించింది. శివారు గ్రామాలు, పల్లెలను కలిపే రోడ్లను అప్‌గ్రేడ్ చేసింది. 10,191 కి.మీ. రోడ్లను అప్‌గ్రేడ్ చేసి రూ.4,648 కోట్లతో మరమ్మతులు చేసింది. సీఆర్ఆర్, పీఎంజీఎస్‌వై, నాబార్డు, స్టేట్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌ను వీటికి వినియోగించింది. గ్రామీణ రోడ్ల మరమ్మతు, కొత్త రోడ్ల నిర్మాణం నేపథ్యంలో కొత్తగా 652 బ్రిడ్జీల నిర్మాణాన్ని చేపట్టింది. ఇందుకు పీఎంజీఎస్‌వై, నాబార్డ్ రైడ్ నిధులు రూ.1,063 కోట్లు వెచ్చించింది.

### ఆర్‌అండ్‌బీకి పంచాయతీరాజ్ రోడ్లు

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఏర్పాటైన కొత్త గ్రామపంచాయతీల్లో రోడ్ల కోసమే ప్రభుత్వం రూ.5వేల కోట్లు కేటాయించింది. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు వేయడం, ఉన్న రోడ్లను మెరుగుపర్చేందుకు ఈ నిధులు వెచ్చిస్తున్నది. మరోవైపు పంచాయత్‌రాజ్‌శాఖ పరిధిలోని 6,431 కి.మీ. రోడ్లను ఆర్‌అండ్‌బీకి బదిలీచేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,060.07 కి.మీ., కరీంనగర్ 807.12 కి.మీ., ఖమ్మం 1,697.92 కి.మీ., మహబూబ్‌నగర్ 350.53 కి.మీ., మెదక్ 723.27కి.మీ., నల్లగొండ 422.71 కి.మీ., నిజామాబాద్ 348.5 కి.మీ., రంగారెడ్డి 234.2 కి.మీ., వరంగల్ 786.94 కి.మీ. రోడ్లు ఆర్‌అండ్‌బీకి బదిలీ అయ్యాయి. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు వేగంగా చేరేలా ప్రభుత్వం రూ.2,586 కోట్లతో డబుల్ లేన్ రోడ్లను నిర్మిస్తున్నది. 1,975 కి.మీ. మేర పనులు చేపట్టగా, ఇప్పటికే 1,451 కి.మీ. పూర్తయింది. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు కనీసం సింగిల్ లేన్ రోడ్డు ఉండేలా కార్యాచరణను అమలుచేస్తున్నది. పీఆర్ పరిధిలోని 20వేల కి.మీ. రోడ్ల నిర్వహణకు రూ.200 కోట్లు, బీటీ రోడ్ల మరమ్మతులకు రూ.2,400 కోట్లు వెచ్చించింది.

### రూ.800 కోట్లతో సీసీ రోడ్లు

గ్రామాలను కలిపే రోడ్లతోపాటు పల్లెల్లోని అంతర్గత రోడ్లను సైతం సీసీగా మారుస్తున్నారు. ఇందుకు ఉపాధి హామీతోపాటు పలు నిధులు వినియోగిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 8,400 గ్రామాల్లోని రోడ్లకు రూ.800 కోట్లకుపైగా వెచ్చించి సీసీ రోడ్లు వేశారు. వీటిలో ఇప్పటివరకు మొదలైన సీసీ రోడ్ల పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని, పనులు మొదలుపెట్టనివాటిని ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. మిగిలిపోయిన అంతర్గత రోడ్ల నిర్మాణానికి వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ.600 కోట్లు కేటాయించింది. ఉపాధి హామీ, 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు వీటిని అదనంగా ఇస్తున్నది. దీంతో ప్రతి గ్రామంలో మట్టి రోడ్డు అనేది కనిపించదు.



రాములోరి కల్యాణం సందర్భంగా సోమవారం పసుపుకొమ్ములు దంచుతున్న మహిళలు

## రాములోరి కల్యాణ తలంబ్రాలు సిద్ధం

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణ తలంబ్రాలు సిద్ధమయ్యాయి. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం భద్రాచలం దేవస్థానంలో తలంబ్రాలు కలిపే వేడుకను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది మంది వైష్ణవ ముత్తైదువలు పసుపు కొమ్ములను రోళ్లలో పోసి దంచగా.. 1108 మంది మహిళలు తలంబ్రాలు కలిపారు. అంతకుముందు ఆలయ అర్చకులు భద్రాద్రి రామయ్యను పెండ్లికొడుకుగా, సీతమ్మ వారిని పెండ్లి కూతురుగా అలంకరించారు. ఉత్సవమూర్తులకు బేడా మండపంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణ అధికారి జీ నరసింహులు స్వామి వారి శేషమాలికలను శిరస్సుపై ధరించి, మంగళవాయిద్యాల నడుమ పూజాసామగ్రిని చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అక్కడ ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాఃవచనం నిర్వహించారు. గోదావరి తీర్థ పుణ్యజలాలను అర్చకులు తలంబ్రాల బియ్యంపై చల్లారు. ఉభయ రాష్ట్రాల నుంచి భక్తులు తీసుకొచ్చిన గోటి తలంబ్రాలను సైతం వాటిలో కలిపారు. ఆస్థాన హరిదాసులు లాలలు, జోలలు, కీర్తనలు ఆలపించి స్వామివారికి డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ప్రధాన అర్చకులు సీతారామానుజాచార్యులు, విజయ రాఘవచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు



**శంషాబాద్:** జీఎమ్మార్ నేతృత్వంలోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరో ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కింది. ఎయిర్‌పోర్ట్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ), ఎయిర్‌పోర్ట్ సర్వీస్ క్వాలిటీ (ఏఎస్క్యూ) విభాగంలో శంషాబాద్ విమానాశ్రయం విజేతగా నిలిచింది. ఏసియా పసిఫిక్ రీజియన్‌కుగాను 15-25 మిలియన్ ప్యాసింజర్ పర్ ఆనం (ఎంపీపీఏ) విభాగంలో 109కి బెస్ట్ ఎయిర్‌పోర్ట్ బై సైజ్ అండ్ రీజియన్, బెస్ట్ ఎయిర్‌పోర్ట్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ యాంబియన్స్ బై సైజ్‌లో అగ్రభాగంలో నిలిచి అవార్డును కైవసం చేసుకొన్నదని జీఎమ్మార్ కమ్యూనికేషన్ అధికారికవర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. సెప్టెంబర్‌లో పోలాండ్‌లోని క్రాక్వ్‌లో జరుగనున్న ఏసీఐ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ గ్లోబల్ సమ్మిట్‌లో ఈ అవార్డును అందజేస్తారని జీఎమ్మార్ విమానాశ్రయ వర్గాలు పేర్కొన్నారు.



# ప్రతి ప్రయాణికుడికి స్క్రీనింగ్

**విమానాశ్రయంలో స్క్రీనింగ్ పరికరాలను పరిశీలించిన ఈటల**

**వ్యాధి నియంత్రణలో అప్రమత్తంగా ఉన్నామని కేంద్రానికి సీఎస్ వివరణ**



శంషాబాద్ విమానాశ్రయంలో థర్మోస్క్రీన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విమానాశ్రయంలో ప్రతి ప్రయాణికునికి కొవిడ్-19 వైరస్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కరోనా స్క్రీనింగ్ పరికరాలను మంత్రి సోమవారం పరిశీలించి వైరస్ స్కానింగ్ విధానాన్ని తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, ఎయిర్‌పోర్టుకు నిత్యం పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారని, వారిని స్కానింగ్ చెయ్యడం తప్పనిసరిఅని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టులోని నాలుగు ప్రధానదారుల వద్ద ప్రయాణికులను స్కానింగ్ చేసేందుకు వైద్యులు నర్సులు, హెల్పర్లు ఉంటారని తెలిపారు. ఎవరికైనా వైరస్ లక్షణాలుంటే.. విమానాశ్రయంలోని ప్రత్యేకగదిలోకి తీసుకువెళ్లి, ఆ వ్యక్తికి పూర్తిగా మాస్కులువేసి ప్రత్యేకద్వారం నుంచి గాంధీ దవాఖానకు తరలిస్తారని చెప్పారు. మంత్రి వెంట విమానాశ్రయ ప్రత్యేక వైద్యాధికారిణి అనూరాధ, ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ జీ శ్రీనివాస్‌రావు, డీఎంఈ రమేశ్‌రెడ్డి తదితరులున్నారు.

### కరోనా కట్టడిలో పూర్తి అప్రమత్తం

కరోనా కట్టడిలో తెలంగాణ ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగాఉందని, అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ కేంద్రానికి తెలిపారు. కరోనా నివారణకు తీసుకుంటున్న చర్యలపై కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్‌గౌబ సోమవారం రాష్ట్రాల సీఎస్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వం తీసుకున్న పకడ్బందీ చర్యల్ని సీఎస్ ఆయనకు వివరించారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఏర్పాటుచేసేందుకుగాను రెండు థర్మల్‌స్కానర్లను వెంటనే సమకూర్చాలని కోరారు. అదేవిధంగా ఎన్-95 మాస్కులను, కరోనా వైరస్ పరీక్షాకేంద్రాలు రెండింటిని వెంటనే ఏర్పాటు చేయాలని చెప్పారు. కరోనావైరస్ కట్టడికి ప్రత్యేకచర్యలు తీసుకోవాలని, వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాజీవ్‌గౌబ సూచించారు.

### మన రాష్ట్రంలో కేరళ విధానం

కరోనా విస్తరించకుండా ప్రత్యేకశ్రద్ధ చూపుతామని, ఆయా విభాగాలను అప్రమత్తం చేస్తామని కేరళ వెళ్లివచ్చిన రాష్ట్ర ప్రతినిధులు పేర్కొన్నారు. కరోనా నియంత్రణకు కేరళ విధానాలను తెలుసుకొనేందుకు ఆ రాష్ట్రం వెళ్లిన 12మందితో కూడిన రాష్ట్రబృందం ఆదివారం తిరిగివచ్చింది. ఈ బృందంలోని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్ సోమవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ, కేరళలో రాష్ట్రస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు 15 ప్రత్యేకబృందాలు ఏర్పాటుచేసి ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తున్నట్లు చెప్పారు. వైద్యులు, నర్సులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోపాటు గ్లౌజ్‌లు, మాస్కులను అందుబాటులో ఉంచారని తెలిపారు. జీవవ్యర్థాలను నిర్మూలించడంపై శ్రద్ధ పెట్టారని, గ్రామాలకు వెళ్లేవారికి కరోనా అనుమానిత లక్షణాలుంటే తక్షణచర్యలు చేపట్టేలా అన్ని పీహెచ్సీలను అప్రమత్తం చేశారని చెప్పారు.

## వినయ్‌భాస్కర్‌తో ప్రకాశ్‌రాజ్ భేటీ

- రాహుల్ సిప్లిగంజ్‌తో వచ్చి కలిసిన నటుడు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నటుడు ప్రకాశ్‌రాజ్.. ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌తో సమావేశమయ్యారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలోని ఆయన కార్యాలయంలో బిగ్‌బాస్ ఫేం రాహుల్ సిప్లిగంజ్‌తో వచ్చి కలిశారు. భేటీలో సినీరంగానికి సంబంధించిన పలుఅంశాలు చర్చకు వచ్చినట్టు తెలిసింది. ఈ సందర్భంగా ప్రకాశ్‌రాజ్ మీడియాతో మాట్లాడుతూ.. రంగమార్తాండ సినిమాకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు వినయ్‌భాస్కర్‌ను కలిసినట్టు చెప్పారు. ఇటీవల పబ్‌లో రాహుల్‌పై దాడి ఘటనలో తప్పుచేసినవారికి శిక్ష పడాల్సిందేనని అన్నారు.

## 'ప్రీకాస్ట్'పై నిట్, పీఎస్ఐ ఒప్పందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్ (నిట్), ప్రీ ఇంజినీర్డ్ స్ట్రక్చర్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఎస్ఐ) కలిసి ప్రీకాస్ట్ వినియోగాన్ని పెంపొందించేందుకు అంగీకరించాయి. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వీ రమణారావు, పీఎస్ఐ అధ్యక్షుడు సీఏ ప్రసాద్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ప్రభుత్వం చేపట్టే పలు ప్రాజెక్టుల్లో ప్రీకాస్ట్ తరహా నిర్మాణాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు సంస్థలు కలిసి వీటి వినియోగంపై పూర్తిస్థాయి అవగాహనకు సదస్సులు, సమావేశాల్ని నిర్వహిస్తాయి. నిట్ వరంగల్ తెలంగాణకు చెందిన ఇన్వెంటా ఇండస్ట్రీస్‌తో కలిసి మరో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. కార్యక్రమంలో క్రెడాయ్ నేషనల్ మాజీ అధ్యక్షుడు సీ శేఖర్‌రెడ్డి, సత్యవాణి హోమ్స్ ఎండీ సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## వరకట్నానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శిక్షణలో ఉన్న సివిల్ సర్వెంట్లు, ప్రొబేషనరీ ఇంజినీరింగ్ అధికారులు, సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్‌కు చెందిన ఏఎస్వోలు, కేంద్ర, రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు వరకట్నానికి వ్యతిరేకంగా సోమవారం ప్రతిజ్ఞచేశారు. రన్ ఫర్ విమెన్స్ రైట్స్ నినాదంతో మినీ మారథాన్ నిర్వహించారు. ఎంసీఆర్ హెచ్చార్డీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంసీఆర్ హెచ్చార్డీ అదనపు డీజీ హర్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ.. వరకట్న సామాజిక రుగ్మతను నిరోధించడంలో యువత ముఖ్యపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

# రాజీవ్ స్వగృహకు పరిష్కారం

- మధ్యతరగతి జీవుల సొంతింటి కల త్వరలో సాకారం
- రూ.వెయ్యి కోట్ల అప్పు ఎగ్గొట్టిన అప్పటి ఉమ్మడి ప్రభుత్వం
- అప్పుతీర్చి భూములను విడిపించిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమైక్య పాలకులు ఏడేండ్ల క్రితం వదిలేసి వెళ్లిన రాజీవ్ స్వగృహ ఇండ్లను తెలంగాణ ప్రభుత్వం కొలిక్కి తెస్తున్నది. రాజీవ్ స్వగృహ కింద 36 ప్రాజెక్టులు చేపట్టిన నాటి పాలకులు తెలంగాణలోని భూములను తనఖాపెట్టి బ్యాంకుల నుంచి రూ.1,000 కోట్ల అప్పు తీసుకొన్నారు. అందులో ఒక్క రూపాయి కూడా తిరిగి చెల్లించకుండా తెలంగాణ ప్రభుత్వంపై భారం మోపారు. మూడేండ్ల క్రితం తెలంగాణ ప్రభుత్వం ఈ అప్పుతోపాటు రూ.1,200 కోట్ల వడ్డీని బ్యాంకులకు చెల్లించి తనఖాలో ఉన్న 784 ఎకరాల భూములను విడిపించింది. ఇప్పుడు ఆ భూములను లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఇటీవల జరిగిన క్యాబినెట్ భేటీలో సీఎం కేసీఆర్ దీనిపై నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో ఫ్లాట్లు బుక్‌చేసుకొన్న లబ్ధిదారులకు తొలి ప్రాధాన్యమిచ్చి మిగిలిన ఫ్లాట్లను మార్కెట్ ధర ప్రకారం అమ్మాలని భావిస్తుండటంతో మధ్యతరగతి వర్గాల సొంతింటి కల త్వరలో సాకారం కానున్నది.



### నిలువునా ముంచారు

2007లో రూ.6,400 కోట్లతో రాజీవ్‌స్వగృహ ప్రారంభమైంది. 36 ప్రాజెక్టుల్లో 20 తెలంగాణలో, 16 ఏపీలో చేపట్టారు. ఈ ప్రాజెక్టు ప్రారంభమైనప్పుడే చాలామంది రూ.5 వేలు చొప్పున చెల్లించి ఫ్లాట్లను బుక్‌చేసుకున్నారు. ఈ ఇండ్ల నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.350 కోట్లు విడుదల చేయగా.. అడ్వాన్స్ బుకింగ్ రూపంలో కొనుగోలుదారుల నుంచి రూ.370 కోట్లు రాబట్టారు. ఈ నిధులతో 2011 వరకు కొంత పని పూర్తిచేశారు. ఆ తర్వాత బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. ఈ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించేందుకు 2012లో ఉన్నతాధికార కమిటీని నియమించిన కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం.. 2013లో పేదల ఆశలకు గండికొడుతూ జీవో 11ను విడుదల చేసింది. రాజీవ్ స్వగృహ ఇండ్లను నిర్మించలేమని, అడ్వాన్స్ చెల్లించినవారికి డబ్బు వాపసు ఇవ్వాలని ఆ జీవోలో పేర్కొనడంతో పనులన్నీ ఎక్కడికక్కడే ఆగిపోయాయి. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఇండ్ల నిర్మాణంపై దృష్టిపెట్టింది. తెలంగాణలోని 14 ప్రాజెక్టుల్లో నిర్మాణాలు చేపట్టి దాదాపు 3,716 ఫ్లాట్ల నిర్మాణాలను 96 శాతం మేరకు పూర్తిచేసింది. మరో 5,280 ఫ్లాట్లు 639 ఇండిపెండెంట్ ఇండ్లు సెమీ ఫినిషింగ్‌లో ఉన్నాయి. వీటితోపాటు అన్ని ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లు సిద్ధంగా ఉన్నాయి.



## ఎములాడలో భక్తుల రద్దీ

**వేములవాడ కల్చరల్:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో సోమవారం భక్తుల రద్దీ నెలకొన్నది. భక్తులు వేకుమజాము నుంచే భారీగా తరలివచ్చారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, తలనీలాలను సమర్పించుకొని కోడెమొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీని దృష్ట్యా ఆర్జితసేవలను రద్దుచేశారు. రాజన్నను దాదాపు 10 వేల మందికి పైగా భక్తులు దర్శించుకోగా.. వివిధ టికెట్ల ద్వారా సుమారు రూ.9 లక్షల ఆదాయం సమకూరినట్టు అధికారులు వెల్లడించారు.

# వెదురుదే భవిష్యత్

- ఇతర రకాల కలపకు ఇది ప్రత్యామ్నాయం
- రాష్ట్రంలో సాగుకు అపార అవకాశాలు
- మహారాష్ట్రలోని పరిశ్రమలను సందర్శించిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



మహారాష్ట్రలోని సింధ్ దుర్గ్ జిల్లాలోని వెదురు పరిశ్రమను సందర్శించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్. చిత్రంలో టీఆర్ఎస్ మల్కాజిగిరి ఇంచార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వెదురు సాగుకు చాలా అవకాశాలున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. భవిష్యత్‌లో టేకు, ఇతర రకాల కలపకు ఇది ప్రత్యామ్నాయంగా మారుతుందని చెప్పారు. సోమవారం ఆయన వెదురు నిపుణుల బృందంతో కలిసి మహారాష్ట్రలోని సింధ్‌దుర్గ్ జిల్లా కుడాల్ ప్రాంతంలోని వెదురు పరిశ్రమలను సందర్శించారు. అక్కడి రైతులతో మాట్లాడి, విజయగాథలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇండ్ల నిర్మాణంలో విరివిగా వాడుతున్న టేకు, ఇతర కలపకు రానున్నరోజుల్లో కొరత ఏర్పడి, వెదురు ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. కలప దొరకనిచోట వెదురుతో తయారయ్యే పెద్దపెద్ద చెక్కలు, డోర్లు, కిటికీలు, ఫ్లోరింగులు ప్రత్యామ్నాయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. వెదురు బద్దలను ఒకదానితో ఒకటి కలిపి, ప్రెస్సింగ్ చేసి, భారీ హీటర్ల సాయంతో చెక్కలుగా మలుస్తారని, వీటిని తలుపులు, కిటికీలుగా తయారుచేసుకోవచ్చన్నారు. వాతావరణ కాలుష్యం నివారణకు కూడా వెదురుసాగు దోహదపడుతుందని చెప్పారు. ఈ పర్యటనలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంచార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ ఎల్ వెంకట్రాంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ (ఆస్కి) డైరెక్టర్ అచీలేందర్‌రెడ్డి, ఎన్నారై శ్రీనివాస్ గోగినేని, కెనడా దేశ వెదురు నిపుణులు సుధీర్ కోదాటి, కృష్ణ కోమండ్ల తదితరులు పాల్గొన్నారు.

### వెదురుతో బహుళ లాభాలు

దేశంలో వెదురుసాగును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 2004లో నేషనల్ బ్యాంబు మిషన్‌ను ఏర్పాటుచేసింది. దీనిని 2017లో మరింత బలోపేతం చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో కుడాల్ ప్రాంత రైతులు వెదురుసాగు చేపట్టి, మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. గడ్డి జాతికి చెందిన వెదురు వ్యవసాయానికి యోగ్యంకాని, రాళ్లు, రప్పలతో కూడిన భూముల్లో, ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా అవలీలగా పెరుగుతుంది. వెదురు మొక్కలను నాటిన నాలుగో ఏడాది నుంచి కోతకు వస్తుంది. ఎన్నిసార్లు కోసినా మళ్లీ మళ్లీ మొలకెత్తి, ప్రతి ఏటా ఆదాయాన్నిస్తుంది. వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చి, ఆక్సిజన్‌ను విడుదలచేసే వెదురు కాలుష్య నివారణలోనూ సహాయపడుతుంది.

## కృష్ణాతీరంలో కొనసాగుతున్న దాడులు

- నమస్తే తెలంగాణ కథనానికి స్పందన



కోతిగుండు ప్రదేశంలో కృష్ణానది నీటిలో నాటుపడవలో దాచిన అలివి వలను స్వాధీనం చేసుకున్న మత్స్యశాఖ సిబ్బంది

**కొల్లాపూర్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రాదళారులు మత్స్యసంపదను కొల్లగొడుతున్న వైనంపై నమస్తే తెలంగాణలో ప్రచురితమైన 'అలివిగాని వల' కథనానికి అనూహ్య స్పందన లభిస్తున్నది. మూడ్రోజులుగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ ప్రాంతంలోని కృష్ణానదీతీరంలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ అలివి వలలను స్వాధీనం చేసుకుంటున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అధికారులు కొల్లాపూర్ మండలం సోమశిల, అమరగిరి, కోతిగుండు, ఎర్రగుట్టలు, పాతబొల్లారం, చీమలతిప్ప తదితర ప్రాంతాల్లో మరబోటుతో గాలింపు చేపట్టారు. అనంతరం కోతిగుండు ప్రదేశంలో ఓ ఆంధ్రాజాలరి నాటుపడవలో దాచిన అలివివలను స్వాధీనం చేసుకొని కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## హోలీ వదిలి.. ప్రగతి బాటలో కదిలి



**భూపాలపల్లి టౌన్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాశీంపల్లి వాసులు హోలీ వదిలి.. ప్రగతిబాట పట్టారు. కరోనా వైరస్ ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న నేపథ్యంలో ఇక్కడి వాసులు హోలీ పండుగకు దూరంగా ఉండాలని భావించారు. అదే సమయంలో ప్రోగ్రెస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికులు చీపుర్లు పట్టి వీధులను శుభ్రం చేశారు.

# ఆధారాల గుట్టురట్టు!

**కీలక కేసుల ఛేదనలో సూపర్‌లైట్ టెక్నాలజీ.. ఇటీవల కరీంనగర్ రాధిక కేసు పరిష్కారం**

**దేశంలోనే అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న తెలంగాణ పోలీస్ క్లూస్‌టీం**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

నేరాలకు పాల్పడే దుండగులు కొందరు కేసుల నుంచి తప్పించుకునేందుకు పక్కాగా స్కెచ్‌వేస్తారు. రక్తపుమరకలు తుడిచివేయడం, హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని మాయంచేయడం, సాక్ష్యాధారాలేవీ లేకుండాచేయడం వంటిచర్యలకు పాల్పడుతారు. ఇటువంటి కరుడుగట్టిన నేరగాళ్లను పట్టుకోవడం పోలీసులకు పెద్దసవాలు. అయితే ఎన్నో సంక్లిష్టమైన కేసులను సాంకేతికసాయంతో ఛేదించి భేష్ అనిపించుకుంటున్నారు తెలంగాణ పోలీసులు. రాష్ట్ర పోలీసులు ఉపయోగిస్తున్న 'సూపర్‌లైట్ టెక్నాలజీ' దేశంలోనే ఆధునికమైనది. ఇటీవల కరీంనగర్‌లో రాధిక అనే యువతి హత్యకేసును ఇదే సూపర్‌లైట్ టెక్నాలజీ సాయంతో ఛేదించారు. రాధిక తండ్రి ముత్తకొమురయ్య రక్తపుమరకలు అంటిన తన బనీనును ఉతికేసినా ఈ టెక్నాలజీతో హైదరాబాద్ క్లూస్‌టీం పోలీసులు పట్టుకున్నారు.

### పైకి కనిపించని మరకలను పట్టేస్తుంది

జర్మనీకిచెందిన ఈ సూపర్ లైట్ టెక్నాలజీని 2017 నుంచి హైదరాబాద్ సిటీ పోలీసులు వినియోగంలోకి తెచ్చారు. సామర్థ్యాన్నిబట్టి రెండురకాల సూపర్‌లైట్లను వాడుతున్నారు.

### సూపర్‌లైట్ ఇలా పనిచేస్తుంది..

- క్రైంసీన్‌లో పూర్తిగా వెలుతురు లేకుండాచేసి, అప్పుడు సూపర్‌లైట్ వేస్తారు. సూపర్‌లైట్ నీలం రంగు వెలుతురులో ఆ ప్రాంతంలోని రక్తపు మరకలను నల్లటి రంగులో గుర్తిస్తుంది.
- రక్తపు మరకలతోపాటు వీర్యం, వెంట్రుకలు, బూటు లేదా కాలిముద్రలు, వేలిముద్రలను ఈ సూపర్‌లైట్‌తో గుర్తించవచ్చు.
- కేవలం గోడలు, నేలపైనే కాకుండా దుస్తులపై చెరిపివేసిన మరకలు సైతం కనిపిస్తాయి. ఇలా మరకలను గుర్తించిన తర్వాత సూపర్‌లైట్‌ను ఆర్పివేసి, ఆ మరకలపై బ్లూస్టార్ లేదా ల్యుమినాల్ అనే ద్రావణాలు చల్లుతారు. అప్పుడు ఆధారాలు ఉన్న ప్రదేశం నీలం రంగులోకి మారుతుంది. ఇలా శాంపిల్స్‌ను సేకరిస్తారు.

ఈ సూపర్‌లైట్ టెక్నాలజీని దిశ కేసులోనూ క్లూస్ సిబ్బంది కీలకంగా వాడారు. 2018 ఫిబ్రవరిలో ఉప్పల్‌లో కలకలంరేపిన బాలిక నరబలి కేసులోనూ కీలక ఆధారాలు ఈ సూపర్‌లైట్ టెక్నాలజీతోనే కనుగొన్నారు. నిందితుడు క్యాబ్ డ్రైవర్ రాజశేఖర్ తన ఇంట్లో రక్తపుమరకలను కడిగేసినప్పటికీ బండలమధ్య సందుల్లో ఉన్న రక్తపు అవశేషాలను ఈ సాంకేతికతతో గుర్తించిన విషయం తెలిసిందే.



30వాట్స్ సామర్థ్యం ఉన్న సూపర్‌లైట్లు చిన్నవి. ఇవి ప్రస్తుతం ప్రతిజిల్లాలోనూ అందుబాటులో ఉన్నాయి. 200 వాట్స్‌తో కూడిన అత్యంత శక్తిమంతమైన సూపర్‌లైట్ కేవలం హైదరాబాద్ క్లూస్‌టీం వద్ద మాత్రమే ఉన్నది. దీనిని కీలక కేసుల దర్యాప్తులో వాడుతున్నాం.

- డాక్టర్ వెంకన్న, హైదరాబాద్ క్లూస్‌టీం హెచ్‌వోడీ


తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ, హైదరాబాద్,
గగన్ విహార్, 4వ అంతస్తు, నాంపల్లి, హైదరాబాద్
ఆర్.సి.నెం.9/టియస్.ఆర్.జె.సి.సెట్/2020, తేది: 03-03-2020
తెలంగాణ రాష్ట్ర గురుకుల (రెసిడెన్షియల్) జూనియర్ కాలేజీలలో ప్రవేశం కొరకు
TSRJC-CET (టియస్.ఆర్.జె.సి.-సెట్)-2020
ప్రవేశ పరీక్షా ప్రకటన
తెలంగాణ రాష్ట్ర గురుకుల (రెసిడెన్షియల్) జూనియర్ కాలేజీలలో 2020-21 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఇంగ్లీషు మీడియం-MPC/BPC/MEC) లో 35 తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశం కొరకు తేది. 10-05-2020 నాడు జరుగు TSRJC-CET-2020 ప్రవేశ పరీక్షకు మార్చి-2020లో 10వ తరగతి పరీక్షకి హాజరౌతున్న తెలంగాణ 33 జిల్లాల విద్యార్థుల నుండి ఆన్ లైన్ (http://tsrjdc.cgg.gov.in) ద్వారా దరఖాస్తులు తేది. 16-03-2020 నుండి 15-04-2020 వరకు కోరబడుచున్నవి. దరఖాస్తు రుసుము: రూ.200/-. ప్రవేశ పరీక్షలో ప్రతిభ మరియు రిజర్వేషన్ ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగును. ఇతర వివరాల కొరకు http://tsrjdc.cgg.gov.in లో పొందపర్చిన ఇన్ఫర్మేషన్ బుల్లెటిన్ చూడవచ్చును. వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 040-24734899, 9490967222.
DIPR RO No.827-PP/CL/Advt/1/2019-20, Dt: 7/3/2020
సం/- కార్యదర్శి

# జలుబు, దగ్గుతో రావొద్దు

- భక్తులకు టీటీడీ అధికారుల సూచన



**తిరుమల:** కరోనా వైరస్ నేపథ్యంలో టీటీడీ అధికారులు తిరుమల శ్రీవారి దర్శనంపై ఆంక్షలు విధించారు. కరోనా వైరస్ లక్షణాలైన జలుబు, దగ్గుతో బాధపడుతున్న భక్తులు తిరుమలకు రావొద్దని సలహా ఇచ్చారు. కరోనా వైరస్ విస్తరిస్తున్న దృష్ట్యా జలుబు, దగ్గు ఉన్నవారికి దర్శనం కల్పించకుండానే వెనక్కి పంపించాలని టీటీడీ అధికారి సిబ్బందిని ఆదేశించారు. ఇలాంటి లక్షణాలతో ఎవరైనా భక్తులు కనిపిస్తే వారిని వెంటనే స్విమ్స్‌కు తరలించాలని ఆలయ అధికారులు తెలిపారు. ముందు జాగ్రత్తచర్యగా భక్తులు సానిటైజర్, మాస్కులు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

# నదిలో తేలిన సంగమేశ్వరాలయం

- పౌర్ణమి సందర్భంగా భక్తుల ప్రత్యేక పూజలు

**కొల్లాపూర్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో కృష్ణానది (అవతలి భాగం)లో మునిగి ఏడునెలల తర్వాత బయల్పడిన సంగమేశ్వరాలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీలోని కర్నూల్ జిల్లా ఆత్మకూరు తాలూకా పరిధిలో ఉన్న ఆలయం కృష్ణానదిలో ప్రతి ఏడాది వరద వచ్చినప్పుడు మునిగిపోతుంది. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టడంతో సంగమేశ్వర ఆలయం నీటినుంచి తేలింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ ప్రాంత ప్రజలు పూజలు నిర్వహించారు. సోమశిల నుంచి మరబోటులో అవతలి వైపు ఉన్న ఆలయానికి చేరుకొని శివలింగానికి పూజలు చేశారు.



ఆలయంలోని శివుడి విగ్రహం



కృష్ణానది నీటిలో తేలిన సంగమేశ్వర ఆలయం




ఐసీఎమ్మార్ అధ్యయనంలో వెల్లడి

# శాకాహారంలోనే కొవ్వెక్కువ!

- ఢిల్లీలో ఎక్కువగా అదనపు కొవ్వుల వినియోగం
- ఈ జాబితాలో చివరిస్థానంలో హైదరాబాద్ నగరం
- రోజువారీగా పురుషులు 34.1 గ్రాములు, మహిళలు 31.1 గ్రాముల వాడకం
- సగటున ఢిల్లీలో 44.4 గ్రాములు, హైదరాబాద్‌లో 25.1 గ్రాములు



కొవ్వు ఏఏ పదార్థాల్లో ఎక్కువగా ఉంటుందని ఎవరిని అడిగినా మాంసాహారంలోనే అని నిస్సందేహంగా చెప్పేస్తారు. అయితే గమ్మత్తైన విషయం ఏమిటంటే.. శాకాహారంలోనే కొవ్వు శాతం అధికంగా ఉంటున్నదని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎమ్మార్) అధ్యయనంలో తేలింది. శాకాహారులు రోజుకు సగటున 40.7 గ్రాముల కొవ్వును వినియోగిస్తే, మాంసాహారులు సగటున 30.2 గ్రాములు వినియోగిస్తున్నారని వెల్లడయింది.




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రోజువారీగా స్నాక్స్, పరాఠా, మటన్ బిర్యానీ వంటి ఆహార పదార్థాల రూపంలో అదనపు కొవ్వును వినియోగించడంపై అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, ముంబై మెట్రో నగరాల్లో ఐసీఎమ్మార్ సర్వే నిర్వహించింది. ఈ జాబితాలో ఢిల్లీ మొదటిస్థానంలో, హైదరాబాద్ చివరిస్థానంలో నిలిచింది. ఢిల్లీ నగరంలో అదనపు కొవ్వు పదార్థాల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్నది. అక్కడ రోజుకు సగటున 44.4 గ్రాముల కొవ్వులను వివిధ రూపాల్లో తీసుకొంటుండగా.. 43.9 గ్రాములతో రెండోస్థానంలో అహ్మదాబాద్ నిలిచింది. ముంబై, హైదరాబాద్ నగరాలు వరుసగా 28.8 గ్రాములు, 25.1 గ్రాముల వినియోగంతో చివరి రెండుస్థానాల్లో ఉన్నాయి. ఐసీఎమ్మార్ సూచించిన మేరకు మనం నిత్యం 20 గ్రాముల కొవ్వు పదార్థాలను తీసుకోవాల్సి ఉండగా.. ఆ స్థాయిని దాటి నట్టు అధ్యయనంలో తేలింది.

### పురుషులే ఫస్ట్

ఏడు మెట్రో నగరాల్లో సగటున మహిళల కంటే పురుషులే అధికంగా కొవ్వులను వినియోగిస్తున్నారు. మహిళలు 31.1 గ్రాముల కొవ్వు పదార్థాలను తీసుకొంటుండగా, పురుషులు 34.1 గ్రాములు తింటున్నారు. దాల్‌ఫ్రై, అన్నం, పరాఠా, చుడువా వంటి ఆహారాల్లో కొవ్వు అధికంగా ఉంటున్నది. చికెన్ బిర్యానీ కంటే మటన్ బిర్యానీలోనే అధిక కొవ్వు ఉంటుందని స్పష్టమైంది. ఉడికించిన, మామూలుగా వేయించిన ఆహారం తినేవారి కంటే బాగా వేయించిన ఆహారం తినేవారిలోనే కొవ్వు శాతం ఎక్కువగా ఉన్నదని అధ్యయనం పేర్కొన్నది. అదనపు కొవ్వులను వినియోగించేవారిలో 36 ఏండ్ల నుంచి 59 ఏండ్లలోపువారే అధికంగా ఉన్నారు. వీరు సగటున రోజుకు 36.1 గ్రాములు తీసుకొంటుండగా.. 18 ఏండ్ల నుంచి 35 ఏండ్లలోపువారు సగటున 32.8 గ్రాముల అదనపు కొవ్వులను వినియోగిస్తున్నారు.

- నిత్యం వినియోగం **పురుషులు:** 34.1 గ్రాములు **మహిళలు:** 31.1 గ్రాములు
- 36 ఏండ్ల నుంచి 59 ఏండ్లలోపువారు సగటున రోజుకు 36.1 గ్రాములు
- 18 ఏండ్ల నుంచి 35 ఏండ్లలోపువారు సగటున రోజుకు 32.8 గ్రాములు
- ఐదేండ్లలోపు పిల్లలు సగటున రోజుకు 15.7 గ్రాముల అదనపు కొవ్వులు
- దాల్‌ఫ్రై, అన్నం, పరాఠా, చుడువాలో అధికంగా కొవ్వులు
- చికెన్ బిర్యానీ కంటే మటన్ బిర్యానీలోనే కొవ్వెక్కువ
- బాగా వేయించిన ఆహారం తినేవారిలో కొవ్వు శాతం అధికం

# నిజాం భవనానికి నకిలీ హక్కుదార్లు!

- నజ్రీబాగ్ ప్యాలెస్ ఒకరికి తాకట్టు, మరొకరికి విక్రయం
- రూ.110 కోట్ల మేర మోసం.. నలుగురిపై కేసు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తమదికాని భవనాన్ని నకిలీ పత్రాలు సృష్టించి ఒకరికి అమ్ముకోవడమే కాకుండా, అదే భవనాన్ని వేరొక సంస్థ వద్ద తాకట్టు పెట్టి వంద కోట్లకుపైగా సొమ్మును మింగిన ఉదంతం తాజాగా హైదరాబాద్‌లో వెలుగుచూసింది. తాకట్టుపెట్టిన భవనాన్ని అమ్ముకున్నారన్న ఆరోపణపై బషీర్‌బాగ్‌కు చెందిన ఆషి రియల్టర్స్ నిర్వాహకులు సుఖేష్‌గుప్తా, నీతూగుప్త, ముంబైకి చెందిన నిహారిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన సురేశ్‌కుమార్, రవిచంద్రన్‌పై కేసు నమోదైంది. కింగ్‌కోఠిలోని నజ్రీబాగ్ ప్యాలెస్‌ను రూ.110 కోట్ల కింద బంజారాహిల్స్‌లోని ఎస్‌ఆర్‌ఈఐ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు తాకట్టుపెట్టిన నిందితులు ఆ సంస్థకు తెలియకుండానే కశ్మీర్‌కు చెందిన ఐరిస్ హాస్పిటాలిటీకి దానిని విక్రయించినట్టు తెలిసింది. ఎస్‌ఆర్‌ఈఐ సంస్థ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ ఫిర్యాదుమేరకు సీసీఎస్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదే భవనం విక్రయానికి సంబంధించి ముంబై ఆర్థిక నేరాల విభాగంలో కూడా గత ఏడాది రవిచంద్రన్, సురేశ్‌కుమార్‌పై కేసు నమోదైంది.

నిజాం వైభవానికి ప్రతీకగా ఉన్న భవనాల్లో కింగ్‌కోఠిలోని నజ్రీబాగ్ ప్యాలెస్ (పరదాగేట్) ఒకటి. ఈ భవనానికి జీపీఏగా ఉన్న ఎస్తా నుంచి ముంబైకి చెందిన నిహారిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే రియల్‌ఎస్టేట్ సంస్థ నాలుగేండ్ల క్రితం రూ.150 కోట్లకు కొనుగోలుచేసింది. ఆ సంస్థలో పనిచేసిన రవిచంద్రన్, సురేశ్‌కుమార్ ఆషి రియల్టర్స్ నిర్వాహకులు సుఖేశ్‌గుప్తా, నీతూగుప్తాతో కుమ్మక్కై నజ్రీబాగ్ ప్యాలెస్‌కు సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి 2018లో ఎస్‌ఆర్‌ఈఐ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ సంస్థవద్ద తాకట్టుపెట్టి రూ.110 కోట్లు రుణం తీసుకున్నారు. నజ్రీబాగ్ ప్యాలెస్‌తోపాటు హఫీజ్‌పేట్‌లోని ఎనిమిదెకరాల స్థలాన్ని కూడా తాకట్టు పెట్టారు. గడువులోగా రుణాన్ని చెల్లించకపోవడంతో ఫైనాన్స్ సంస్థ తాకట్టు ఉన్న ఆస్తులను వేలంవేసింది. హఫీజ్‌పేట్ స్థలాన్ని వేలంవేయగా రూ.102 కోట్లు వసూలయ్యాయి. మిగిలిన అసలు, వడ్డీని రాబట్టుకునేందుకు నజ్రీబాగ్ ప్యాలెస్ వేలానికి ప్రయత్నించింది. అప్పటికే ఆ భవనాన్ని మరో సంస్థకు విక్రయించినట్టు గుర్తించి జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, నజ్రీబాగ్ ప్యాలెస్‌ను మొదట కొనుగోలుచేసిన నిహారిక సంస్థ ప్రతినిధులు గత ఏడాది భవనాన్ని స్వాధీనం చేసుకొనేందుకు హైదరాబాద్ వచ్చారు.




నజ్రీబాగ్ ప్యాలెస్

## పోలవరం సీఈవోగా చంద్రశేఖర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవోగా జే చంద్రశేఖర్ అయ్యర్ నియమితులయ్యారు. ప్రస్తుతం గోదావరి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా ఉన్న చంద్రశేఖర్.. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం కేంద్ర జల వనరులశాఖ డిప్యూటీ సెక్రటరీ స్మితా సారంగి ఉత్తర్వులు జారీచేశారు.

## క్లినికల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్‌పై పిల్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్టరింగ్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్ 2010 అమలుకు క్లినికల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్‌ను, ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయాలని, నిబంధనల అమలుకు ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టులో పిల్ దాఖలైంది. ఫోరం అగైనెస్ట్ కరప్షన్ అధ్యక్షుడు విజయ్‌గోపాల్ ఈ పిటిషన్ దాఖలుచేశారు. 2010లో పార్లమెంటు ఆమోదం పొందిన ఈ చట్టాన్ని 2012లో కేంద్రం నోటిఫై చేసిందని, 2017లో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం ద్వారా చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చిందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని హాస్పిటళ్లలో కనీస ప్రమాణాలు, నాణ్యతను పాటించేలా పర్యవేక్షణ జరిపేందుకు స్టేట్ కౌన్సిల్ ఫర్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్, జిల్లాస్థాయిలో డిస్ట్రిక్ట్ రిజిస్టరింగ్ అథారిటీలను ఏర్పాటుచేసేలా ఆదేశాలు జారీచేయాలని హైకోర్టుకు విజ్ఞప్తిచేశారు. కనీస ప్రమాణాలు, నాణ్యత పాటించని సంస్థలపై చర్యలు తీసుకునే అధికారం ఈ సంస్థలకు ఉంటుందని పేర్కొన్నారు.

## బీజేపీకి త్వరలో కొత్త సారథి!

- 19 జిల్లాల అధ్యక్షులను ప్రకటించిన అధిష్ఠానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బీజేపీ రాష్ట్రశాఖకు కొత్త అధ్యక్షుడి నియామకం త్వరలో ఖరారు కానున్నది. ఈ నెలలోనే కొత్త సారథిని ఎంపిక చేయాలని పార్టీ అగ్రనేతలు భావిస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్ పలు అంశాల్లో విఫలమవడంతో ఆయనపై పలువురు నేతలు అధిష్ఠానానికి ఫిర్యాదుచేశారు. ఈ పరిస్థితుల్లో అధ్యక్ష హోదాలో కొనసాగేందుకు లక్ష్మణ్ సుముఖంగా లేకపోవడంతో.. కొత్త అధ్యక్షుడి నియామకం అనివార్యమవుతున్నది. మరోవైపు రాష్ట్రంలోని 19 జిల్లా శాఖలకు కొత్త అధ్యక్షులను అధిష్ఠానం ఇప్పటికే ప్రకటించింది.

## దత్తాత్రేయకు స్వల్ప అస్వస్థత

- ఛాతిలో నొప్పికి అపోలో దవాఖానలో చికిత్స

**హిమాయత్‌నగర్:** హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సోమవారం ఉదయం అల్పాహారం అనంతరం సిమ్లా బయల్దేరే సమయంలో ఛాతిలో నొప్పిరావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆయనను హైదర్‌గూడలోని అపోలో దవాఖానలో చేర్పించారు. సీనియర్ కార్డియాలజిస్ట్ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో వైద్యులు దత్తాత్రేయకు చికిత్స అందించారు. వివిధ పరీక్షలు జరుపగా నార్మల్ అని నివేదికలు వచ్చాయని దవాఖాన జాయింట్ డైరెక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. దాదాపు 5 గంటలపాటు దవాఖానలో చికిత్స తీసుకొన్న అనంతరం మధ్యాహ్నం 3:30 గంటలకు డిశ్చార్జి అయ్యారు.

# కొత్త రాష్ట్రం.. భారీ బాధ్యత!

- పెద్ద రాష్ట్రాలతో అభివృద్ధిలో పోటీ
- దేశాభివృద్ధిలో తెలంగాణ కీలకపాత్ర
- ఏటేటా పెరుగుతున్న భాగస్వామ్యం
- ఆరేండ్లలో 3.95 శాతం నుంచి 4.52 శాతానికి వృద్ధిరేటు



**స్థిర ధరల వద్ద జీడీపీలో తెలంగాణ వాటా వివరాలు**

| సంవత్సరం | దేశ స్థూల ఉత్పత్తి (జీడీపీ.. రూ. కోట్లలో) | రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీడీపీ.. రూ. కోట్లలో) | జీడీపీలో రాష్ట్రం వాటా |
|---|---|---|---|
| 2013-14 | 98,01,370 | 3,89,957 | 3.98 |
| 2014-15 | 1,05,27,674 | 4,16,332 | 3.95 |
| 2015-16 | 1,13,69,493 | 4,64,542 | 4.09 |
| 2016-17 | 1,23,08,193 | 5,07,946 | 4.13 |
| 2017-18 | 1,31,75,160 | 5,59,492 | 4.25 |
| 2018-19 | 1,39,81,426 | 6,12,828 | 4.38 |
| 2019-20 | 1,46,83,835 | 6,63,258 | 4.52 |

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ వయసు చిన్నదైనా భారీ బాధ్యతను నిర్వర్తిస్తున్నది. ఆరేండ్ల క్రితమే ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించినప్పటికీ అరవై ఏండ్ల వయసున్న పెద్ద రాష్ట్రాలతో అభివృద్ధిలో పోటీపడుతున్నది. దేశాభివృద్ధిలో భాగస్వామ్యాన్ని గణనీయంగా పెంచుకొంటూ ముందుకుసాగుతున్నది. తెలంగాణ వార్షిక బడ్జెట్ ప్రతిపాదన సందర్భంగా ఆదివారం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే-2020 గణాంకాలు దీన్ని స్పష్టం చేస్తున్నాయి. 2014 జూన్ 2న కొత్త రాష్ట్రంగా అవతరించిన నాటినుంచే తెలంగాణ దూకుడుగా ముందుకు సాగుతున్నది. వాస్తవానికి మనది ధనిక రాష్ట్రం. ఇదే విషయాన్ని ఉద్యమ సారథి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పక్కా లెక్కలతో చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన వెంటనే తెలంగాణ ప్రజలు పాలనాపగ్గాలను ఉద్యమ నేత కేసీఆర్‌కే అప్పగించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే గురుతరబాధ్యతను ఆయన భుజస్కంధాలపై మోపారు. ఈ బాధ్యతను అత్యంత సమర్థంగా నిర్వర్తిస్తున్న సీఎం కేసీఆర్.. తెలంగాణలోని ప్రతి వనరును ఒద్దికగా ఒడిసిపట్టుకొని పక్కా ప్రణాళికతో రాష్ట్రాన్ని పకడ్బందీగా ముందుకు నడుపుతున్నారు. ఫలితంగా నేడు తెలంగాణ దేశంలోని అనేక పెద్ద రాష్ట్రాలతో పోటీపడుతూ ఆర్థికాభివృద్ధిలో దూసుకెళ్తున్నది.

### కేంద్రం సహకరించకపోయినా..

29వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ.. కేంద్రం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు లభించకపోయినా దేశాభివృద్ధిలో పెద్ద బాధ్యతనే నిర్వర్తిస్తున్నది. జనాభాతోపాటు వైశాల్యపరంగా తెలంగాణ అనేక రాష్ట్రాల కంటే చిన్నదైనప్పటికీ ఆర్థికాభివృద్ధిలో, స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జీఎస్డీపీ)లో వృద్ధిలో జోరుగా ముందుకుసాగుతున్నది. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో ఎవరికీ తీసిపోని రీతిలో తన భాగస్వామిగా ఉండటం కేవలం తెలంగాణే చెల్లిందని సామాజిక ఆర్థిక సర్వే-2020 గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

### దేశాభివృద్ధికి తనవంతుగా..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు స్థిర ధరల వద్ద దేశ జీడీపీ రూ.98,01,370 కోట్లు. దీనిలో తెలంగాణ వాటా రూ.3,89,957 కోట్లు (3.98 శాతం)గా ఉన్నది. కొత్తలో విద్యుత్ రంగంలో అంధకారం నెలకొనడం అన్నిరంగాలపై ప్రభావం చూపింది. ఉద్యోగుల విభజన, ఆర్థికపర అంశాల్లో గందరగోళంతో తెలంగాణ తన కాళ్లపై తాను నిలబడటానికి కొంత సమయం పట్టింది. 2014-15లో రూ.1,05,27,674 కోట్లుగా ఉన్న జీడీపీలో తెలంగాణ వాటా రూ.4,16,332 కోట్లు. వృద్ధిరేటులో పోల్చుకొంటే 2013-14లో జాతీయ సగటు (7.4 శాతం) కంటే తెలంగాణ (6.8 శాతం) స్వల్పంగా వెనుకబడింది.

### ఆగని పరుగులు

సీఎం కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన వినూత్న చర్యలు, విప్లవాత్మక పథకాలతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, జీఎస్డీపీ జాతీయ సగటును అధిగమించడంతోపాటు దేశ జీడీపీలో తెలంగాణ తన వాటాను గణనీయంగా పెంచుకొంటూ పలు పెద్ద రాష్ట్రాలకు దీటుగా ముందుకుసాగుతున్నది. స్థిర ధరల వద్ద 2014-15 నాటికి జీడీపీలో 3.95 శాతంగా ఉన్న తెలంగాణ వాటా 2019-20లో 4.52 శాతానికి పెరిగింది. ప్రస్తుత ధరల వద్ద జీడీపీలో తెలంగాణ వాటా 4.76 శాతంగా నమోదవడం గమనార్హం. అంటే గత ఆరేండ్లుగా జీడీపీకి గణనీయ వాటాను అందజేస్తున్న తెలంగాణ అభివృద్ధిలో అనేక రాష్ట్రాలను అధిగమించి పరుగులు తీస్తున్నది. అందుకే దేశంలోని పలు రాష్ట్రాలకు తెలంగాణ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నది.

# ప్రహసనం వీడి ప్రవాహం

- అందుబాటులోకి దశాబ్దాలనాటి పెండింగ్ ప్రాజెక్టులు
- చిత్తశుద్ధితో పూర్తిచేసిన తెలంగాణ ప్రభుత్వం
- 2019-20లో రూ.6,670 కోట్ల వరకు వ్యయం
- పాత పాలమూరులోనే సాగులోకి ఎనిమిది లక్షల ఎకరాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏటేటా అంచనావ్యయం పెరుగుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో దశాబ్దాలపాటు ఆన్‌గోయింగ్ జాబితాలో చేరిన పెండింగ్ ప్రాజెక్టులను తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పూర్తిచేసింది. రీడిజైనింగ్ ప్రాజెక్టుల పనులను వేగంగా కొనసాగిస్తూనే.. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులపైనా ప్రత్యేక దృష్టిసారించింది. వీటి పూర్తికి 2019-20 ఆర్థిక సంవత్సరంలోనే ఏడువేల కోట్ల వరకు వెచ్చించింది. ఒక్కపాత పాలమూరు జిల్లాలోనే నాలుగు కీలకప్రాజెక్టుల ద్వారా ఎనిమిది లక్షలకుపైగా ఎకరాలు సాగులోకి రావడంతో ఆ జిల్లా ముఖచిత్రమే మారింది. రాష్ట్రంలో 38 భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం చేపట్టగా.. అందులో 12 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. మిగిలినవాటిలో కొన్ని పాక్షికంగా పూర్తికాగా, వీలునుబట్టి సాగునీటిని అందిస్తున్నాయి. తెలంగాణ ఏర్పడేనాటికి అలీసాగర్, గుత్ప ప్రాజెక్టులు మాత్రమే పూర్తయ్యాయి. కానీ, తెలంగాణ ప్రభుత్వం సాగునీటిరంగానికి పెద్దపీటవేస్తూ ప్రాజెక్టుల పనులను వేగంగా కొనసాగించడంతో రాష్ట్రంలో 80లక్షల ఎకరాలకుపైగా సాగునీరు అందుతున్నది. అన్నిప్రాజెక్టులు పూర్తయితే 53.02 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుతోపాటు, మరో 25.93 లక్షల ఎకరాలకు స్థిరీకరణ సాధ్యమవుతుంది. 2019-20లో సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.8,076.83 కోట్లు వెచ్చించగా.. అందులో 83 శాతం అంటే 6,670.05 కోట్లు ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులపైనే ఖర్చుచేసింది. దీంతో అనేక ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయి. పాత పాలమూరు జిల్లాలోని కోయిల్‌సాగర్ ద్వారా 50,250 ఎకరాలకు సాగునీరు అందుతున్నది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 3.65లక్షల ఎకరాలు నీటి సరఫరా జరుగడంతోపాటు, దీనిద్వారా వేల చెరువుల్లో ఏడాది పొడవునా జలకళ ఉట్టిపడుతున్నది. భీమా ద్వారా 2.03 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు కింద మరో రెండు లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి.



జోగులాంబ గద్వాల జిల్లాలోని నెట్టెంపాడు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న సాగునీరు (ఫైల్)

### ఆయువుపట్టుగా రెండు జలాశయాలు

ఉమ్మడి రాష్ట్రంలో ఏండ్ల తరబడి కొనసాగిన ఎల్లంపల్లి, శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) ప్రాజెక్టులను సైతం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడంతో ప్రస్తుతం అవి తెలంగాణకు ఆయువుపట్టుగా మారాయి. ప్రధానంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా రానున్న సీజన్ నుంచి 530 టీఎంసీలను వినియోగించడంలో ఈ రెండింటి పాత్ర అత్యంత కీలకంగా మారనున్నది. అదనంగా 46 టీఎంసీల వరకు నీటినిల్వకు అవకాశం ఏర్పడింది.

## వైఎస్సార్సీపీ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

**అమరావతి:** ఏపీ రాజ్యసభ అభ్యర్థులను వైఎస్సార్సీపీ సోమవారం ఖరారుచేసింది. మంత్రులు మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్‌చంద్రబోస్‌తోపాటు పారిశ్రామికవేత్త, రాంకీ సంస్థల అధినేత ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్లను ప్రకటించింది. నాలుగో సీటును మరో పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో కార్పొరేట్ వ్యవహారాల విభాగం అధ్యక్షుడు పరిమళ్ నత్వానీకి కేటాయించింది. మోపిదేవి, పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఎమ్మెల్సీలుగా ఎన్నికై మంత్రులుగా కొనసాగుతున్నారు. మండలి రద్దు నిర్ణయం నేపథ్యంలో వీరిద్దరికీ రాజ్యసభ అవకాశం దక్కింది.

## జగన్ గూటికి మాణిక్యవరప్రసాద్

**అమరావతి:** ఏపీ టీడీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ వైఎస్సార్సీపీలో చేరారు. సీఎం జగన్ సమక్షంలో సోమవారం పార్టీ కండువా కప్పుకొన్నారు. ఇటీవలే ఎమ్మెల్సీ పదవికి రాజీనామాచేసిన డొక్కా.. టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామాచేశారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ రెహమాన్ కూడా వైఎస్సార్సీపీలో చేరారు.

## ■ గేమ్స్‌తో తగ్గుతున్న భోజనం!



**వాషింగ్టన్:** కంప్యూటర్ గేమ్స్ ఆడుతూ భోజనం చేయడం వల్ల తక్కువ పరిమాణంలో ఆహారం తింటారని ఓ సర్వే తేల్చింది. 119 మంది యువకులపై ఇల్లినాయిస్ యూనివర్సిటీ పరిశోధకులు ఈ సర్వే జరిపారు. ఎటువంటి అంతరాయం లేకుండా భోజనం చేసినప్పటితో పోలిస్తే 15 నిమిషాలు కంప్యూటర్ గేమ్స్ ఆడుతూ భోజనం చేసినప్పుడు తక్కువ పరిమాణంలో ఆహారం తీసుకుంటారని తేలింది. ఇది అల్జీమర్స్ వ్యాధి, శ్రద్ధ లోప వైకల్యం వంటి సమస్యలకు దారి తీస్తుందని పరిశోధకులు తెలిపారు. కంప్యూటర్ గేమ్స్ ఆడుతూ భోజనం చేయడం వల్ల పరధ్యానంలో ఉంటూ తక్కువ ఆహారం తీసుకుంటున్నట్లు గుర్తించామని ఈ అధ్యయనానికి సారథ్యం వహించిన కార్లీ ఏ లిగొరి చెప్పారు.

## ■ అడవులు నరికేస్తే మలేరియా ముప్పు!



**మెల్‌బోర్న్:** కాఫీ, పొగాకు ఉత్పత్తి కోసం అడవుల నరికివేతతో మలేరియా ముప్పు పొంచి ఉందని ఆస్ట్రేలియాలోని సిడ్నీ యూనివర్సిటీ జరిపిన సర్వేలో తేలింది. కాఫీ, కలప, కొకైన్, పామాయిల్, పొగాకు తదితర అంతర్జాతీయ ఎగుమతుల కోసం ప్రపంచవ్యాప్తంగా అడవుల నరికి వేతత్లో 20% మలేరియా ముప్పు పొంచి ఉన్నదని ఈ సర్వే పేర్కొన్నది. దీనిపై వర్సిటీ ప్రొఫెసర్ మాన్‌ఫ్రెడ్ లెన్‌జెన్ మాట్లాడుతూ అడవుల నరికివేతతో సంబంధం ఉన్న వస్తువుల కొనుగోళ్లు చేయొద్దన్నారు. అడవుల నరికివేతతో సగటు ఉష్ణోగ్రతలు పెరిగి దోమలు నివసించడానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుందని, అందువల్ల మలేరియా ముప్పు పొంచి ఉందని ఇంతకుముందు సర్వేల్లోనూ వెల్లడైంది. అడవుల నరికివేతతో లభించే వస్తువులు, ఇతర వనరుల వినియోగానికి దూరంగా ఉంటే జీవ వైవిధ్య నష్టాన్ని, కర్బన ఉద్గారాలను తగ్గిస్తుందని పరిశోధకులు వ్యాఖ్యానిస్తున్నారు.



డోల్ యాత్ర ఉత్సవ్‌లో భాగంగా సోమవారం పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో రంగులు చల్లుకుంటున్న పర్యాటకులు



హోలీ సంబురాల్లో భాగంగా సోమవారం ముంబై నగరంలో 'కరోనా'సురుడిని దహనం చేసేందుకు సిద్ధం చేసిన స్థానికులు



# కమల్‌నాథ్‌కు గండం

## మధ్యప్రదేశ్ రాజకీయాల్లో ముసలం.. జ్యోతిరాదిత్య సింధియా తిరుగుబాటు!

17 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అదృశ్యం.. వీరిలో ఆరుగురు మంత్రులు

బెంగళూరుకు తరలింపు.. ఫోన్లు స్విచ్చాఫ్ ■ సీఎం కమల్‌నాథ్ అత్యవసర క్యాబినెట్ సమావేశం

20 మంది మంత్రులు రాజీనామా ■ సంక్షోభాన్ని అనుకూలంగా మలుచుకొనే దిశగా బీజేపీ



మాఫియా సహకారంతో ప్రభుత్వాన్ని అస్థిర పర్చడానికి జరుగుతున్న కుట్రలను విజయవంతం కానివ్వను. రాష్ట్ర ప్రజల నమ్మకం, ప్రేమే నా బలం. ఈ ప్రభుత్వం ప్రజల ఆశీస్సులతో ఏర్పాటైనది.

-కమల్‌నాథ్, సీఎం

| మొత్తం స్థానాలు: 230 | |
|---|---|
| కాంగ్రెస్+ | 121 |
| బీజేపీ | 107 |
| కనీస మెజార్టీ | 114 |

★ రెండు స్థానాలు ఖాళీ

**సింధియా డిమాండ్లు..!**
పీసీసీ అధ్యక్ష పదవి, రాజ్యసభ సీటు ఇవ్వాలని సింధియా డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం.

**బీజేపీ ఆఫర్ ఇదీ..**
సింధియాను రాజ్యసభకు పంపి.. కేంద్ర మంత్రివర్గంలో స్థానం కల్పిస్తామని బీజేపీ హామీ ఇస్తున్నట్టు తెలుస్తున్నది



**భోపాల్, మార్చి 9:** మధ్యప్రదేశ్ రాజకీయాల్లో ముసలం పుట్టింది. అధికార కాంగ్రెస్‌లోని జ్యోతిరాదిత్య సింధియా తిరుగుబాటు చేశారు. దాదాపు 17 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సోమవారం అదృశ్యమయ్యారు. వీరిలో ఆరుగురు మంత్రులు కూడా ఉన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం దినదినగండంగా కొనసాగుతుండగా.. తాజా పరిణామాలతో కమల్‌నాథ్‌కు పదవీ గండం పొంచి ఉన్నది. ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు బీజేపీ ఎత్తులు వేస్తున్నది. మరోవైపు, ఇటీవల సంకీర్ణ ప్రభుత్వానికి చెందిన కనిపించకుండా పోయిన పది మంది ఎమ్మెల్యేల్లో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు తిరిగిరాగా.. మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రావాల్సి ఉన్నది.

### పావులు కదుపుతున్న బీజేపీ

అధికార పార్టీలో మొదలైన సంక్షోభాన్ని తనకు అనుకూలంగా మలుచుకునేందుకు బీజేపీ ఎత్తులు వేస్తున్నది. బీజేపీ సీనియర్ నేత, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.. ఢిల్లీలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. ప్రస్తుత పరిస్థితులను వివరించారు. బీజేపీ నేతలు మంగళవారం గవర్నర్‌ను కలుస్తారని సమాచారం.

### మొత్తం 20 మంది?

కాంగ్రెస్‌కు చెందిన 17 మంది ఎమ్మెల్యేలు సోమవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో బీజేపీ పాలిత రాష్ట్రమైన కర్ణాటక రాజధాని బెంగళూరుకు ప్రయాణమయ్యారు. వీరిలో ఆరుగురు మంత్రులు కూడా ఉన్నారు. వీరంతా కాంగ్రెస్ సీనియర్ నేత జ్యోతిరాదిత్య సింధియా మద్దతుదారులే. తిరుగుబాటు వర్గంలో వైద్యశాఖ మంత్రి తులసి సిలావత్, కార్మికశాఖ మంత్రి మహేంద్రసింగ్ సిసోడియా, రవాణాశాఖ మంత్రి గోవింద్‌సింగ్ రాజ్‌పుత్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఇమార్తిదేవి, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రద్యుమ్నసింగ్ తోమర్, పాఠశాల విద్యాశాఖ మంత్రి ప్రభుర చౌదరి ఉన్నట్టు తెలిసింది. వారందరి ఫోన్లు స్విచ్చాఫ్‌లో ఉన్నట్టు పార్టీవర్గాలు తెలిపాయి. సోమవారం అర్ధరాత్రికి మరో ముగ్గురు ఎమ్మెల్యేలు రెబల్ క్యాంప్‌నకు చేరుతారని చెప్తున్నారు. తమవద్ద 20 మంది ఎమ్మెల్యేలున్నారని సింధియా వర్గం చెప్తుండగా, కాంగ్రెస్ మాత్రం తొమ్మిది మందేనని వాదిస్తున్నది.

### క్యాబినెట్ మంత్రుల రాజీనామా

రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల పేర్లను ఖరారు చేసేందుకు ముఖ్యమంత్రి కమల్‌నాథ్ సోమవారం ఉదయం ఢిల్లీలో సోనియాగాంధీతో భేటీ అయ్యారు. అయితే సింధియా వర్గం ఎదురు తిరుగడంతో ఆఘమేఘాల మీద భోపాల్‌కు చేరుకున్నారు. రాష్ట్రానికి వచ్చిన వెంటనే పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌తో భేటీ అయ్యారు. అనంతరం కమల్‌నాథ్ తన నివాసంలో అత్యవసర క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. సుమారు రెండు గంటలపాటు సమాలోచనలు జరిపారు. క్యాబినెట్ సమావేశానికి హాజరైన 20 మంది మంత్రులు తమ రాజీనామాలను ముఖ్యమంత్రికి సమర్పించారని మంత్రి ఉమంగ్ సెంగార్ తెలిపారు. క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలని సీఎంను కోరామన్నారు. సింధియా ఇప్పటికీ కాంగ్రెస్‌తోనే ఉన్నారని, కచ్చితంగా ఐదేండ్లు పాలిస్తామని చెప్పారు. మంగళవారం కాంగ్రెస్ శాసనసభాపక్షం సమావేశం కానున్నట్టు తెలిపారు.

### ఢిల్లీలో ప్రత్యక్షమైన సింధియా

జ్యోతిరాదిత్య సింధియా ఢిల్లీలోని తన నివాసంలో ప్రత్యక్షమయ్యారు. ఆయన సోమవారం రాత్రి ప్రధాని మోదీ, అమిత్‌షాతో సమావేశం అవుతారని బీజేపీ వర్గాలు చెప్పాయి. అయితే భేటీ జరుగలేదని సమాచారం. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం సింధియాను బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నది.

- గవర్నర్ లాల్జీ టాండన్ ప్రస్తుతం లక్నోలో ఉన్నారు. మంగళవారం భోపాల్‌కు వస్తారు.
- స్వతంత్ర ఎమ్మెల్యే సురేందర్ శెరా తనకు హోంమంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిస్తే మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ నేతలు హామీఇచ్చారన్నారు. ఇప్పుడు ఆ హామీని మరిచిపోయారని విమర్శించారు.

### సీఎం పదవి దక్కక సింధియా అసంతృప్తి

మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్‌కు, కాంగ్రెస్ సీనియర్ నేత జ్యోతిరాదిత్య సింధియాకు కొంతకాలంగా పొసగడం లేదు. మధ్యప్రదేశ్‌లో 2018 డిసెంబర్‌లో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటైంది. సీఎం పదవి కోసం కమల్‌నాథ్, సింధియా పోటీ పడ్డారు. అయితే సింధియాకు 23 మంది ఎమ్మెల్యేల బలం మాత్రమే ఉండటంతో సీఎం కుర్చీ దక్కలేదు. అప్పటి నుంచి సింధియా అసంతృప్తితో రగిలిపోతున్నారు. దీంతోపాటు ఆయనకు పార్టీలో సరైన ప్రాతినిధ్యం దక్కడం లేదని, ఆయన మద్దతుదారులను ఎదుగనీయడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సింధియా తరుచూ తన అసహనాన్ని వెళ్లగక్కుతున్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చకుంటే రోడ్లపైకి వచ్చి పోరాడతానని ఇటీవల సింధియా ప్రకటించారు.

### ఎప్పుడు ఏం జరిగిందంటే..

**మధ్యాహ్నం**

- **3 గంటలు**: కాంగ్రెస్ నేత జ్యోతిరాదిత్య సింధియాకు మద్దతిస్తున్న 17 మంది ఎమ్మెల్యేలు అదృశ్యమైనట్టు వార్తలు

**సాయంత్రం**

- **5.00**: రెబల్ ఎమ్మెల్యేలు బెంగళూరులో ఉన్నట్టు సమాచారం
- **6.55**: ఢిల్లీ పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకొని భోపాల్ చేరుకున్న సీఎం కమల్‌నాథ్

**రాత్రి**

- **7.05**: పార్టీ సీనియర్ నేతలు, మంత్రులతో తన నివాసంలో సమావేశం ఏర్పాటు చేసిన సీఎం
- **8.22**: సింధియా ప్రధాని మోదీతో భేటీ కానున్నట్టు ప్రకటించిన బీజేపీ నేతలు
- **8.41**: సింధియా, ఆయన వర్గం ఎమ్మెల్యేలను బుజ్జగించేందుకు సీనియర్ నేత కరణ్ సింగ్‌ను రంగంలోకి దించిన కాంగ్రెస్
- **9.00**: తమ పార్టీకి చెందిన 107 మంది ఎమ్మెల్యేలతో మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్టు బీజేపీ ప్రకటన
- **10.23**: ముఖ్యనేతలతో ముగిసిన కమల్‌నాథ్ సమావేశం.. అత్యవసర క్యాబినెట్ భేటీకి పిలుపు
- **11.05**: మధ్యప్రదేశ్ సంక్షోభంలో బీజేపీ పాత్రలేదన్న ఆపార్టీ నేత విశ్వాస్ సారంగ్
- **11.12**: ప్రభుత్వాన్ని అస్థిరపరిచే శక్తులను గెలువనీయబోనన్న కమల్‌నాథ్
- **11.13**: మంత్రులను రాజీనామా చేయాల్సిందిగా కోరిన సీఎం
- **11.15**: 20 మంది మంత్రుల రాజీనామా.. సీఎం ఆమోదం
- **11.43**: బీజేపీ కుతంత్రాల్ని తిప్పికొట్టి, సర్కార్‌ను నిలబెట్టేందుకే రాజీనామా చేసినట్టు మంత్రుల వెల్లడి
- **11.43**: న్యూఢిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ నివాసానికి చేరుకున్న ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ
- **11.56**: కమల్‌నాథ్‌తో కాంగ్రెస్ నాయకుల చర్చలు

## ● నేనే అధ్యక్షుడిని.. కాదు నేనే!

**కాబూల్:** ఆఫ్ఘనిస్థాన్‌లో రాజకీయ సంక్షోభం ముసురుకున్నది. ఆ దేశ అధ్యక్షుడిగా ఇద్దరు ప్రధాన రాజకీయ నేతలు ప్రమాణం చేశారు. సోమవారం జరిగిన రెండు వేర్వేరు కార్యక్రమాల్లో వాళ్లు దేశ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణం చేసిన వారిలో ఇండిపెండెంట్ పార్టీ నేత అష్రఫ్ ఘని, ఆయన రాజకీయ ప్రత్యర్థి, నేషనల్ కొలీషన్ పార్టీ నేత అబ్దుల్లా అబ్దుల్లా ఉన్నారు. ఘనికి అమెరికా, అబ్దుల్లా అబ్దుల్లాకు తాలిబన్లు మద్దతు ఇస్తున్నట్టు సమాచారం. కాగా, గతేడాది సెప్టెంబర్ ఎన్నికల్లో అష్రఫ్ ఘని నేతృత్వంలోని పార్టీ విజయం సాధించింది. అయితే, ఎన్నికలో ఆ పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడిందని అబ్దుల్లా అబ్దుల్లా, ఆయన వర్గీయులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఇద్దరు నేతలు తమదే అసలైన గెలుపుగా చెప్పుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఒకే సమయానికి అష్రఫ్ ఘని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌లో ప్రమాణం చేయగా.. దాని పక్కనే ఉన్న సపేదార్ ప్యాలెస్‌లో అబ్దుల్లా ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సమయంలో సమీప ప్రాంతాల్లో పేలుళ్లు జరిగాయి. దీనికి ఇస్లామిక్ స్టేట్ బాధ్యత వహించింది.

## ● పాక్‌లో 23 మంది దుర్మరణం

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లోని రావల్పిండి నుండి స్కర్దుకు సోమవారం ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు.. లోయలో పడిపోవడంతో దాదాపు 23 మంది మృతిచెందారు. ఈ బస్సు గిల్గిత్ సమీప రౌండు వద్ద ప్రమాదానికి గురైందని, ఆ సమయంలో 25 మంది ప్రయాణిస్తున్నారని గిల్గిత్ బాల్టిస్థాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి ఫైజుల్లా ఫిరక్ తెలిపారు. ఈ ప్రమాద కారణమేమిటో తెలియరాలేదన్నారు. ఈ ప్రమాదంలో 20 మంది అక్కడికక్కడే మృతిచెందగా, మరో ముగ్గురు స్కర్దు దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. మరోవైపు ఆఫ్రికా దేశమైన ఘనాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 35 మంది చనిపోయారు.

## ● సూడాన్ ప్రధానిపై ఉగ్రదాడి



**కైరో:** సూడాన్ ప్రధాని అబ్దల్లా హమ్డోక్‌పై హత్యాయత్నం జరిగింది. రాజధాని ఖార్టూమ్‌లో సోమవారం ఆయన వాహనశ్రేణి లక్ష్యంగా పేలుడు, కాల్పులతో ఉగ్రవాదులు దాడిచేశారు. ఈ హత్యాయత్నం నుంచి సురక్షితంగా బయటపడ్డానని, క్షేమంగా ఉన్నానని హమ్డోక్ ట్వీట్ చేశారు.

### కశ్మీర్‌లో జైశంకర్ ఆకస్మిక పర్యటన


**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సోమవారం ఆకస్మికంగా పర్యటించారు. ఇరాన్‌లో చిక్కుకున్న విద్యార్థులు, ఇతర పర్యాటకుల కుటుంబసభ్యులతో సమావేశమై వారికి ధైర్యం చెప్పారు. శ్రీనగర్‌లోని కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో గుమిగూడిన ఇరాన్‌లో చిక్కుకొన్నవారి బంధువులతో ముచ్చటించి, ఆందోళనకు గురికావద్దని ధైర్యం చెప్పారు.

### మాజీ సీఎంల నిర్బంధం అన్యాయం

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్ నేతలు.. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలను తక్షణం విడుదల చేయాలని విపక్ష పార్టీలు సోమవారం డిమాండ్ చేశాయి. భద్రత పేరిట వారిని ఏడు నెలలకుపైగా గృహ నిర్బంధంలో ఉంచడం అన్యాయమని విమర్శించాయి. నరేంద్ర మోదీ సర్కార్ ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తున్నదని మాజీ ప్రధాని దేవెగౌడ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, శరద్ పవార్ (ఎన్సీపీ), డీ రాజా (సీపీఐ), సీతారాం ఏచూరి( సీపీఎం) తదితరులు ఓ ప్రకటనలో ఆరోపించారు.

# ఇది వ్యక్తిగత స్వేచ్ఛపై దాడే!

### ఆ పోస్టర్లు తొలిగించండి.. లక్నో పోస్టర్లపై యూపీ సర్కార్‌కు అలహాబాద్ హైకోర్టు ఆదేశం



**అలహాబాద్/ లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ సర్కార్‌కు అలహాబాద్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా గతేడాది డిసెంబర్‌లో జరిగిన నిరసన ప్రదర్శనల్లో విధ్వంసానికి కారకులని ఆరోపిస్తూ కొందరు వ్యక్తుల ఫొటోలు, చిరునామాలతో ఏర్పాటుచేసిన పోస్టర్లను తొలిగించివేయాలని సోమవారం హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇది రాజ్యాంగంలోని 21వ అధికరణాన్ని ఉల్లంఘించడమేనని చీఫ్ జస్టిస్ గోవింద్ మాథూర్, జస్టిస్ రమేశ్ సిన్హాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దీనిపై ఈ నెల 16 లోపు నివేదిక సమర్పించాలని లక్నో జిల్లా కలెక్టర్, లక్నో నగర పోలీస్ కమిషనర్‌లను ఆదేశించింది. ప్రభుత్వ చర్య ప్రజల వ్యక్తిగత గోప్యతపై అవాంఛనీయంగా జోక్యం చేసుకోవడమేనని స్పష్టం చేసింది. దీనిపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)ను ఈ నెల 7న సుమోటోగా తీసుకున్న న్యాయస్థానం ఆదివారం అసాధారణ రీతిలో విచారణ జరిపి తీర్పును రిజర్వు చేసింది. హైకోర్టు తీర్పుపై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ.. 'రాజ్యాంగంపై గౌరవం గానీ, పౌరుల వ్యక్తిగత గోప్యతా హక్కుపై పరిజ్ఞానం గానీ రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. మేం హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం' అని అన్నారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి కూడా హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు ట్వీట్ చేశారు. యూపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అజయ్‌కుమార్ లల్లూ ప్రతిస్పందిస్తూ..యూపీ సర్కార్ రాజ్యాంగ వ్యతిరేక, ప్రజాతంత్ర వ్యతిరేక వైఖరిని హైకోర్టు తీర్పు బయటపెట్టిందన్నారు. కాగా, దాడులకు పాల్పడిన వారిని గుర్తించే ప్రక్రియను కొనసాగిస్తామని సీఎం యోగి ఆదిత్యనాథ్ మీడియా సలహా దారు మృత్యుంజయ్ కుమార్ ట్వీట్ చేశారు.

## ఇద్దరు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో సోమవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు నిషేధిత లష్కరే తాయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. షోపియాన్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారం మేరకు దక్షిణ కశ్మీర్ రెబన్ ప్రాంతంలోని ఖోజ్‌పొరా గ్రామంలో పోలీసులు, భద్రతాబలగాలు గాలిస్తుండగా.. పసిగట్టిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. దీంతో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరి నుంచి ఏకే 47, గ్రనేడ్ లాంచర్, ఏకే 47 మ్యాగజైన్, ఒక చైనా తయారీ పిస్టల్, ఇతర మందుగుండు సామగ్రిని సైన్యం స్వాధీనం చేసుకొన్నది.

### ముగ్గురు అరెస్ట్

ఉగ్రవాదుల సానుభూతిపరులైన ముగ్గురిని కశ్మీర్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బాటాగండ్ వాసి ఆదిల్ రసూల్ ఘనీ, ట్రాల్ పయిన్ వాసులు రియాజ్ అహ్మద్ భట్, మహ్మద్ ఇసాక్ భట్ ఉన్నారు. వీరంతా ఉగ్రవాదులకు ఆశ్రమం కల్పించినట్లు ఆరోపణలున్నాయని పోలీసులు చెప్పారు.




## మోదీ 'పద్మ' క్విజ్

### గెలిస్తే పద్మ అవార్డుల వేడుకకు హాజరయ్యే అవకాశం

**న్యూఢిల్లీ:** పద్మ అవార్డుల గురించి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సోమవారం సోషల్ మీడియా వేదికగా క్విజ్ పోటీ నిర్వహించారు. సరైన సమాధానాలు పంపినవారికి ఈ నెల 20న రాష్ట్రపతిభవన్‌లో నిర్వహించే దేశంలో అత్యున్నత పౌరపురస్కారాల్లో ఒకటైన పద్మ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. క్విజ్ పోటీలో పాల్గొని, అధిక మార్కులు సాధించి గొప్ప కార్యక్రమానికి విచ్చేసే అవకాశాన్ని పొందాలని తన సోషల్‌మీడియా అనుచరులకు మోదీ సూచించారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉన్న 20 ప్రశ్నలకు సంబంధించిన లింకును కూడా ట్వీట్‌చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి పద్మ అవార్డులను ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే.

## నిర్భయ దోషి మరో ఎత్తుగడ



**న్యూఢిల్లీ, మార్చి 9:** ఉరిశిక్ష నుంచి తప్పించుకోవడానికి నిర్భయ దోషులు చేస్తున్న ప్రయత్నాలు ఇంకా కొనసాగుతున్నాయి. నలుగురు దోషుల్లో ఒకడైన వినయ్ శర్మ తాజాగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్‌కు ఒక క్షమాభిక్ష పిటిషన్‌ను పెట్టుకున్నాడు. తన మరణ శిక్షను జీవితఖైదుగా మార్చాలంటూ అభ్యర్థించాడు. కాగా పలు వాయిదాల అనంతరం నిర్భయ కేసులో దోషుల్ని మార్చి 20న ఉరితీయాలంటూ ఢిల్లీ పటియాలా హౌస్ కోర్టు ఇటీవల కొత్త డెత్ వారెంట్లు జారీ చేసిన విషయం తెలిసిందే.

## డీజీ డీఐఏ అధిపతిగా కేజేఎస్ ధిల్లాన్


**న్యూఢిల్లీ:** డైరెక్టర్ జనరల్ డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (డీజీడీఐఏ), డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ (ఇంటెలిజెన్స్) (డీసీఐడీఎస్) అధిపతిగా లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ధిల్లాన్ నియమితులయ్యారు. ఆయన త్వరలోనే బాధ్యతలు చేపడుతారని అధికారులు సోమవారం తెలిపారు. ఇది సైనిక వ్యవహారాలశాఖలో కొత్తగా సృష్టించిన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ పరిధిలోని విభాగం. ధిల్లాన్.. భారత మిలిటరీ అకాడమీలో 1983 బ్యాచ్‌కు చెందినవారు.

## కరోనాను జయించిన వందేండ్ల వృద్ధుడు

**బీజింగ్, మార్చి 9:** చైనాకు చెందిన వందేండ్ల వృద్ధుడు కరోనాను జయించాడు. పూర్తిగా కోలుతున్న ఆయన దవాఖాన నుంచి శనివారం డిశ్చార్జ్ అయినట్లు ఆ దేశ మీడియా పేర్కొంది. కరోనా (కొవిడ్-19) వ్యాప్తికి మూల కేంద్రమైన వుహాన్‌లో ఫిబ్రవరి 24న ఓ వృద్ధుడికి ఈ వైరస్ సోకింది. దీంతో ఆయనను హుబైలోని మెటర్నిటీ, చైల్డ్ హెల్త్ కేర్ దవాఖానలో చేర్చారు. వయసు పైబడిన ఆ వ్యక్తికి మతిమరుపుతోపాటు రక్తపోటు, గుండె సంబంధ సమస్యలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయనకు చికిత్స అందించడం వైద్యులకు కష్టంగా మారింది. యాంటీవైరల్ మందులు, ప్లాస్మా థెరపీతో పాటు చైనా సంప్రదాయ ఔషధాలతో ఆ పెద్దాయనకు వైద్యం అందించారు. సాధారణంగా కరోనా బారిన పడిన వృద్ధులు కోలుకోవడం చాలా కష్టం. అయితే ఈ శత వయస్కుడు మాత్రం కరోనాను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. గత నెలలో వందో పుట్టిన రోజు జరుపుకున్న ఆయన ఈ మహమ్మారి నుంచి పూర్తిగా కోలుకున్నాడు. మరో 80 మందితో పాటు ఆయన కూడా దవాఖాన నుంచి ఇంటికి తిరిగివెళ్లాడు.

# మరో ఆరుగురికి కరోనా

- బాధితుల్లో మూడేండ్ల చిన్నారి
- కశ్మీర్, పంజాబ్, కర్ణాటకల్లో తొలి కేసు
- 45కు పెరిగిన కేసులు




**న్యూఢిల్లీ/ బీజింగ్/ లాస్ ఏంజిల్స్:** దేశంలో మరో ఆరు కరోనా కేసులు నమోదయ్యాయి. కేరళ, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, జమ్ముకశ్మీర్, పంజాబ్, కర్ణాటకలో ఒక్కొక్కరికి ఈ వైరస్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. వీరిలో మూడేండ్ల చిన్నారి కూడా ఉన్నది. కేరళకు చెందిన ఈ మూడేండ్ల చిన్నారి తల్లిదండ్రులతో కలిసి ఇటీవల ఇటలీ నుంచి భారత్‌కు వచ్చింది. కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయంలో వీరికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు చేయగా చిన్నారికి వైరస్ లక్షణాలు ఉన్నట్లు బయటపడింది. ఆమె తల్లిదండ్రులకు కూడా ఈ వైరస్ సోకి ఉంటుందని వైద్యసిబ్బంది అనుమానిస్తున్నారు. వారి నుంచి సేకరించిన నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి తన భార్య, కుమార్తెతో కలిసి కర్ణాటకకు వచ్చారని, ఆయనకు వైద్య పరీక్షలు చేయగా కరోనా సోకినట్లు బయటపడిందని తెలిపారు. దీంతో ఇప్పటి వరకు దేశంలో కరోనా కేసుల సంఖ్య 45కు చేరిందని పేర్కొన్నారు. కాగా వైరస్ నేపథ్యంలో బెంగళూరులోని అన్ని ప్రాథమిక పాఠశాలను నిరవధికంగా మూసివేయాలని అధికారులు ఆదేశించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు తెరువకూడదని సూచించారు. మరోవైపు ఆదివారం దుబాయ్ నుంచి కర్ణాటకలోని మంగళూరులో ఉన్న విమానాశ్రయానికి చేరుకున్న ఓ వ్యక్తి కరోనా (కొవిడ్-19) లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తించిన సిబ్బంది అతడిని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తనకు వైరస్ సోకలేదని సిబ్బందితో వాగ్వాదానికి దిగిన అతడు రాత్రి సమయంలో దవాఖాన నుంచి పారిపోయాడు. దీంతో అతడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇంకోవైపు ఇరాన్‌లో కరోనా తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకురావడానికి సైన్యానికి చెందిన విమానం సోమవారం బయలుదేరింది. ఈజిప్టులోని నైలునది తీరంలో లంగరువేసిన క్రూయిజ్ నౌకలోని ప్రయాణికుల్లో 45 మంది కరోనా లక్షణాలతో బాధపడుతుండగా వారిని దవాఖానకు తరలించారు. ఈ నౌకలో తమిళనాడుకు చెందిన 17 మంది కూడా ఉన్నారు.

### మోదీ బంగ్లా పర్యటన రద్దు

ప్రధాని మోదీ బంగ్లాదేశ్ పర్యటన రద్దు అయ్యింది. ఈ నెల 17న బంగ్లాదేశ్ జాతిపిత షేక్ ముజిబర్ రెహమాన్ వందేండ్ల జయంతి వేడుకల ప్రారంభానికి హాజరుకావాలని తొలుత ఆయన నిర్ణయించారు. అయితే తమ దేశంలో ముగ్గురికి కరోనా వైరస్ సోకినట్లు గుర్తించిన బంగ్లాదేశ్.. ప్రారంభ వేడుకలను వాయిదా వేయాలని నిర్ణయించింది. వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ తన పర్యటనను రద్దు చేసుకున్నారు.

### చైనాలో తగ్గుముఖం

చైనాలో కరోనా బాధితుల మరణాలు తగ్గుముఖం పడుతున్నాయి. ఆదివారం కేవలం 22 మరణాలు సంభవించాయి. ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు లక్షా పదివేలు దాటాయని, ఈ మహమ్మారి వల్ల ఇప్పటి వరకు 3,800 మందికిపైగా మరణించారని ఏజెన్సీ ఫ్రాన్స్ ప్రెస్ (ఏఎఫ్‌పీ) అనే వార్తా సంస్థ వెల్లడించింది.



దేశంలో జరిగిన ప్రతి ఆర్థిక నేరంలో కాంగ్రెస్‌కు పాత్ర ఉన్నది. విజయ్ మాల్యా సోనియాగాంధీకి విమానా టికెట్లు పంపేవారు. మల్యాకు మన్మోహన్‌సింగ్, చిదంబరంతో మంచి సంబంధాలున్నాయి. రాహుల్‌గాంధీ నీరవ్ మోదీ నగల దుకాణాన్ని ప్రారంభించారు. యస్ బ్యాంక్‌కు చెందిన రాణా కపూర్ ప్రియాంకా వాద్రా పేయింటింగ్‌లను కొనుగోలు చేశారు.


**అమిత్ మాలవియా, బీజేపీ సమాచార, సాంకేతిక విభాగం బాధ్యుడు**

ఐదేండ్ల మోదీ ప్రభుత్వ హయాంలో యస్ బ్యాంక్ అక్రమ రుణాలు 334 శాతం ఇచ్చింది. బ్యాంక్ దివాలా తీయటంలో మోదీ ప్రభుత్వానికి భాగస్వామ్యం లేదా? రాజీవ్‌గాంధీ కాలం నుంచి వారసత్వంగా వచ్చిన ఎంఎఫ్ హుస్సేన్ పేయింటింగ్‌ను రాణా కపూర్ రెండు కోట్లు పెట్టి కొన్నది. దానికి సంబంధించి ప్రియాంకా గాంధీ ఆదాయ పన్నును కూడా 2010లోనే చెల్లించారు.

**రణ్‌దీప్‌సింగ్ సుర్జేవాలా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి**



### చరిత్రలో నేడు




**1629**

ఇంగ్లండ్ పార్లమెంట్‌ను రద్దు చేసిన కింగ్ చార్లెస్-I. పదేండ్ల తర్వాత పునరుద్ధరణ.

**1876**

మొదటిసారి టెలిఫోన్ సంభాషణ. టెలిఫోన్ ద్వారా తన సహాయకున్ని పలుకరించిన అలెగ్జాండర్ గ్రహంబెల్.





**1945**

రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ టోక్యో నగరంపై నిప్పుల బాంబులతో దాడి. నగరం దగ్ధం. లక్షమందికి పైగా మృతి.

ఢిల్లీ మతఘర్షణలపై వెంటనే పార్లమెంట్‌లో చర్చ జరుగాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ప్రభుత్వం తిరస్కరించింది. సభ సజావుగా సాగి, సద్దుమణిగినప్పుడే చర్చకు అవకాశమున్నదని అధికారపక్షం తేల్చిచెప్పింది. అయితే అల్లర్లపై తక్షణమే చర్చ జరుగాలని కాంగ్రెస్ ఎంపీలు సభలో చేసిన నినాదాలతో స్పీకర్ ఓం బిర్లా కినుకతో సభకు రావటం మానేశారు. ఆయన గైర్హాజరీలో ఏడుగురు కాంగ్రెస్ ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. సభలో దేశం ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నో చర్చకు రావాల్సి ఉన్నందున ఇరు పక్షాలు సంయమనంతో వ్యవహరించాలి.

**ది హిందూ**

గత రెండేండ్లుగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన యస్ బ్యాంక్‌ను గట్టెక్కించటానికి ఎస్‌బీఐ పూనుకున్నది. ఈ మధ్య జరిగిన బేలౌట్‌లలో ఇది పెద్దది. బ్యాంక్ ఖాతాదారుల ప్రయోజనాలు, ఆర్థిక ప్రయజనాలు పరిరక్షించటం ప్రధాన బాధ్యతగా ఎస్‌బీఐ వ్యవహరించింది. ఈ క్రమంలో మదుపరులు 50 వేల కన్నా ఎక్కువ బ్యాంక్ నుంచి తీసుకోరాదని ఆర్‌బీఐ పరిధి విధించింది. యస్ బ్యాంక్ ఉదంతంతో మన ఆర్థికరంగలోని లొసుగులు తేటతెల్లమయ్యాయి. బ్యాంక్ దుస్థితికి రుణ ఎగవేతలు, నిరర్థక ఆస్తులే కారణమని అవగతమవుతున్నది.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# ప్రతికూలతనధిగమించి!

దేశవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి కమ్ముకుపోయి ఉన్నప్పటికీ కేసీఆర్ తెలంగాణ రాష్ర్టాన్ని నిశ్చలంగా నడుపుతున్న తీరుకు రాష్ట్ర బడ్జెట్ అద్దం పడుతున్నది. గడ్డు పరిస్థితుల్లోనూ 1,82,914 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఆశ్చర్యకరం. గత బడ్జెట్‌తో పోలిస్తే దాదాపు ముప్పైఆరు వేల కోట్లు ఇవి ఎక్కువ! ఆర్థికంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలలో ఎక్కడా కోత వేయకపోగా మరింత విస్తరించడం, ప్రాధాన్య రంగాలను విస్మరించకపోవడం విశేషం. దీర్ఘకాలిక లబ్ధి కోసం వనరులను కల్పించే క్యాపిటల్ వ్యయానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. ఇందుకోసం దాదాపు 22 వేల కోట్లను కేటాయించడమే కాకుండా, మరిన్ని నిధులను ఇతరమార్గాలలో సమీకరిస్తున్నది. వ్యవసాయంతో పాటు పారిశ్రామికరంగం, గ్రామీణ ప్రగతితోపాటు నగరాల అభివృద్ధి– ఈ విధంగా వివిధ రంగాల మధ్య సమతుల్యతను పాటించింది. భాగ్యనగరిని విశ్వనగరంగా మార్చేందుకు పదివేల కోట్ల భారీ నిధులను కేటాయించడం అబ్బురపరిచే విషయం. గతంలో నగరాభివృద్ధి అంటే ఆశ్రితవర్గ స్థిరాస్తి వ్యాపారమనే విమర్శ ఉండేది. ఇందుకు భిన్నంగా తెలంగాణ ప్రభుత్వం మొదటినుంచీ మౌలికవసతుల కల్పనతో పాటు జనజీవనాన్ని ఉల్లాసభరితంగా మార్చడానికి ప్రాధాన్యమిస్తున్నది. తాజా కేటాయింపులతో మౌలికవసతులను సమకూర్చడమే కాకుండా మూసీ ప్రక్షాళనతో పాటు నదీ పరీవాహక ప్రాంతమంతా సుందర ఉద్యానవనంగా మారబోతున్నది. భాగ్యనగరాన్ని ప్రపంచపటం మీద మెరిసే తెలంగాణ మణిమకుటంగా మార్చాలనే పట్టుదల ఈ కేటాయింపులో కనిపిస్తున్నది.

**సంక్షేమపథకాలు సమాజానికే కాదు, పరిశ్రమలతో పాటు మొత్తం ఆర్థికవ్యవస్థకే పునరుజ్జీవాన్ని ఇస్తాయనేది ఆర్థికవేత్తల అభిప్రాయం. చరిత్రలో ఇందుకు బలమైన దృష్టాంతాలు కూడా ఉన్నాయి. సమాజం చితికిపోయి ఉన్నప్పుడు సంక్షేమ పథకాల ద్వారానే కోలుకుంటుందనేది అమెరికాతో పాటు ఆధునిక యూరప్ చరిత్రను గమనిస్తే అర్థమవుతుంది. ప్రపంచ యుద్ధాల ద్వారా చితికిపోయిన సమాజాన్ని వారు మళ్ళా పునర్నిర్మించుకోగలిగింది సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల నిర్మాణాల ద్వారానే. అమెరికాలో మహా మాంద్యం ఆవరించిన నేపథ్యంలో సంక్షేమ పథకాల ద్వారానే అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ దేశాన్ని గట్టెక్కించగలిగాడు.**

ఆర్థికపరిస్థితి దిగజారిన నేపథ్యంలో అటు సంక్షేమ పథకాలను, ఇటు అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేయడం ఎట్లా సాధ్యమనే సందేహం కలగడం సహజం. నిజానికి ఇదొక పెద్ద సవాలు. కానీ పాలకులకు మొదట ఉండాల్సింది సత్సంకల్పం. ఆ తర్వాత కావలసింది ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైన సృజనాత్మకత. వనరులను సేకరించడం, తగిన రీతుల్లో వెచ్చించడంలోనే పరిపాలనాదక్షత ఇమిడి ఉంటుంది. ఈ చిత్తశుద్ధి, చతురత పాలకులకు లోపించినప్పుడు సమాజంలో సంక్షోభాలు వస్తాయి. ఆర్థికమాంద్యంలోకి దిగజారుతామనే భయం దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్న తరుణంలో ప్రభుత్వం బడ్జెట్‌ను కుదించకుండా మరింత పెంచి సంక్షేమానికి పెద్దపీట వేసింది. ప్రజల కొనుగోలుశక్తిని పెంచడం ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధిస్తామన్న సూత్రాన్ని అమలుచేస్తున్నది. రాష్ట్ర బడ్జెట్‌లో నలభై వేల కోట్లు సంక్షేమానికే వెచ్చించే ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఆసరా, కళ్యాణలక్ష్మి వంటి పథకాల లబ్ధిదారుల సంఖ్య పెరుగుతున్నది. రైతుబంధు పథకానికి కూడా కేటాయింపును పెంచింది. కాళేశ్వరం ప్రాజెక్టు పొడుగునా మత్స్య, పర్యాటకాదిరంగాల అభివృద్ధి పథకాలు అమలవుతున్నాయి. పారిశ్రామికరంగంలో చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి మీద ప్రత్యేక శ్రద్ధ కనబరచడం కూడా ప్రశంసనీయం. ఈ లక్ష్యంతోనే ప్రభుత్వం పారిశ్రామిక పోత్సాహక నిధులను 21.55 కోట్ల నుంచి భారీగా 1,132 కోట్లకు పెంచింది.

పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వకూడదనే రీతిలో కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ఆశ్చర్యకరంగా ఉన్నది. సంక్షేమపథకాలు సమాజానికే కాదు, పరిశ్రమలతో పాటు మొత్తం ఆర్థికవ్యవస్థకే పునరుజ్జీవాన్ని ఇస్తాయనేది ఆర్థికవేత్తల అభిప్రాయం. చరిత్రలో ఇందుకు బలమైన దృష్టాంతాలు కూడా ఉన్నాయి. సమాజం చితికిపోయి ఉన్నప్పుడు సంక్షేమ పథకాల ద్వారానే కోలుకుంటుందనేది అమెరికాతోపాటు ఆధునిక యూరప్ చరిత్రను గమనిస్తే అర్థమవుతుంది. ప్రపంచయుద్ధాల ద్వారా చితికిపోయిన సమాజాన్ని వారు మళ్ళా పునర్నిర్మించుకోగలిగింది సంక్షేమపథకాలు, మౌలిక వసతుల నిర్మాణాల ద్వారానే. అమెరికాలో మహా మాంద్యం ఆవరించిన నేపథ్యంలో సంక్షేమ పథకాల ద్వారానే అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ దేశాన్ని గట్టెక్కించగలిగాడు. ప్రజల దగ్గర కొనుగోలుశక్తి ఉంటేనే ఆర్థిక రథచక్రాలు తిరుగుతాయి. కొనుగోలు శక్తి నశిస్తే మొత్తం పారిశ్రామికరంగమే కుప్పకూలుతుంది. సంక్షేమ పథకాలు బలహీనవర్గాల పట్ల ప్రభుత్వ బాధ్యతకు సూచన మాత్రమే కాదు, పారిశ్రామిక ప్రగతికి ఇంధనం. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత గ్రామాలకు లక్షల కోట్ల రూపాయలను పంపిణీ చేయడం ద్వారా ఇవాళ గ్రామీణ సమాజం కళకళలాడుతున్నది. ఆ పునాదిపైనే అన్నిరంగాలు నిలదొక్కుకుంటున్నాయి. పరాయిశక్తుల పాలనలో దశాబ్దాల పాటు చితికిపోయిన తెలంగాణ సమాజానికి జవసత్వాలు ఇవ్వడానికి కేసీఆర్ రూపొందించిన సమగ్ర వ్యూహంలో భాగమే ఈ కార్యాచరణ. ఇందులో సమాజ వికాసమూ, ఆర్థిక ప్రగతీ దాగి ఉన్నాయి. దేశమంతా ఆర్థిక మందగమనానికి కుదేలయినా తెలంగాణ నిలకడగా ఉండగలుగుతున్నదీ, అన్ని రంగాలలో దేశాన్ని మించిన సగటు వృద్ధిని సాధిస్తున్నదీ అంటే అది కేసీఆర్ వ్యూహ ఫలితమే!

### జనగళం

#### అనవసర భయాలొద్దు

మార్చిలో సాధారణంగా ఎండల తీవ్రత ఉంటుంది, పొడిగాలులు వీస్తాయి. కానీ కొన్నిరోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండటం, చలి గాలులు వీస్తుండటంతో ప్రజల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా విషజ్వరాలు, జలుబు, దగ్గు వంటి వ్యాధులు ఎక్కువయ్యాయి. కరోనా వైరస్ భయాలు ఇప్పటికే ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న సమయంలో ఇలాంటి వాతావరణ పరిస్థితులు జనాలను మరింతగా భయపెడుతున్నాయి. ఈ పరిస్థితులను అర్థం చేసుకొని ప్రజలు అనవసర భయాలకు లోనుకావద్దు. ఆరోగ్యశాఖ వారు దీని గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించాలి. కరనా వైరస్‌ను రాష్ర్టానికి రానీయకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నది.

**- సంధ్య విరగదిండ్ల, పార్వతీపురం, వనపర్తి జిల్లా**

#### కలలో కూడా ఊహించనిది

ఈ మధ్య మిత్రుని పెండ్లి శుభకార్యానికి హాజరయ్యేందుకు మహబూబ్‌నగర్ జిల్లాకు పోవాల్సి వచ్చింది. రోడ్డుకు ఇరువైపులా ఎక్కడ చూసినా కనుచూపుమేర పచ్చటి వరి పొలాలు కనిపించాయి. దాంతో నేను పొరపాటున ఆంధ్రా ప్రాంతానికి పోయే బస్సు ఎక్కినానేమోనని అనుమానం వచ్చింది. బస్సులో పక్కసీటులో ఉన్న ప్రయాణికున్ని ఇది పాలమూరు జిల్లానే కదా అని అనుమానాన్ని నివృత్తి చేసుకునేందుకు అడిగాను. అనుమానం ఎందుకు పాలమూరే అన్నాడు. నేను చాలా ఆశ్చర్యపోయాను. నాలుగైదేండ్ల కిందట ఆ మిత్రుని ఇంటికి పోయినప్పుడు ఈ ప్రాంతమంతా ఎడారిలా కనిపించింది. ఎక్కడా పచ్చని చెట్టు కనిపించని స్థితి. అలాంటి కరువు ప్రాంతంలో ఇప్పుడు సాగునీరంది ఆ ప్రాంతమంతా పైరుపచ్చలతో నిండిపోయింది. ఇలాంటి ఓ పరిస్థితి వస్తుందని మా లాంటివాళ్లం ఎన్నడూ ఊహించలేదు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సాగునీటి రంగానికి సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రాధాన్యం కారణంగా కరువు నేల పాలమూరు లో చెరువులు నిండి ఉన్నాయి. ఎక్కడ చూసినా వరిపొలాలు దర్శన మిస్తున్నాయి. తెలంగాణ వస్తే ఏం మారుతుందన్న వారిని ఎవరినైనా ఒకసారి మహబూబ్‌నగర్ తీసుకుపోయి చూపించాలి. రాష్ట్ర సాధన సాఫల్యం ఎంత మధురంగా, అందంగా ఉన్నదో తెలుస్తుంది.

**- పి.కృష్ణ, నల్లగొండ**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118


# నగరీకరణ వైపు నడక

రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్ నగరాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించడం సంచలనాత్మకమైంది. ఈ భారీ కేటాయింపు హైదరాబాద్ ను విశ్వనగరిగా మార్చడానికి దోహదపడుతుందని మంత్రి కేటీఆర్ హర్షం వెలిబుచ్చడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం నగరాభివృద్ధిలో రహదారుల వంటి మౌలికవసతులకు ప్రాధాన్యం ఇస్తున్నది. హైదరాబాద్ నగరాభివృద్ధి విషయానికి వస్తే మూసీ ప్రాజెక్టు చెప్పుకోదగినది. నగర చరిత్రతో ముడిపడిన ప్రఖ్యాత మూసీనది ఇప్పుడు మురికినీటితో నిండిపోయి ఉండటం బాధాకరం. ప్రభుత్వం మూసీనదిని ప్రక్షాళన చేయడ మేకాకుండా నదికి ఇరువైపుల ఉద్యానవనాలతో సుందరమయం చేయాలని తలపెట్టింది.

దేశ నగరీకరణలో తెలంగాణ 5వ స్థానంలో ఉండటం గర్వదాయకమైన విషయం. దేశవ్యాప్తంగా నగరీకరణ 31 శాతం ఉంటే తెలంగాణలో 42 శాతం ఉన్నది. మరో ఐదేండ్లలో తెలంగాణలో నగరీకరణ యాభై శాతానికి చేరుకుంటుందని అంచనా. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల మూలంగా నగరీకరణ వేగంగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. దాదాపు అన్ని జిల్లా కేంద్రాలు అధునాతన సొబగులు అద్దుకుంటున్నాయి. 23 కొత్త జిల్లాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్లు, మండలాల పెంపు వల్ల ఆయా ప్రాంతాల్లో నగరీకరణ వేగంగా సాగుతున్నది. మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెన పూర్తయితే కరీంనగర్ స్వరూపమే మారిపోతుందనడంలో సందేహం లేదు. రింగ్‌రోడ్డు మొదలుకొని వరంగల్ నగరాభివృద్ధికి సాగుతున్న చర్యలు ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. టెక్స్‌టైల్ పార్కు వరంగల్ నగరాభివృద్ధికి ఇతోధికంగా దోహదం చేస్తుంది. పర్యాటక క్షేత్రంగా కూడా వరంగల్ ప్రసిద్ధి చెందిన నగరమే.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే నివేదిక, బడ్జెట్ కేటాయింపులు గమనిస్తే పట్టణాభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక శ్రద్ధ కనబరుస్తున్నదని అర్థమవుతున్నది. నగరాభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లు భౌతిక, సంస్థాగత, సామాజిక విషయాలను పరిగణనలోకి తీసుకొని ప్రత్యేక కార్యాచరణకు పూనుకుంటున్నది. తద్వారా నగర జీవనాన్ని సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు సకలచర్యలూ చేపడుతున్నది. ఇందులో పట్టణ రవాణా, రోడ్ల నిర్మాణం, అనుసంధానానికి ప్రాధాన్యం ఇస్తున్నది. ఈ నేపథ్యంలో మౌలిక వసతులు కల్పన, ప్రజలందరికీ రక్షణ, భద్రత, వ్యవస్థాగతమైన వసతుల కల్పనలకు, పాలనావిధానాల్లో మౌలిక మార్పులకు శ్రీకారం చుడుతున్నది. పట్టణాభివృద్ధిలో మౌలిక మార్పుల కోసం తెలంగాణ ప్రభుత్వం మున్సిపాలిటీ చట్టం–2019 తీసుకొచ్చింది. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం ప్రత్యేకమైన వ్యవస్థల నిర్మాణానికి రూపకల్పన చేసింది. ఇందులో విస్పష్టమైన విధుల విభజన కూడా చేసింది. అన్నిస్థాయిల్లో జవాబుదారీతనాన్ని పెంచేవిధంగా వ్యవస్థలకు నిర్మాణరూపం ఇచ్చింది. పల్లె ప్రగతి పథకం మాదిరిగానే పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని 2020 ఫిబ్రవరి 24 నుంచి మార్చి 4 వరకు నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా పట్టణాల్లో పారిశుధ్యం, మొక్కల పెంపకం, విద్యుత్ సరఫరా, సమస్యల పరిష్కారం, మార్కెట్ వసతులు మొదలైన అంశాలపై దృష్టి కేంద్రీకరించింది.

రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్ నగరాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించడం సంచలనాత్మకమైంది. ఈ భారీ కేటాయింపు హైదరాబాద్ ను విశ్వనగరిగా మార్చడానికి దోహదపడుతుందని మంత్రి కేటీఆర్ హర్షం వెలిబుచ్చడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం నగరాభివృద్ధిలో రహదారుల వంటి మౌలికవసతులకు ప్రాధాన్యం ఇస్తున్నది. హైదరాబాద్ నగరాభివృద్ధి విషయానికి వస్తే మూసీ ప్రాజెక్టు చెప్పుకోదగినది. నగర చరిత్రతో ముడిపడిన ప్రఖ్యాత మూసీనది ఇప్పుడు మురికినీటితో నిండిపోయి ఉండటం బాధాకరం. ప్రభుత్వం మూసీనదిని ప్రక్షాళన చేయడమేకాకుండా నదికి ఇరువైపుల ఉద్యానవనాలతో సుందరమయం చేయాలని తలపెట్టింది. ఇందుకోసం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొ



రేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్)ను ఏర్పాటుచేసింది. మూసీ నదిలోని చెత్తాచెదారాన్ని తొలిగించడం వల్ల నీరు నిరాటంకంగా ప్రవహిస్తున్నది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ రహదారుల విస్తరణకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. దీనివల్ల పట్టణాలలో, పల్లెలలో సౌకర్యాలు పెరుగడమే కాకుండా పల్లెలకు, పట్టణాలకు అనుసంధానం పెరుగుతుంది. దీనివల్ల ప్రజలకు సౌకర్యాలు మెరుగవడమే కాకుండా వ్యాపారాభివృద్ధి సాగుతుంది. నగరీకరణ క్రమాన్ని కూడా పెంచుతుంది. రాష్ట్రంలో 23 జాతీయ రహదారులున్నాయి. వీటి మొత్తం పొడుగు 3,824 కిలోమీటర్లు. మరో 13 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. దీనికితోడు రహదారుల వ్యవస్థను భారీగా మెరుగుపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.

ఇందులో చెత్త పడేయకుండా సైన్ బోర్డులు ఏర్పాటుచేయడం, సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం వంటి పలుచర్యలు తీసుకున్నది. రబ్బర్ డ్యాంలు ఏర్పాటుచేస్తున్నది. మూసీ రివర్‌ఫ్రంట్ పథకం పూర్తయితే పర్యాటక కేంద్రంగా కూడా మారుతుంది. కులీ కుతుబ్‌షా నగరాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారీ ఎత్తున దాదాపు 40 కార్యక్రమాలు అమలవుతున్నాయి. హైదరాబాద్‌తో పాటు జిల్లాల అభివృద్ధిపైన, పర్యాటక క్షేత్రాల వృద్ధి పైన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది.

యాదాద్రిని జాతీయ స్థాయి మత, సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా పనులు సాగిస్తున్నది. ఇంత పెద్దఎత్తున ఆలయాన్ని అభివృద్ధి చేయడం తెలంగాణ రాకముందు అనూహ్యం. గుట్టపైన నాలుగు ఎకరాల మేర మాస్టర్ ప్లాన్ అమలవుతున్నది. యాదగిరి గుట్ట ఆలయ అభివృద్ధి సంస్థ పరిధిలోకి 7 గ్రామాలను చేర్చడం వల్ల క్షేత్ర స్వరూపమే మారిపోయింది. క్షేత్రాభివృద్ధికి 1900 ఎకరాల భూ సేకరణ ఇప్పటికే జరిగింది. 800 ఎకరాలలో ఆలయ నగరం నిర్మాణం అవుతున్నది. ఈ దేవాలయ నిర్మాణ కార్యక్రమాలు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. యాదాద్రి జాతీయస్థాయిలో పర్యాటక క్షేత్రంగా మారుతుందనడంలో సందేహం లేదు. ప్రసిద్ధ శైవ క్షేత్రం వేములవాడ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 65 కోట్లు విడుదల చేసింది. దీనివల్ల దేవస్థానంతో పాటు చుట్టూరా ప్రదేశాలు భారీ మార్పునకు లోనవుతాయి. చుట్టూరా ఆరు గ్రామాలు ఈ అభివృద్ధి పరిధిలోకి వస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ రహదారుల విస్తరణకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. దీనివల్ల పట్టణాలలో, పల్లెలలో సౌకర్యాలు పెరుగడమే కాకుండా పల్లెలకు, పట్టణాలకు అనుసంధానం పెరుగుతుంది. దీనివల్ల ప్రజలకు సౌకర్యాలు మెరుగవడమే కాకుండా వ్యాపారాభివృద్ధి సాగుతుంది. నగరీకరణ క్రమాన్ని కూడా పెంచుతుంది. రాష్ట్రంలో 23 జాతీయ రహదారులున్నాయి. వీటి మొత్తం పొడుగు 3,824 కిలోమీటర్లు. మరో 13 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. దీనికి తోడు రహదారుల వ్యవస్థను భారీగా మెరుగుపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. మండల కేంద్రాలను జిల్లా కేంద్రాలతో అనుసంధానించడానికి రూ.2570.50 కోట్లు కేటాయించింది. 89 ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తి కాగా యాభై పురోగతిలో ఉన్నాయి. ఈ క్రమంలో సింగిల్ రోడ్లన్నీ డబుల్ రోడ్లుగా మారుతున్నాయి. జిల్లా రహదారులను కూడా మెరుగుపర్చడానికి భారీ కేటాయింపులు జరిగాయి. ఇందులో భాగంగా 1354 కిలోమీటర్ల మేర నిర్మాణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఇది మొత్తం కార్యక్రమాల్లో దాదాపు సగం. కృష్ణా, గోదావరి, వాటి ఉపనదులపై వంతెనల నిర్మాణం వల్ల రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుంది. కొన్నిచోట్ల అసలు వంతెనలే లేకపోగా మరి కొన్ని చోట్ల పురాతన వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 315 వంతెనల నిర్మాణాన్ని తలపెట్టింది. ఇందులో 234 వంతెనలు ఇప్పటికే పూర్తయ్యాయి. నదులపైనే కాకుండా తెలంగాణ భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ఇతరుల రహదారులపై కూడా వంతెనల అవసరం ఉన్నది. తెలంగాణ ఏర్పడిన వెంటనే దాదాపు 1,582 వంతెనల నిర్మాణం అవసరమని ప్రభుత్వం గుర్తించింది. అతివేగమైన కార్యాచరణ మూలంగా 474 వంతెనలు ఇప్పటికే పూర్తయ్యాయి. తెలంగాణ ప్రభుత్వానికి నగరాభివృద్ధి అనేది మొత్తం రాష్ట్రాభివృద్ధిలో భాగం. అందువల్ల రహదారుల నిర్మాణం తదనుగుణంగానే సాగుతున్నది. ఈ రహదారుల నిర్మాణం నగరీకరణ వేగాన్ని పెంచుతున్నది.

**(తెలంగాణ సామాజిక, ఆర్థిక సర్వే నివేదిక ఆధారంగా...)**

# నిధుల కోతకు బెదరని రాష్ట్రం


బడ్జెట్



**సోలిపేట రామలింగారెడ్డి**

దేశ ఆర్థికవ్యవస్థ మందగమనంలోకి జారిపోయింది. పెద్దనోట్ల రద్దు గ్రామీణ భారతాన్ని, జీఎస్టీ పట్టణ వ్యవస్థను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. ఆర్థిక సంస్కరణలు అంటే 'క్రోనీ క్యాపిటలిజం'అని, 'అవినీతి' కూపమని చెప్పిన మోదీ ప్రభుత్వం, ఫక్తు క్రోనీ క్యాపిటలిజాన్ని, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలను అమలుపరిచి, దేశ ఆర్థికవ్యవస్థ జీవం తీశారు. అసంఘటిత రంగంలో 45కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి సంక్షోభం ఎదురైంది. సంఘటిత రం గంలో ఉన్నవారు మూలధనం లేకుండా ఎలా ముందుకువెళ్లాలనే గంద ర గోళంలో పడి అభివృద్ధి కుంటుపడింది. ఈ ప్రక్రియలో రియల్ ఎస్టేట్ నుంచి అన్ని ఉత్పత్తులూ కర్మాగారాలకే పరిమితమైపోయాయి. ఇటువం టి సంఘర్షణ, ఆటుపోట్ల నేపథ్యంలో దేశంలో ఆర్థికమాంద్యం నెలకొన్న ది. ఈ విపత్కర పరిస్థితులను అంతంచేసి, సంపదను సృష్టించగల ప్రత్యా మ్నాయ ఆర్థికవిధానాలను రూపొందించి అమలుచేయలేక కేంద్ర ప్రభు త్వం చేతులెత్తేసింది. ఆర్థిక మందగమనాన్ని అధిగమించేందుకు ఎలాంటి ప్రగతిశీల నిర్ణయాలు ప్రకటించలేకపోయింది. రాష్ట్రాల బడ్జెట్‌లో కేటా యింపులను కుదించింది. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృ ద్ధి, తదితర రంగాలకు నిధులను తగ్గించారు.

సరిగ్గా దీనికి విరుగుడుగా తెలంగాణ బడ్జెట్ రూపుదిద్దుకున్నది. వాస్తవిక దృక్పథంతో 2020–21 బడ్జెట్ రూపకల్పన జరిగింది. కేంద్రం విస్మరించిన సంక్షేమం, అభివృద్ధి రంగాలకు ఊపిరి పోస్తూ సామాజిక తెలంగాణ స్వరూపాన్ని పునర్నిర్మాణం చేసుకునే విధంగా రాష్ట్ర బడ్జెట్ రూపుదిద్దుకున్నది. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా రాజ్యాంగపరమైన హక్కు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రానికి 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.19,718 కోట్లు రావాల్సి ఉన్నది. గత ఏడాది బడ్జెట్లో ఈ మొత్తాన్ని తెలంగాణ రాష్ట్రానికి అందిస్తామని కేంద్రం తెలిపింది. కానీ సవరించిన అంచనాల్లో ఈ మొత్తాన్ని రూ.15,987 కోట్లకు కుదించారు. దీనివల్ల ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో రూ.3,731 కోట్లు తగ్గాయి. కేంద్రానికి వచ్చే పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే వాటా తగ్గించడం కచ్చితంగా కేంద్ర ప్రభుత్వ అసమర్థత మాత్రమే. 2020–21 ఆర్థిక సంవత్సరంలో పన్నులు వసూలు చేసి, రాష్ట్రాలకు నిధులు సమకూర్చాల్సి ఉన్నది. ప్రతీ సందర్భంలోనూ బడ్జెట్లో ప్రకటించిన అంచనాల ప్రకారమే రాష్ట్రాలకు పన్నుల్లో వాటా చెల్లిస్తారు. ఒకటీ, అరా శాతం అటూఇటు అయిన సందర్భాలున్నాయి. కానీ, 2019–20లో ఏకం గా 18.9 శాతం తగ్గుదల రావడం 1920–21 సంవత్సరానికి ఇంకా తగ్గించటం కేంద్ర ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల నిర్వహణ లోపానికి నిదర్శనం. దీనిప్రభావం తెలంగాణ రాష్ట్రంపై దారుణంగా పడింది. 2020–21 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనల్లో కూడా తెలంగాణ రాష్ట్రానికి వచ్చే నిధుల్లో రెండు రకాల నష్టం వాటిల్లింది. 1. కేంద్రానికి వచ్చే పన్నుల్లో రాష్ట్రాలకు చెల్లించే వాటాను 42శాతం నుంచి 41శాతానికి తగ్గిస్తూ 15వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సులను కేంద్రం ఆమోదించింది. 2. తెలంగాణ రాష్ట్రానికి గతంలో 2.437 శాతం వాటాను ఇవ్వగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ వాటాను 2.133 శాతానికి తగ్గించారు. దీనివల్ల తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర పన్నుల్లో వాటాగా రావాల్సిన నిధుల్లో రూ.2,381 కోట్లు తగ్గనున్నాయి. ఇంత భారీగా తెలంగాణకు నిధులు తగ్గించడం వివక్షాపూరితమే. ఈ తగ్గుదల ప్రభావం రాష్ట్ర ప్రగతి ప్రణాళికలపై పడుతుంది. 2019–20 ఆర్థిక సంవత్సరంలోనే కేంద్ర పన్నుల్లో తెలంగాణకు ఇస్తామని పార్లమెంట్‌లో ప్రకటించిన వాటాలో 3,731 కోట్లు తగ్గించిన కేంద్రం, 2020–21లో రూ.16,726 కోట్లు ఇస్తామని ప్రతిపాదిస్తున్నది. ఈసారి కూడా అంచనాలు సవరించే నాటికి చెప్పినదాంట్లో ఎంత తగ్గిస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నది. కేంద్ర పన్నుల్లో వాటా విషయంలో కేంద్రం చెప్పిన మాటకు, ఇచ్చే నిధులకు సంబంధం



అటు పెద్దనోట్ల రదు, ఇటు కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో కోతతో గ్రామీణ జీవనం అతలాకుతలమైంది. విద్య, వైద్యం దూరమయ్యే పరిస్థితి నెలకొన్నది. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ఈ ప్రమాదం నుంచి గ్రామాలను గట్టెక్కించి జనజీవనానికి రక్షణ కవచంగా నిలబడింది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులేమీ లేనప్పటికీ మన కాళ్లమీద మనం నిలబడే విధంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది.

లేకుండా పోతున్నది. జీఎస్టీ విషయంలో కూడా కేంద్రం పెద్ద మోసం చేస్తున్నది. 14 శాతం లోపు ఆదాయవృద్ధి రేటు కలిగిన రాష్ట్రాలకు ఏర్పడే లోటును ఐదేండ్ల పాటు భర్తీ చేస్తా మని 2017లో తెచ్చిన జీఎస్టీ చట్టంలో చెప్పారు. దీనిప్రకారం తెలంగాణ రాష్ట్రానికి జీఎస్టీ పరిహారంగా ఇంకా 1,137 కోట్లు కేంద్రం ఇవ్వాల్సి ఉన్నది. ఈ నిధులను విడుదల చేసే విషయంలో కేంద్రం స్పష్టత ఇవ్వడం లేదు.


కేంద్ర బడ్జెట్‌లో పట్టణాల అభివృద్ధికి నిధుల కేటాయింపులో భారీ కోత పెట్టారు. దీనివల్ల వేగంగా పట్టణీకరణ జరుగుతున్న తెలంగాణకు తీవ్ర నష్టం కలుగుతున్నది. తెలంగాణలోని పట్టణాల అభివృద్ధికి 2019–20 బడ్జెట్లో 1,037 కోట్లు కేటాయించారు. 2020–21 బడ్జెట్ వచ్చే సరికి గతేడాదికన్నా 148 కోట్లు తగ్గించి, కేవలం 889కోట్లు మాత్రమే కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి గత బడ్జెట్‌తో పోలిస్తే, 2020–21 ఆర్థిక సంవత్సరంలో 0.26 శాతం, వైద్య ఆరోగ్య రం గానికి 0.11 శాతం, విద్యారంగానికి 0.15 శాతం, గ్రామీణాభి వృద్ధికి 0.43 శాతం తగ్గిస్తూ నిధులు కేటాయించారు. ఈ కేటాయింపుల సవరణతో గ్రామీణ పరిస్థితి మూలిగే నక్క మీద తాటిపండు పడినట్లయ్యింది. అటు పెద్దనోట్ల రద్దు ఇటు కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో కోతతో గ్రామీణ జీవనం అతలాకుతలమైంది.విద్య వైద్యం దూరమయ్యే పరిస్థితి నెలకొన్నది. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ఈ ప్రమాదం నుంచి గ్రామాలను గట్టెక్కించి జనజీవనానికి రక్షణ కవచంగా నిలబడింది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపు లేమీ లేనప్పటికీ మన కాళ్ల మీద మనం నిలబడేవిధంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది. ప్రపంచానికి తలమానికమైన కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసుకొని వ్యవసాయం, పరిశ్రమలు, మత్స్యసంపద, పర్యాటకం వంటి రంగాల్లో అభివృద్ధి సాధించి ఆదాయాన్ని రాబట్టేందుకు బడ్జెట్‌ను ఆర్థికమంత్రి రూపొందించారు. విద్య, వైద్యం వ్యవసాయం, సంక్షేమరంగాలకు కొత్త జవసత్వాలను ఇస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రద్ధాసక్తులు, సూక్ష్మ దృష్టి దార్శనికతను ప్రతిబింబిస్తున్నది. ఈ ఏడాదికిగాను రూ.1,82,914.42 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా రూ.25 వేల రుణం రైతులకు ఏకకాలంలో మాఫీ, రూ.25 వేల నుంచి లక్షలోపు ఉన్న రుణాలు 4 విడుతలుగా పంపిణీ, రైతుబంధు పథకానికి రూ.14 వేల కోట్లు, మూసీరివర్ ఫ్రంట్ కోసం 10 వేల కోట్లు, మున్సిపల్ శాఖకు 14,809 కోట్లు, హైదరాబాద్ అభివృద్ధి కోసం వచ్చే ఐదేండ్లలో 50 వేల కోట్లు కేటాయిస్తున్నది. పాఠశాల విద్య కోసం 10,421 కోట్లు, ఉన్నత విద్యాశాఖకు 1,723 కోట్లు, వైద్యరంగా నికి 6,156 కోట్లు, పంచాయతీ రాజ్‌శాఖకు 23,005 కోట్లు కేటాయింపులు జరిగాయి. కల్యాణలక్ష్మీ కోసం 1,350 కోట్లు, మహిళా స్వయం సహకా రా సంఘాలకు వడ్డీలేని రుణాల కింద 1,200 కోట్లు కేటాయించడం ముదావహం. ఈ బడ్జెట్ తెలంగాణ రాష్ర్టాన్ని ప్రగతి పథాన నిలబెడుతుం దనటంలో సందేహం లేదు.

**(వ్యాసకర్త: దుబ్బాక శాసనసభ్యులు)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

## వైభవంగా తెప్పోత్సవం



బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి వారికి తెప్పోత్సవం, డోలోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తెప్పోత్సవం సందర్భంగా ఉత్సవమూర్తులు హంసవాహనంలో కోనేరులో విహరించారు. అనంతరం డోలోత్సవం నిర్వహించారు. ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆలయం పక్షాన రైస్‌మిలర్లు, ఆర్యవైశ్యుల సహకారంతో 12 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

- ధర్మపురి, నమస్తే తెలంగాణ

## కన్నుల పండువగా రంగనాథ రథోత్సవం



వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి ఆలయంలో సోమవారం రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారు శ్రీదేవి, భూదేవీ సమేతుడై రథంపై ఊరేగారు. వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వనపర్తి రాజవంశీయుడు, ఆలయ ధర్మకర్త రాజాకృష్ణదేవరావు ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని లాగారు.

- పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం)



## తల్లి మరణిస్తుందేమోనని..
# కూతురు ఆత్మహత్య

**సిరిసిల్లక్రైం:** తండ్రిలాగే తల్లికూడా అనారోగ్యంతో చనిపోతుందేమోనని భయపడి కూతురు బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో సోమవారం చోటుచేసుకున్నది. సిరిసిల్లలోని చంద్రంపేటకు చెందిన రవీందర్, రూప దంపతులు. వీరికి కూతురు అనిల(19), కొడుకు శివకల్యాణ్ (16) ఉన్నారు. నేత కార్మికుడైన రవీందర్ పదేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. రూప బీడీలు చుడుతూ పిల్లలను చదివిస్తున్నది. కూతురు అనిల డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నది. కొంతకాలంగా రూప అనారోగ్యంతో బాధపడుతున్నది. తల్లి కూడా చనిపోతుందేమోననే మనస్తాపం చెందిన అనిల సోమవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది.

## నేడు ఆర్డీఎస్
# ఆనకట్టకు నీరు

**అయిజ:** కర్ణాటకలోని టీబీ డ్యాంనుంచి ఆర్డీఎస్ ఆనకట్టకు నీటివిడుదల కొనసాగుతున్నది. ఆర్డీఎస్ ఇండెంట్‌లోని 1.90 టీఎంసీల నుంచి టీబీడ్యాం ద్వారా 2,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సోమవారం టీబీ డ్యాం నుంచి తుంగభద్ర నదిలోకి నీటిని విడుదల చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టుకు, తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం లేఖరాయడంతో అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. టీబీ డ్యాం నుంచి విడుదలైన నీరు మంగళవారం వరకు ఆర్డీఎస్ ఆనకట్టకు చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

# నక్షను దాటిన నంబర్లు

### గ్రామ రెవెన్యూలో లేని సర్వేనంబర్లు కేటాయింపు


- వరంగల్ జిల్లా ధర్మసాగర్ రెవెన్యూలో సరికొత్త లీల
- వందమందికిపైగా రైతులకు అందని రైతుబంధు, రైతుబీమా
- 65ఏండ్ల క్రితంనాటి తప్పు.. నేడు దేవునూరు రైతులకు శిక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

### ధర్మగంట

రెవెన్యూ అధికారుల లీలల్లో ఇదో కొత్తరకం లీల.. రికార్డుల గురించి కొద్దోగొప్పో అవగాహన ఉన్నవారికి కూడా గ్రామ నక్ష ప్రకారమే సర్వే నంబర్లు కేటాయిస్తారని తెలుసు. గ్రామ రెవెన్యూలో ఉన్న భూమి మొత్తం ఆ సర్వే నంబర్లలోనే ఉంటుంది. భూమిని ఒకరి నుంచి మరొకరు కొనుగోలు చేసినా.. ప్రభుత్వ భూమిని లబ్ధిదారులకు కేటాయించినా అంతకుముందు సర్వేనంబర్‌ను లేదా దానికి బై నంబర్‌ను కేటాయిస్తారు. కానీ.. ఓ రెవెన్యూ అధికారి నక్షలో లేని నంబర్లను కేటాయించారు. 65 ఏండ్ల క్రితం రెవెన్యూ అధికారులు చేసిన తప్పు తాజాగా భూ రికార్డుల ప్రక్షాళనలో బయటపడింది. అప్పటిదాకా పాత పాస్‌పస్తకాలు, బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులు ఇప్పుడు రైతుబంధు, రైతుబీమా పథకాల కింద లబ్ధిపొందకపోగా.. తమ భూములకు రిజిస్ట్రేషన్లు కూడా లేవని తెలిసి మథనపడుతున్నారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదానికి తాము శిక్ష అనుభవిస్తున్నామంటూ దేవునూరు రైతులు 'నమస్తే తెలంగాణ' ధర్మగంటను ఆశ్రయించారు.

వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామనక్షలో 1 నుంచి 607 వరకు సర్వేనంబర్లు ఉన్నాయి. సీసీఎల్ వెబ్‌సైట్‌లో ఇవి స్పష్టంగా కనిపిస్తున్నాయి. 536 సర్వేనంబర్‌లో 598 ఎకరాల 11 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నది. అందులోని 130 ఎకరాలతోపాటు, మరికొన్ని సర్వేనంబర్ల నుంచి 1954-55లో గ్రామస్థులు కొందరికి భూములు ఇచ్చి పట్టాలుచేశారు. ఆ భూములకు నాటి రెవెన్యూ అధికారులు 536కు బై నంబర్లు ఇచ్చి పట్టాలు చేయకుండా.. రెవెన్యూలో చివరి నంబర్ 607 తర్వాత 608 నుంచి నంబర్లు కేటాయించారు. సర్వేనంబర్లు 608 నుంచి 637 వరకు ఇస్తూ ప్రభుత్వ భూమిని పట్టాచేశారు. రైతుల పేర్లు పహాణీలో రావడంతోపాటు, ఉమ్మడి ఏపీ ప్రభుత్వం పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా ఇచ్చింది. వాటిని బ్యాంకుల్లో పెట్టి కొంత మంది రైతులు రుణాలు తీసుకున్నారు.




607 వరకు మాత్రమే సర్వేనంబర్లు ఉన్నట్టు చూపిస్తున్న దేవునూరు గ్రామనక్ష

#### అందని ప్రభుత్వ పథకాలు..

ప్రస్తుతం ఈ భూమిపై మూడుతరాలు మారాయి. తాతలకు ఇచ్చిన భూములను ఇప్పుడు మనుమండ్లు, మనుమరాండ్రు, మునిమనుమండ్లు సాగు చేసుకుంటున్నారు. 65 ఏండ్ల క్రితం జరిగిన ఈ వ్యవహారం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళనలో బయటపడింది. దేవునూరు భూ రికార్డులకు బయటకుతీసిన రెవెన్యూ అధికారులు 608 నుంచి 637 సర్వేనంబర్ల వరకు గ్రామనక్షలో లేవని వాటిలోని భూములను 'బీ' క్యాటగిరీలో పెట్టారు. తమకు కొత్తపాస్‌పుస్తకాలు ఎందుకు ఇవ్వడం లేదని రైతులు ఆరా తీయగా ఈ విషయం బయటపడింది. ఏండ్లుగా భూమిని సాగుచేసుకుంటున్నామని.. తమకు రైతుబంధు, రైతుబీమా పథకాలు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ముత్తాత భూమికి సర్వేనంబర్ లేదంటున్నారు

**మా ముత్తాత** గ్యారంపల్లి రామయ్యకు 1954-55లో నాటి ప్రభుత్వం 3.14 ఎకరాలు పట్టా చేసింది. 619 సర్వేనంబర్ కేటాయించి కాస్తుకార్లకు ఎక్కించారు. రామయ్య నుంచి మనుమరాలు.. మా అమ్మ గ్యారంపల్లి రాధాబాయికి వారసత్వంగా వచ్చింది. ఆమె పేరు మీద పట్టా చేయడంతోపాటు ఖాతానంబర్ 81 కూడా ఇచ్చారు. మా అమ్మ వృద్ధాప్యంలో తనపేరుమీద భూమిని నా పేరుమీదకు విరాసత్ కింద పట్టాచేయడానికి దరఖాస్తు చేస్తుకుంటే 619 సర్వేనంబర్ లేదని తిరస్కరించారు. దీంతో కనపడిన అధికారికల్లా దరఖాస్తు చేసుకుంటున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. పాత డాక్యుమెంట్లు చూపించినా కూడా పార్ట్(బీ)లో పెట్టాం. మీ భూమిని మీరే సాగు చేసుకుంటున్నారు కదా.. అని చెప్తున్నారు తప్ప పట్టా ఇవ్వడం లేదు. నేనొక్కడినే కాదు.. మా ఊర్లో దాదాపు వందమంది రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు. 608 నుంచి 637 వరకు ఉన్న సర్వేనంబర్లు గ్రామనక్షలో లేవని చెపుతున్నారు.

- ఎం రాజేందర్, గ్యారంపల్లి రాధాబాయి కుమారుడు

### ఆర్డీవో, జేసీలకు సరిచేసే అధికారం ఉంది

**సెటిల్‌మెంట్** రికార్డు (సేత్వార్)లో ప్రతినంబర్ ఉంటుంది. ఏ భూమికైనా కొత్త సర్వే నంబర్లు ఇస్తే సప్లిమెంటరీ సేత్వార్ ఇస్తారు. అలా సప్లిమెంటరీ సేత్వార్ ఇస్తే కొత్తసర్వేనంబర్లకు విలువ ఉంటుంది. అలా సప్లిమెంటరీ సేత్వార్ విడుదల చేయకుండా తాసిల్దార్ తానే సర్కారు అనుకొని ఇష్టం వచ్చినట్టుగా సర్వేనంబర్లు ఇస్తే వాటికి విలువ ఉండదు. అయితే ఈ సర్వేనంబర్ నుంచి రైతులకు ఎంత భూమిని కేటాయించారో చూసుకొని ఆర్వోఆర్ చట్టంలో సెక్షన్ 5బీ/2 కింద ఆర్డీవో, సెక్షన్ 9 కింద జేసీ రికార్డులు సరిచేయవచ్చు. ఈ రైతుల భూములకు గ్రామనక్షలోఉన్న సర్వేనంబర్లకే బైనంబర్లు ఇవ్వొచ్చు.

- ఎం సునీల్‌కుమార్, భూమిచట్టాల న్యాయనిపుణుడు, నల్సార్ లా యూనివర్సిటీ అడ్జంట్ ప్రొఫెసర్

### కమనీయం.. మన్యంకొండ వెంకన్న కల్యాణం



మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ క్షేత్రంలోని వెంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మల కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన్యంకొండలో కల్యాణమండపాన్ని నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

- మహబూబ్‌నగర్ రూరల్

### లక్ష్మీనరసింహస్వామికి చేనేత వస్త్రాలు



జనగామ జిల్లా దేవరుప్పల మండలం వానకొండయ్యగుట్టపై సోమవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వేడుకలకు హాజరయ్యారు. చేనేత కార్మికులతోకలిసి స్వామివారి పట్టువస్త్రాలను నేశారు. స్వామివారి కల్యాణానికి తలంబ్రాలు అందజేశారు. వేడకలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

- దేవరుప్పల

# పలు జిల్లాల్లో అకాల వర్షం

### పంటలకు నష్టం
### వచ్చే రెండ్రోజులు వానలు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ/నెట్‌వర్క్:** ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు ఈదురు గాలులు తోడుకావడంతో చాలా ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్-టి, వాంకిడి, కౌటాల, చింతలమానేపెల్లి, బెజ్జూర్ తదితర ప్రాంతాల్లో సోమవారం తేలికపాటి వర్షం పడింది. ఈదురుగాలలతో కూడిన వర్షానికి శనగపంటకు కొద్దిపాటి నష్టం వాటిల్లింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, మయూరి పార్క్, భూత్పూర్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ముసురు కురిసింది. నారాయణపేట జిల్లాలోని దామరగిద్ద, నారాయణపేట, మద్దూర్, కోస్గి మండలాల్లో ఓ మోస్తరు వాన పడింది. కామారెడ్డి జిల్లా లింగంపేట్, గాంధారి, బీర్కూర్, నాగిరెడ్డిపేట్ మండలాల్లో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి మక్కజొన్న నేలవాలింది.



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లిలో నేలకొరిగిన మక్కజొన్న

#### కరీంనగర్ జిల్లాలో...

కరీంనగర్ జిల్లాలో ఆదివారం కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో వరద నీరు చేరడంతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. అకాల వర్షానికి పలు మండలాల్లో 885 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాల్లో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మానకొండూర్‌లోని పలు చోట్ల దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు.

#### గ్రేటర్ హైదరాబాద్‌లో..

గ్రేటర్ హైదరాబాద్‌లోని శివరాంపల్లి, రాజేంద్రనగర్, మెహిదీపట్నం, నాంపల్లి, అబిడ్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, బేగంపేట తదితర ప్రాంతాల్లో సోమవారం తేలికపాటి వర్షం కురిసింది. గ్రేటర్‌వ్యాప్తంగా 1.0 సెం.మీ. వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

#### ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా..

సోమవారం మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి, నాగర్‌కర్నూల్, ఆదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి, మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిశాయి. ఆదిలాబాద్ తలమడుగులో అత్యధికంగా 29.3 మి.మీ. వర్షం కురిసినట్టు టీఎస్‌డీపీఎస్ తెలిపింది.

#### మరో రెండ్రోజులు వానలు

మరాఠ్వాడ నుంచి దక్షిణ తమిళనాడు వరకు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో మంగళ, బుధవారాల్లోనూ ఆకాశం మేఘావృతమై, పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. కాగా వచ్చే మూడు రోజులపాటు గ్రేటర్ హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్టు పేర్కొన్నారు.



పెదనాన్న మృతదేహంతో వివేక్ తీసిన సెల్ఫీ

## పెదనాన్న హత్య..
# ఆపై సెల్ఫీ

### ఆదిలాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి..

**ఆదిలాబాద్ అర్బన్, నమస్తేతెలంగాణ:** ఆదిలాబాద్ జిల్లాలో ఓ యువకుడు పెదనాన్నను హత్య చేసి.. ఆ మృతదేహంతో సెల్ఫీ దిగిన ఫొటోలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఉట్నూరు మండలం లక్కారం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏఎస్సై శివరాజ్‌కు ఆయన తమ్ముడి కుటుంబానికి ఈనెల 6న ఆస్తి విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో శివరాజ్‌పై ఆయన తమ్ముడి కొడుకులు కర్రలతో దాడిచేయగా ఆయన తీవ్రగాయాలతో మృతి చెందాడు. ఈ ఘటనలో నిందితులను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. దాడి చేసిన అనంతరం సంఘటన స్థలంలోనే పెదనాన్న మృతదేహంతో వివేక్ సెల్ఫీదిగిన ఫొటోలు సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చాయి.

# హోలీ వేడుకల్లో అపశ్రుతి

### వేర్వేరు ఘటనల్లో నీటమునిగి ఆరుగురు మృతి

**నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ:** హోలీవేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఆరు కుటుంబాల్లో విషాదం నింపాయి. ఉత్సాహంగా హోలీలో పాల్గొని అనంతరం చెరువలు, కాల్వలో స్నానానికి వెళ్లిన ఆరుగురు దుర్మరణం చెందారు. వరంగల్ రూరల్ జిల్లా సంగెం మండలం కాపుల కనపర్తికి చెందిన రాకేశ్(9), యశ్వంత్(13) స్నేహితులతోకలిసి హోలీ జరుపుకొన్నారు. అనంతరం స్నానంచేసేందుకు పాయ చెరువులోకివెళ్లి ఈత రాక నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు గజ ఈతగాళ్లతో మృతదేహాలను వెలికితీశారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోపాలపురానికి చెందిన ఇందు (14) అనే బాలిక స్నేహితులతోకలిసి హోలీ జరుపుకొన్నది. అనంతరం వారంతా గ్రామసమీపంలోని చెరువులోకి స్నానానికి వెళ్లారు. ఈ క్రమంలో ఈతరాక చెరువులో ఇందు మృతిచెందింది. గ్రామస్థులు ఆమె మృతదేహాన్ని బయటకు తీశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పునుకుల గ్రామానికి చెందిన శివ(12) ఉదయం స్నేహితులతోకలిసి హోలీఆడాడు. అనంతరం కిన్నెరసాని కాల్వకు వెళ్లాడు. ఈతరాక కాల్వలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన కల్యాణ్ (18) స్నేహితులతో కలిసి హోలీ సంబురాల్లో పాల్గొన్నాడు. అనంతరం స్నేహితుల వెంట మల్హర్ మండలం నాచారం సమీపంలోని తాడ్వాయి చెరువులో స్నానానికి వెళ్లాడు. కల్యాణ్‌కు ఈతరాకపోవడంతో నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట చెందిన కలవేని అజయ్ (20) స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నాడు. అనంతరం స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు బొక్కలగుట్ట వాగులోపడి మృతిచెందాడు.

## బాలికల గురుకులంలోకి
# చొరబాటు

### ముగ్గురు యువకులపై కేసు

**కెరమెరి:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం మోడి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలోకి ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ముగ్గురు యువకులు చొరబడ్డారు. వెంటనే గుర్తించిన వార్డెన్ వారిని నిర్బంధించి పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. దేవాపూర్ గ్రామానికి చెందిన ఉపేందర్, నిఖిల్, నార్నూర్ మండలం ఉమ్రి గ్రామానికి చెందిన బ్రహ్మనంద్.. మోడి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులతో పరిచయం ఉన్నది. ఈ సాకుతో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత వారు వసతి గృహంలోకి ప్రవేశించారు. తమను ప్రేమించాలంటూ వేధింపులకు గురిచేయడంతో, గమనించిన పక్క గది విద్యార్థినులు వార్డెన్‌కు సమాచారం అందించారు. వార్డెన్ సోయం ఇందిర వారిని గదిలో నిర్బంధించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ సత్యనారాయణ, వాంకిడి సీఐ రాణాప్రతాప్, ఎస్సై రమేశ్ విచారణ జరిపి సదరు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై తెలిపారు.



మాతా మాణికేశ్వరి అంతిమయాత్రకు తరలివచ్చిన భక్తులు

# మాతా మాణికేశ్వరికి కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- కర్ణాటక ప్రభుత్వం నిర్వహణ

**నారాయణపేట ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** మాతా మాణికేశ్వరికి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కర్ణాటక ప్రభుత్వం అధికార లాంచనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించింది. మాతను చివరిసారి దర్శించుకొనేందుకు కర్ణాటక-తెలంగాణ సరిహద్దులోని యానగుంది సూర్యనందిక్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. మాణికేశ్వరిమాత ఈనెల 7న శివైక్యం పొందిన విషయం తెలిసిందే.




రెండురోజులపాటు ఆమె పార్థివదేహాన్ని భక్తుల సందర్శనార్థం ఉంచారు. మనరాష్ట్రంతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాత గతంలో సజీవసమాధి కోసం ఏర్పాటుచేసుకున్న చోటే ఆమె పార్థివదేహాన్ని ఉంచారు. అంత్యక్రియలకు కర్ణాటకకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

## 'దిశ' నిందితుడి
# తండ్రి మృతి

### రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయాలు

**మక్తల్‌రూరల్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'దిశ' ఘటనలో నిందితుడైన నారాయణపేట జిల్లా గుడిగండ్లకు చెందిన చెన్నకేశవులు తండ్రి జొల్లు కుర్మయ్య(50) సోమవారం మృతి చెందాడు. రెండు నెలల క్రితం రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ కోమాలోకి వెళ్లాడు. ఈ క్రమంలో వైద్యులు మూడు రోజుల క్రితం కుర్మయ్యను డిశ్చార్జి చేయగా కుటుంబ సభ్యులు స్వగ్రామమైన గుడిగండ్లకు తీసుకొచ్చారు. కాగా సోమవారం మధ్యాహ్నం కుర్మయ్య మృతిచెందాడు. కాగా చెన్నకేశవులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా.. ఆయన భార్య రేణుక రెండు రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది.



కుర్మయ్య(ఫైల్)

epaper.ntnews.com

# వాణిజ్య

చరిత్రలో సెన్సెక్స్ భారీ పతనాలు

22-1-2008 875.41
3-3-2008 900.84
17-3-2008 951.03
1-2-2020 987.96
24-10-2008 1070.63
21-1-2008 1408.35
28-2-2020 1448.37
24-8-2015 1624.51
9-3-2020 1941.67

బ్యాంక్ నిఫ్టీ 1,338 పాయింట్లు తగ్గి 26,462వద్దకు జారుకున్నాయి.

మిడ్‌క్యాప్ ఇండెక్స్ గత రెండేండ్లలో అతిపెద్ద పతనాన్ని మూటగట్టుకున్నది. 673 పాయింట్లు క్షీణించి 13,554 వద్ద స్థిరపడింది.

బీఎస్‌ఈ బ్యాంకెక్స్ 1,604 పాయింట్లు(5.01 శాతం) క్షీణించి 30,384లకు పడిపోయింది.

స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 559 పాయింట్లు కోల్పోయి 12,770 వద్ద పరిమితమైంది.




గత నెల రోజుల్లో సెన్సెక్స్ 5 వేల పాయింట్లు లేదా 12.13 శాతం పతనం చెందింది. నిఫ్టీ 1,512 పాయింట్లు లేదా 12.51 శాతం క్షీణించింది. కరోనా వైరస్‌తో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతున్నదన్న అంచనాలు మార్కెట్లలో అలజడి సృష్టించాయి.

రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ధర 14 శాతం పతనంతో తన మొదటి ర్యాంక్ కోల్పోయింది. దీంతో మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో టీసీఎస్ తొలిస్థానంలో నిలిచింది. ఆర్ఐఎల్ విలువ రూ.7 లక్షల కోట్లకు, టీసీఎస్ విలువ రూ.7.31 లక్షల కోట్లకు చేరుకున్నది.

2,199 స్టాకులు పడిపోగా, 357 స్టాకులు లాభాల్లో ముగిశాయి. కానీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఇండియన్ ఆయిల్ షేర్లు 13 శాతం వరకు లాభపడటం విశేషం.



బ్లాక్ మండే





బ్యారెల్ ముడి చమురు ధర డాలర్ తగ్గితే భారత్‌కు రూ. 3వేల కోట్ల మేర లాభం



సోమవారం ఆల్‌టైమ్ ఇంట్రా-డే నష్టాలు

సెన్సెక్స్ 2,467 పాయింట్లు

నిఫ్టీ 695 పాయింట్లు

ఒక్కరోజే విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐ)లు ఏకంగా 6,595.56 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

# 7 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్లలో చోటుచేసుకున్న భారీ నష్టాలు లక్షల కోట్ల రూపాయల మదుపరుల సంపదను ఆవిరి చేశాయి. సోమవారం ఒక్క రోజే దాదాపు రూ.7 లక్షల కోట్ల మార్కెట్ సంపద కరిగిపోయింది. మదుపరులను చుట్టుముట్టిన ఆర్థిక మాంద్యం భయాలు.. సూచీల ఊపిరిని తీసేశాయి. ముఖ్యంగా సెన్సెక్స్ మునుపెన్నడూ లేనివిధంగా 1,941.67 పాయింట్లు నష్టపోవడంతో బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.6,84,277.65 కోట్లు తరిగిపోయింది. ఫలితంగా స్థూల విలువ రూ.1,37,46,946.76 కోట్లకు దిగజారింది. శుక్రవారం స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈలోని సంస్థల మార్కెట్ విలువ రూ.1,44,31,224.41 కోట్లుగా ఉన్న విషయం తెలిసిందే. కాగా, సోమవారం బీఎస్ఈ ట్రేడింగ్‌లో 2,199 షేర్లు నష్టపోగా, 357 షేర్లు పెరిగాయి. 169 షేర్లు మాత్రం యథాతథంగా ఉన్నాయి.

## 147 డాలర్ల నుంచి..

**ఆకాశమే హద్దుగా** దూసుకుపోయిన క్రూడాయిల్ ధరలు అంతే వేగంతో కిందకు పడిపోయాయి. 2008లో 147 డాలర్ల రికార్డు స్థాయి పలికిన బ్యారెల్ క్రూడాయిల్..ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ తొలిసారి అధికారంలోకి వచ్చిన ఏడాది 2014లో 100 డాలర్లకు పడిపోయింది. ఆ తర్వాతి రెండేండ్లలో 27 డాలర్లకు పడిపోయినప్పటికీ సామాన్యుడికి ఊరటనిచ్చింది మాత్రం స్వల్పమే. అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు భారీగా తగ్గుతున్నప్పటికీ ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థలు ఈ ప్రయోజనాన్ని కస్టమర్లకు చేరవేయడం లేదు. ఇంధన ధరలు భారీగా తగ్గడంతో ద్రవ్యలోటును కట్టడి చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి లైన్ క్లియర్ అవుతున్నది. గడిచిన కొన్ని నెలలుగా జీఎస్టీ వసూళ్లు తగ్గుముఖం పడటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కేంద్రానికి చమురు ధరల రూపంలో భారీ ఊరట లభించినట్లు అయింది. 2020–21లో దేశ జీడీపీలో ద్రవ్యలోటును 3.5 శాతానికి కట్టడి చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పునరుద్ఘాటించారు.

# ఉత్పాతం


# చమురు వదిలింది

### రష్యా-సౌదీ అరేబియా మధ్య రాజుకున్న ధరల యుద్ధం

### 31 డాలర్ల దరిదాపుల్లోకి బ్యారెల్ క్రూడ్

### గల్ఫ్ యుద్ధం తర్వాత ఇదే అత్యంత పతనం

**అంతర్జాతీయ** మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పతనమయ్యాయి. సోమవారం ఏకంగా 20 శాతానికిపైగా పడిపోయాయి. ప్రపంచ ప్రామాణిక బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర ఈ ఒక్కరోజే బ్యారెల్‌కు 9.74 డాలర్లు లేదా 21 శాతం దిగజారింది. 35.52 డాలర్ల వద్ద ట్రేడైంది. ఒకానొక దశలో ధరలు 30 శాతానికిపైగా పడిపోయి బ్యారెల్ 31.02 డాలర్లే పలికింది. గల్ఫ్ యుద్ధం తర్వాత ఈ స్థాయిలో ధరల క్షీణత ఇదే కావడం గమనార్హం. అటు అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ బ్యారెల్ విలువ సైతం 32.13 డాలర్లకు పరిమితమైంది. ఒక్కరోజే 9.15 డాలర్లు లేదా 22 శాతం తగ్గింది. 1991 జనవరి తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. ట్రేడింగ్‌లో 27.34 డాలర్ల కనిష్ఠాన్నీ తాకింది. కరోనా వైరస్ నేపథ్యంలో క్రమేణా క్షీణిస్తున్న ముడి చమురు ధరలను నియంత్రించేందుకు ఉత్పత్తిని మరింత తగ్గించాలన్న ప్రతిపాదనపై ఒపెక్, దాని భాగస్వామ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సౌదీ అరేబియా ధరల యుద్ధానికి తెరతీసింది. ఏప్రిల్‌కుగాను విక్రయించే బ్యారెల్ చమురు ధరలపై 6–8 డాలర్ల రాయితీలను సౌదీ ఇటీవల ప్రకటించింది. ఇందుకు తగ్గట్లే ఉత్పత్తినీ పెంచాలని తీర్మానించింది. ఈ నిర్ణయం ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది.




## భారత్‌కు ఆయిల్ బొనాంజా?

**గత 20 ఏండ్లలో** ఎన్నడూ లేనంతగా చమురు ధరలను భారీగా తగ్గిస్తూ సౌదీ అరేబియా నిర్ణయం తీసుకోవడం.. భారత్, చైనాలకు కలిసిరానున్నది. దేశీయ చమురు అవసరాలు దాదాపు 84 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో ఐదోవంతు సౌదీ అరేబియా నుంచే భారత్‌కు వస్తున్నాయి. ఆర్థిక మాంద్యం, వాణిజ్య లోటును ఎదుర్కొంటున్న భారత్‌కు ఆయిల్ ధరలు దిగిరావడం ఊరటనిచ్చే అంశం. దీనివల్ల విదేశీ మారక నిల్వలు ఆదా కావడంతోపాటు చమురు అవసరాలు కూడా తీరుతాయి. అలాగే ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లపై ఒత్తిడి తగ్గుతుంది. ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుంటాయి. వినియోగదారుల ఖర్చులు పెరగడం, తద్వారా ఎక్సైజ్ సుంకం రూపేణా ప్రభుత్వ ఆదాయమూ అధికమవనున్నది. కొటక్ మహీంద్రా ఎండీ, సీఈవో ఉదయ్ కొటక్ ట్వీట్ చేస్తూ.. 'అల్లర్లు, వైరస్ పరిణామాల నడుమ ఒక శుభవార్త. ఆయిల్ ధరలు తగ్గడం ద్వారా భారత్‌కు ఏడాదికి 30 బిలియన్ డాలర్లు మిగులుతుంది' అని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వృద్ధి పుంజుకోవడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

## మార్కెట్ ఉసురు తీసిన మదుపరుల భయాలు

### కరోనా, క్రూడ్ ధరల పతనంతో చారిత్రక నష్టాలు.. ఆర్థిక మాంద్యం అంచనాలతోనూ అమ్మకాల ఒత్తిడి

### సెన్సెక్స్ 1,942 పాయింట్ల క్షీణత.. నిఫ్టీ సైతం 538 పాయింట్లు డౌన్.. నెల రోజుల్లో 5వేల పాయింట్లు మటాష్

**ముంబై, మార్చి 9:** కరోనా వైరస్‌తో వణికిపోతున్న స్టాక్ మార్కెట్లను.. సౌదీ అరేబియా చమురు ధరల యుద్ధం చావుదెబ్బ తీసింది. అంతర్జాతీయ విపణిలో ఒక్కసారిగా పడిపోయిన క్రూడ్ ధరలు.. సోమవారం భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చాయి. ప్రపంచ ఆర్థిక మాంద్యం భయాలు మదుపరులను వెంటాడటంతో దేశీయ మార్కెట్లు మునుపెన్నడూ లేని నష్టాలను చవిచూశాయి. ఉదయం ప్రారంభం నుంచే భారీ నష్టాలు మొదలైయ్యాయి. సమయం గడుస్తున్నకొద్దీ నష్టాల తీవ్రత అంతకంతకూ పెరుగుతూపోగా.. మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోయింది. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్ 1,941.67 పాయింట్లు లేదా 5.17 శాతం దిగజారి 35,634.95 వద్దకు చేరింది. దాదాపు 13 నెలల్లో ఇదే అత్యంత కనిష్ఠ స్థాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 538 పాయింట్లు లేదా 4.90 శాతం పతనమై 10,451.45 స్థాయికి దిగింది. ఒకానొక దశలో సెన్సెక్స్ 2,460 పాయింట్లు, నిఫ్టీ 695 పాయింట్లు పడిపోయాయి. ఇంట్రా–డేలో ఈ విధంగా నష్టపోవడం ఇదే ప్రథమం. ఫిబ్రవరి 1 నుంచి గమనిస్తే.. సెన్సెక్స్ 5,088.54 పాయింట్లు, నిఫ్టీ 1,510.65 పాయింట్లు పతనమైయ్యాయి. కాగా, గ్లోబల్ క్రూడ్ మార్కెట్ పరిణామాలతో చమురు రంగ షేర్లు పెద్ద ఎత్తున నష్టపోయాయి. ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ అత్యధికంగా 16 శాతానికిపైగా క్షీణించగా, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేర్ విలువ 12 శాతానికిపైగా పతనమైంది. ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, టీసీఎస్, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఆటో షేర్లూ మదుపరులను ఆకట్టుకోలేక చతికిలపడ్డాయి. యెస్ బ్యాంక్‌లో 49 శాతం వాటా కొంటామన్న ఎస్బీఐ షేర్ విలువ 6 శాతానికి పైగా హరించుకుపోయింది. మరోవైపు ఈ ప్రకటన యెస్ బ్యాంక్‌కు కలిసొచ్చింది. రంగాలవారీగా చూస్తే.. అత్యధికంగా ఇంధన రంగ షేర్ల విలువ 9.74 శాతం కోల్పోయింది. మెటల్, ఐటీ, చమురు, గ్యాస్, టెక్నాలజీ, బ్యాంకింగ్, ఆర్థిక రంగాల షేర్లూ దిగజారాయి. బీఎస్ఈ మిడ్–క్యాప్, స్మాల్–క్యాప్ సూచీలు 4.73 శాతం మేర నష్టపోయాయి.

### ప్రపంచ మార్కెట్ విలవిల

ప్రపంచ స్టాక్ మార్కెట్లన్నీ సోమవారం నేలచూపులే చూశాయి. ఆసియా, ఐరోపా, అమెరికా ఇలా ఏ ఖండం, ఏ దేశ మార్కెట్లైనా నష్టాలకే పరిమితమైయ్యాయి. చైనా, హాంకాంగ్, దక్షిణ కొరియా, జపాన్ సూచీలు 5 శాతం వరకు నష్టపోగా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ సూచీలు 9 శాతం వరకు పడిపోయాయి. అమెరికా స్టాక్ మార్కెట్ సైతం వణికిపోయింది. ప్రారంభంలోనే 1,400 పాయింట్లు పతనమై డౌజోన్స్ 24,463.37 వద్దకు, నాస్‌డాక్ 5.2 శాతం క్షీణించి 8,133.67 వద్దకు దిగజారాయి.

### ఆగిన అమెరికా మార్కెట్

కరోనా వైరస్, చమురు ధరల పతనం మధ్య సోమవారం అమెరికా స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలకు లోనైయ్యాయి. భీకర అమ్మకాల ఒత్తిడిలో ఉన్న మదుపరులను శాంతింపజేయడానికి ట్రేడింగ్‌ను 15 నిమిషాలపాటు నిలిపివేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది.

## రూపాయే...!

### 17 నెలల కనిష్ఠానికి మారకం

స్టాక్ మార్కెట్లతోపాటు దేశీయ కరెన్సీ విలువ కూడా భారీగా పతనం చెందింది. కరోనా వైరస్ దెబ్బకు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలనుండటంతో అటు ఈక్విటీలు, మరోవైపు ఫారెక్స్ మార్కెట్లు పాతాళం వైపు పడిపోయాయి. ఎన్నడు లేనంత స్థాయిలో రూపాయి బక్కచిక్కింది. డాలర్‌ను కొనుగోలు చేయడానికి బ్యాంకర్లు, ఎగుమతిదారులు ఎగబడటంతో రూపాయి మారకం విలువ 17 నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. సోమవారం ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 30 పైసలు తగ్గి 74.17 స్థాయికి జారుకున్నది. 73.99 వద్ద ప్రారంభమైన కరెన్సీ విలువ ఒక దశలో 73.85 గరిష్ఠ స్థాయిని తాకింది. మార్కెట్ల నిరాశాజనక పనితీరుతో సెంటిమెంట్ బలహీనపడింది. ఫలితంగా చివరకు 30 పైసలు కోల్పోయి 74.17 వద్ద ముగిసింది. కరోనా వైరస్ నేపథ్యంలో క్రమేణా క్షీణిస్తున్న ముడి చమురు ధరలను నియంత్రించేందుకు ఉత్పత్తిని మరింత తగ్గించాలన్న ప్రతిపాదనపై ఒపెక్, దాని భాగస్వామ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సౌదీ అరేబియా ధరల యుద్ధానికి తెరతీయడంతో గ్లోబల్ మార్కెట్లో ఇంధన ధరలు కుదేలయ్యాయి. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లతోపాటు కరెన్సీలు నేలచూపులు చేశాయి. డాలర్‌తోపాటు పౌండ్, యూరో విలువ భారీగా పడిపోయింది.





## ఎందుకీ పతనం?

**స్టాక్ మార్కెట్ల భీకర నష్టాలకు ప్రధానంగా ఐదు కారణాలు కనిపిస్తున్నాయి. మార్కెట్ల పంచ ప్రాణాలను హరించి, మదుపరుల ఆశల్ని ఆవిరి చేసిన అవేమిటంటే..**

### ముడి చమురు ధరలు

ముడి చమురు ధరల్ని తగ్గించాలని, ఉత్పత్తిని పెంచాలని సౌదీ అరేబియా తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయ క్రూడ్ మార్కెట్‌ను షేక్ చేసింది. 30 శాతానికిపైగా ధరలు పడిపోయాయి. గల్ఫ్ యుద్ధం తర్వాత ఒక్కరోజే ఈ స్థాయిలో ముడి చమురు ధర క్షీణించడం ఇదే తొలిసారి. ఒపెక్ సభ్య దేశాలతో చర్చలు విఫలమైన నేపథ్యంలో సౌదీ ఈ నిర్ణయానికి రాగా.. చమురు రంగ షేర్లు కుప్పకూలాయి.

### కరోనా వైరస్

ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న కరోనా వైరస్.. మదుపరులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. చైనాలో పుట్టిన ఈ మహమ్మారి కారణంగా ఇప్పటికే దాదాపు 3,500 మంది ప్రాణాలను కోల్పోగా, లక్ష మందికి పైగా ఈ అంటువ్యాధి బారినపడ్డారు. భారత్‌లోనూ కేసులు పెరుగుతుండటం మదుపరులను అమ్మకాల ఒత్తిడికి లోనుచేసింది. ఈ ప్రభావం అన్ని రంగాలపై కనిపించింది.

### బ్యాంకింగ్‌పై భయాలు


యెస్ బ్యాంక్ సంక్షోభం.. మొత్తం భారతీయ బ్యాంకింగ్ రంగ సుస్థిరతపైనే అనుమానాల్ని కలుగజేసింది. మొండి బకాయిలతో సతమతమవుతున్న బ్యాంకింగ్ రంగంలో వెలుగుచూస్తున్న వరుస మోసాలు మదుపరులను నొప్పిస్తున్నాయి. దీంతో చోటుచేసుకున్న పెట్టుబడుల ఉపసంహరణ.. బ్యాంకింగ్ షేర్లను తీవ్రంగా నష్టపరిచాయి. బ్యాంకింగేతర ఆర్థిక రంగ షేర్లూ చతికిలపడ్డాయి.

### పెట్టుబడుల వాపస్

విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ).. భారతీయ స్టాక్ మార్కెట్ల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుంటూనే ఉన్నారు. ఆగని ఈ పెట్టుబడుల పోకడ.. మార్కెట్లను నిట్టనిలువునా ముంచేసింది. గడిచిన 15 రోజుల్లో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.21,937 కోట్ల పెట్టుబడులను ఎఫ్ఐఐలు వెనక్కి తీసుకున్నారు. దేశ ఆర్థిక మందగమన ప్రభావం ఎఫ్ఐఐలపై స్పష్టంగా కనిపిస్తున్నది.

### గ్లోబల్ గోవింద!

అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల నష్టాలు కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల ఉసురు తీశాయి. ఆసియా–పసిఫిక్ షేర్ల పతనం.. దేశీయ స్టాక్ మార్కెట్లపై స్పష్టంగా కనిపించింది. జపాన్, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, హాంకాంగ్, ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా, దుబాయ్, కువైట్ స్టాక్ మార్కెట్లన్నీ కూడా భారీ నష్టాలకే పరిమితమైయ్యాయి. ఇదే దారిలో భారతీయ స్టాక్ మార్కెట్లూ పయనించాయి.



## రూ.71 దిగువకు పెట్రోల్

**న్యూఢిల్లీ, మార్చి 9:** ఇంధన ధరలు శాంతించాయి. పెట్రోల్ ధరలు ఎనిమిది నెలల తర్వాత తొలిసారిగా రూ.71 దిగువకు పడిపోయాయి. చమురు సరఫరా దేశాల మధ్య ధరల యుద్ధం తీవ్రమవడంతో గ్లోబల్ మార్కెట్లో ధరలు ఒక్కసారిగా భారీగా పతనమయ్యాయి. 1991 గల్ఫ్ యుద్ధం తర్వాత ఇంతటి స్థాయిలో పతనవడంతో అత్యధికంగా దిగుమతులపై ఆధారపడుతున్న భారత్ లాంటి దేశాలకు ఇది శుభవార్తలాంటిది. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 24 పైసలు తగ్గి రూ.70.59కి, డీజిల్ ధర 25 పైసలు తగ్గి రూ.63.26 వద్దకు జారుకున్నది. ఆయా నగరాల్లో విధిస్తున్న పన్నుల ఆధారంగా ధరలు మరింత తగ్గనున్నాయి. హైదరాబాద్‌లో పెట్రోల్ 25 పైసలు తగ్గి రూ.75.04కి చేరుకోగా, డీజిల్ మరో 27 పైసలు తగ్గి రూ.68.88 వద్ద నిలిచింది. గత నెల 27 నుంచి తగ్గుతూ వచ్చిన ఇంధన ధరలు ఇప్పటి వరకు పెట్రోల్ రూ.1.42, డీజిల్ రూ.1.44 పడిపోయాయి.



## ముకేశ్‌కు రూ.42వేల కోట్ల నష్టం



**దేశంలోనే** అత్యంత ధనవంతుడైన ముకేశ్ అంబానీ సంపద ఒక్కరోజే దాదాపు రూ.42వేల కోట్లు కరిగిపోయింది. స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలు ముకేశ్ సంపదను తరిగించేశాయి. సోమవారం ట్రేడింగ్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) షేర్ విలువ 12 శాతానికిపైగా పడిపోయింది. గత పదేండ్లలో ఇదే అతిపెద్ద పతనం కావడం గమనార్హం. రష్యాతో సౌదీ అరేబియా మొదలు పెట్టిన ధరల యుద్ధం.. భారత్‌లో ఆర్ఐఎల్ షేర్లను ప్రభావితం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర 31 శాతం క్షీణించిన నేపథ్యంలో రిలయన్స్ షేర్ విలువ 12.35 శాతం దిగజారింది. ట్రేడింగ్ మొదలు తీవ్ర ఒడిదుడుకులకు లోనైన ఆర్ఐఎల్ షేర్.. ఒకానొక దశలో రూ.1,094.95 స్థాయిని తాకింది. అయినప్పటికీ తేరుకుని చివరకు రూ.1,113.15 వద్ద ముగిసింది. ప్రస్తుతం ఆర్ఐఎల్ మార్కెట్ విలువ రూ.7.06 లక్షల కోట్లుగా ఉన్నది. ఇక తాజా నష్టాల మధ్య టీసీఎస్ మార్కెట్ లీడర్‌గా ఎదిగింది. ఈ సంస్థ మార్కెట్ విలువ రూ.7.40 లక్షల కోట్లుగా ఉన్నది.

### ప్రపంచ మార్కెట్ల పతనం (పాయింట్లలో)

| | |
|---|---|
| డౌజోన్స్ | 1976 |
| ఎస్ అండ్ పీ | 218 |
| నాస్‌డాక్ | 566 |
| డీఏఎక్స్ | 916 |
| నిక్కీ | 1050 |

నమస్తే తెలంగాణ WWW.NTNEWS.COM

/nt.zindagi

# జిందగీ

మంగళవారం 10 మార్చి 2020


## నేను వస్తున్న



**రాజకీయాల్లో ఎప్పుడూ కనిపించని ఫేస్. పేరు కూడా ఎప్పుడూ వినలేదు. కానీ ఇప్పుడు ఆమె పేరు, ఫేస్ బిహార్ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అక్కడి ఎన్నికల నేపథ్యంలో మొన్న మహిళా దినోత్సవం రోజు దినపత్రికల్లో వచ్చిన ఒకేఒక్క ఫుల్ పేజ్ యాడ్ అందరినీ ఆశ్చర్యపరిచింది. 'నేను బిహార్ సీఎం అభ్యర్థిని' అంటూ పుష్పం ప్రియా చౌదరి అనే యువతి ఇచ్చిన యాడ్ అది.**

'బిహార్‌లో మార్పు అవసరం. చెత్త రాజకీయాలను తిరస్కరించండి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపుతా' అంటూ ఆ యాడ్ స్పష్టం చేసింది. పుష్పం ప్రియా చౌదరి జనతా దళ్ యునైటెడ్ మాజీ ఎమ్మెల్సీ వినోద్ చౌదరి కుమార్తె. ఆమె సీఎంగా పోటీ చేయనున్నట్టు వినోద్ చౌదరి తమ రాష్ట్రంలోని హిందీ, ఇంగ్లిష్ పత్రికల్లో యాడ్ ద్వారా ప్రకటించాడు. ప్రియా చౌదరి దర్భంగా ప్రాంతానికి చెందిన యువతి. ప్రస్తుతం లండన్‌లో ఉంటున్నారు. సుస్సెక్స్ యూనివర్సిటీలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ లో ఎంఏ చేశారు. కాగా రానున్న ఎన్నికల్లో బీహార్ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు ఆమె కూడా ట్విట్టర్ ద్వారా ప్రకటించింది. మహిళా దినోత్సవం రోజే యాడ్స్‌లో కనిపించడం, ట్విట్టర్‌లో తన రాజకీయ అరంగేట్రం స్పష్టం చేయడంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది పుష్పం ప్రియ చౌదరి.

## గిరిజ క్షమించగలదా?



**అమృత.. ప్రణయ్‌ని ప్రేమించింది. మారుతీరావ్ అమృతను ప్రేమగా చూసుకున్నాడు. ఇద్దరిదీ ప్రేమే. మధ్యలో పగ ఎంటరైంది. అమృతను ప్రేమించిన ప్రణయ్ లేడు. అమృతను ప్రేమగా పెంచిన మారుతీరావూ లేడు. ఉన్నది ఇద్దరే. అమృత.. గిరిజ. ఇద్దరూ ఆడవాళ్లే. వీరిలో ఒంటరైంది..**

### గిరిజా? లేక అమృతా?

కూతురు ప్రేమ పెండ్లి.. భర్త పగ ఏర్పరచుకోవడం.. ప్రణయ్ హత్య.. మారుతీరావ్ ఆత్మహత్య.. వీటిలో ఎక్కడా గిరిజ ప్రమేయం గానీ.. ప్రభావంగానీ లేవు. కానీ ఇప్పుడు అందరికంటే ఎక్కువ కష్టం వచ్చింది ఆమెకే. ఒక తల్లి కోణంలో.. మహిళా కోణంలో చూస్తే ఆమెది ఒంటరి జీవితం. ప్రేమ ఆడిన నాటకంలో ఒంటరైన జీవితం. ఇలా అవుతుందని ఆమెకు తెలియదు. కానీ మారుతీరావ్‌కు తెలుసు.

అందుకే సూసైడ్ నోట్‌లో 'గిరిజా క్షమించూ' అని రాశాడు. మారుతీరావ్ ఇంకో మాట కూడా రాశాడు. 'అమృతా అమ్మదగ్గరకు రా' అని. కానీ ప్రయోజనం ఏంటి? ఒక్కగానొక్క కూతురు. ప్రేమగా చూసుకున్నాడు కానీ ఆ ప్రేమను ఎల్లకాలం పంచాలి అనుకోలేదు. బెదిరిస్తే ఉండిపోద్దిలే అనుకున్నాడు. కోటి రూపాయల సుపారీ ఇచ్చి అల్లుడిని చంపించేంత డబ్బున్న మారుతీరావ్.. కూతురు మనసును మాత్రం అర్థం చేసుకోలేకపోయాడు.

ఏమైంది ఇప్పుడు? బిడ్డపై అంతగా చూపించిన ఆ ప్రేమ దేనికి ఉపయోగపడింది? తన పగ దేనికి పనికొచ్చింది? లాయర్ వెంకట సుబ్బారెడ్డి కూడా మారుతీరావు గురించి ఓ మాటన్నాడు. మారుతీరావ్ చచ్చిపోయేంత పిరికివాడు కాదు. కానీ కూతురు విషయంలో తప్పుచేశానని నాతో అనేవాడు' అని చెప్పాడు లాయర్. లాయర్ చెప్పిన విషయాన్ని బట్టి చూస్తే మారుతీరావ్‌కు కూతురిపై ప్రేమ ఇంకా ఉంది. తను లేకుంటేనైనా ఆమె తల్లికి దగ్గరవుతుందేమో అనుకొనీ ఉండొచ్చు. అలా అనుకోవడంలో తప్పులేదు. కానీ..


అమృత అమ్మదగ్గరికి వస్తుందా? 'ప్రణయ్ కుటుంబాన్ని వదిలేసి నేను అమ్మ దగ్గరికి వెళ్లలేను. నేను ఆమె దగ్గరకు వెళ్లను కానీ ఆమె నా దగ్గరికి రావచ్చు' అమృత మీడియా సాక్షిగా చెప్పింది. అంటే.. ప్రణయ్‌ని చంపి తండ్రి చేసిన మనసు గాయం ఇంకా మానలేదనే కదా అర్థం.

తప్పు తెలుసుకున్నాక కూడా మారుతీరావ్ మళ్లీ తప్పే చేశాడు. ప్రణయ్‌ని చంపి అమృతను తీసుకెళ్దామనుకున్నా.. ఫలితం వేరేలా వచ్చింది కదా? మరి ఇప్పుడు తానూ చనిపోయి అమృతను తల్లిదగ్గరికి చేర్చాలి అని ఎలా అనుకుంటాడు?

అమృత ఏమంటుంది? వెళ్లే ప్రసక్తే లేదు అంటుంది. ఆమె నిర్ణయంలో తప్పు లేదు. తనకొక కొడుకు ఉన్నాడు. అ పిల్లాడిలో తన ప్రణయ్‌ని చూసుకుంటూ బతికే ధైర్యం ఆమెకుంది. పైగా బాగా చూసుకునే అత్తామామ ఉన్నారు. ఇన్నిరోజులు తనకు అండగా నిలిచిన వారికి.. తన కోసం ప్రాణాలు వదిలిన ప్రణయ్ త్యాగానికి.. తమ ప్రేమకు సాక్ష్యంగా ఉన్న బిడ్డకు ఎలా అన్యాయం చేయగలుగుతుంది?

నిజమే.. అమృతను చూసుకోవడానికి ఇప్పుడు అత్తామామలున్నారు. భవిష్యత్‌లో వాళ్లను చూసుకోవడానికీ అమృత ఉంది. కానీ.. గిరిజకు ఎవరున్నారు?

ఆమె చూసుకోవడానికి ఎవరున్నారు? ఆమెను చూసుకోవడానికి ఎవరున్నారు? దురదృష్టవంతురాలు అంటే గిరిజనే.



**తొందరపడి.. పగతో రగిలి బిడ్డను దూరం చేసుకున్న.. మనఃశ్శాంతి లేకుండా పోయింది అనే పశ్చాత్తాపమే. కనీసం పశ్చాత్తాపమైనా కూతురికి మనఃశ్శాంతి చేకూరుస్తుందని మాత్రం మారుతీరావ్ ఆలోచించి ఉంటాడు. అందుకే అమ్మదగ్గరకు రా అని చివరి కోరిక కోరాడు.**

**కూతురు ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన ప్రణయ్ లేకపాయె. కూతురిని ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన తనూ లేకపాయె.**

నిమిత్తమాత్రంగా ఉన్నందుకు జీవితం అధ్వాన్నంలో పొద్దుమూకినట్లయింది. కూతురు ఇష్టపడి పెండ్లి చేసుకున్న ప్రణయ్ హత్యకు గురైనప్పుడూ తన బిడ్డ పరిస్థితి ఇలా అయ్యిందని అవే కన్నీటి బొట్లు రాల్చింది. ఇప్పుడు భర్త ఆత్మహత్య చేసుకున్నప్పుడూ అవే కన్నీటి బొట్లు రాలాయి. బహుశా ఆ కన్నీళ్లు జీవితాంతం రాలుతూ ఉంటాయి కావచ్చు. భర్త శవంపై పడి ఎంత డబ్బుంటే ఏం లాభం మారుతీరావ్? నీ భార్యను ఒంటరిని చేశావు. నీ కూతురికి భర్తను లేకుండా చేశావు. అన్నీ ఉండి.. అన్నీ తెలిసి చేజేతులా రెండు కుటుంబాలకు క్షోభ మిగిల్చావు. నువ్వు లేకుండా.. నీ కూతురు దగ్గరికి రాకుండా.. ఆ డబ్బుతో గిరిజ హ్యాపీగా ఉండగలుగుతుందా? ఒంటరైపోయిన ఆమె క్షమించగలదా?

... దాయి శ్రీశైలం





**నీరు లేకుండా మనం బతకగలమా?**
**కానీ ప్రతీ నీటి చుక్కనూ కాపాడుకోవాలని ఎంతమంది ఆలోచిస్తున్నారు.**
**కల్పనా రమేష్ ఆలోచించింది.. పదిమంది ఆ పని చేయాలని పరితపించింది..**
**ఆ తపనే ప్రధాని నరేంద్రమోదీ గుర్తించేలా చేసింది.**
**అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున..**
**తన సామాజిక మాధ్యమాలను మహిళలకు అప్పగిస్తానన్నారు ప్రధాని..**
**అన్నట్టుగానే ఈ మార్చి 8న ఆ పని చేశారు.**
**అనుక్షణం నీటి కోసం తపించే ఈ మహిళా సాధకురాలికి ఓ పని అప్పగించారు..**
**ఈమె మార్గంలో నడువమని.. మరెందరికో స్ఫూర్తి అవ్వమన్నారు..**
**కాబట్టి.. ఆమె ఆలోచనలు.. ఆమె ప్రస్థానం గురించే ఈ కథనం..**

# సుజల సహిత గుర్తింపు

1970లో హైదరాబాద్ జనాభా 17లక్షలు.. అప్పుడు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గండిపేట చెరువు నుంచి మంచి నీరు సరఫరా అయ్యేది. 1990లో హైదరాబాద్ జనాభా 42 లక్షలు.. అప్పుడు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంజీరా నుంచి తాగునీరు తెప్పించుకునేవాళ్లం. 2018లో హైదరాబాద్ జనాభా 98 లక్షలు.. 150 కిలోమీటర్లకుపైగా దూరంలో ఉన్న కృష్ణా జలాలు తెప్పించుకునే పరిస్థితి వచ్చేసింది. ఇవికాకుండా ట్యాంకర్‌లతో తెచ్చుకునే నీళ్ల సంగతేంటి? గతేడాది కేవలం వాటర్ ట్యాంకుల కోసం హైదరాబాద్‌లో 200 కోట్ల రూపాయలను ఖర్చు చేశామంటే పరిస్థితి ఎక్కడికి వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. దీనికి కారణం భూగర్భ జలాలు లేకపోవడమే. దీనికి పరిష్కారం ఇంకుడు గుంతలు! ఈ పరిష్కారమార్గాన్ని నినాదంగా చేసుకొని ఉద్యమిస్తున్నారు కల్పనా రమేష్.

**ఎనిమిది ఏండ్లుగా నీటి యుద్ధం**

### నీటి శుద్ధే ధ్యేయంగా..

నీటి కరవుకు కారణాలు అనేకం. పరిష్కారమార్గం మాత్రం ఒక్కటే.. అదే ఆదా! వర్షపు నీటిని ఒడిసి పట్టి ఇంట్లో మొక్కలను పెంచుతున్నారు కల్పన. కల్పన ఆర్కిటెక్చర్ కావడంతో ఇంటి నిర్మాణం సమయంలో పక్కా ప్లాన్‌తో మూడు వేల లీటర్లు నిల్వ చేసే సామర్థ్యం ఉన్న ట్యాంక్‌ను కట్టించారు. ఇంటిపై పడ్డ వర్షం నీళ్లు పైప్ ద్వారా ఈ ట్యాంక్‌కు చేరుతాయి. పైపుకు ఫిల్టర్ పెట్టడం వల్ల చెత్త రాకుండా ఉంటుంది. ట్యాంకులో ఉన్న బొగ్గు, ఇసుక లేయర్లు నీళ్లలోని బ్యాక్టీరియా, క్రిములను, చెత్తను పీల్చుకుని నీటిని శుద్ధి చేస్తాయి. ఈ నీళ్లు మొక్కలకే కాకుండా ఇంటిల్లిపాది ఉపయోగాలకూ వాడుకోవచ్చు. సంవత్సరం మొత్తం ఈ ట్యాంకు ఎప్పటికీ ఎండిపోదు. అందుకోసం కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఇంట్లో గిన్నెలు తోమిన, బట్టలు ఉతికిన నీళ్లు స్టోర్ అవడానికి ఇంకో చిన్న సింటెక్స్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. వృథా నీళ్లన్నీ అందులో స్టోర్ అవుతాయి. అక్కడి నుంచి ఫిల్టర్‌లో శుద్ధి అయ్యాక చెట్లకు వాడుతారు. ఇంటి వెనుక భాగంలో అరటి, పసుపు, చెరకు వంటి మొక్కలకు డ్రిప్ ద్వారా ఆ నీటిని అందిస్తున్నారు. ఇంటిపైన పూలు, కూరగాయల మొక్కలను పండిస్తున్నారు. ఇంటి చుట్టూ కొన్ని వందల మొక్కలు నాటారు. ఇంటి ముందు ఓపెన్ ట్యాంక్ కట్టి వర్షపు నీళ్లను అందులో నిల్వ చేస్తున్నారు. అందులో కొన్ని చేపలను వేశారు. ఆ చేపల వల్ల నీళ్లు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంటాయి.

### పర్యావరణ రక్షణగా..

ఇంట్లో వాడే చెత్తను తడి, పొడిగా వేర్వేరు డబ్బాల్లో సేకరిస్తున్నారు కల్పన. పొడి చెత్తతో ఎరువు తయారు చేసి చెట్లకు వేస్తున్నారు. బయటికి నుంచి చెట్లకు ఎరువులు కొనుక్కురాకుండా ఇంట్లో తయారు చేసిన ఎరువులు వాడి అటు డబ్బునూ ఆదా చేస్తున్నారు. ఇటు పర్యావరణాన్నీ సంరక్షిస్తున్నారు. భవిష్యత్తు తరాలకు మనమేం సంపద ఇవ్వకున్నా పర్వాలేదు, ప్రకృతిని నాశనం చేయకుంటే చాలంటారు కల్పనా రమేష్.

గచ్చిబౌలిలోని కుడికుంట చెరువు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. మురుగుతో కంపు కొడుతుండేది. అయినా చుట్టుపక్కల వాళ్లు పట్టించుకోలేదు. చెరువును బాగు చేయాలన్న ఆలోచన ఎవరికీ రాలేదు. ఆ ప్రాంతంలోనే ఉండే కల్పనా రమేష్ ధైర్యం చేసి ముందడుగు వేశారు. కార్పొరేట్ సంస్థల వారికి సమస్యను వివరించారు. ఎవరూ ముందుకు రాలేదు. చివరగా ఓ సంస్థ కొంత మొత్తాన్ని ఇవ్వడానికి ముందుకొచ్చింది. చెరువు ప్రక్షాళన పని ప్రారంభం అయింది. ఎనిమిది ట్రక్కుల నిండా ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి చెరువును కబ్జాల బారి నుంచి కాపాడారు. చెరువులో సోలార్ ప్లేట్స్‌తో పాటు నడువడానికి వంతెన వేసి అందంగా ముస్తాబు చేశారు. ఇప్పుడా చెరువు పర్యాటక ప్రాంతంలా కనిపిస్తున్నది. సోలార్ ప్యానెళ్లతో కొంతమేరకు పవర్ కూడా ఉత్పత్తి అవుతున్నది. ఆ పవర్‌తో చెరువులో క్లీనింగ్ మోటార్లను నడిపిస్తున్నారు. చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మీద టెడెక్స్ హైదరాబాద్ కార్యక్రమంలో వక్తగా పాల్గొన్నారు. వాళ్లుండే కాలనీలో ఓ సంవత్సర కాలంలో నలభై ఇంకుడు గుంతలు తీయించారు.



ప్రధానమంత్రి నన్ను గుర్తించినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఒక మామూలు మనిషి ఏది చేసినా గుర్తించేవాళ్లున్నారని దీంతో రుజువైంది. ఏ పని చేసినా దాంట్లో వంద శాతం న్యాయం చేయాలి. షీ ఇన్స్‌పైర్ క్యాంపెయిన్ వాళ్లు మిమ్మల్ని గుర్తించారని నాకు ఫోన్ వచ్చింది. నామినేషన్‌లో నేను ఉన్నానంటేనే నేను సక్సెస్ సాధించాననే అనుకున్నా. ఇప్పటివరకు వదలకుండా పనిచేస్తున్నా. ఫాలోవర్లు పెరిగారు. నేను ఏది చేసినా ఇంకా జాగ్రత్తగా ఉండాలనే స్పృహ మొదలైంది. ఎనిమిది సంవత్సరాలుగా ఈ నీటి యుద్ధం చేస్తున్నా. మున్సిపల్ నీళ్లను చాలామంది వృథా చేస్తున్నారు. వాటిని కాపాడుకుందాం. అందరూ ప్రభుత్వాన్ని తిడుతుంటారు. కానీ మనం ఏం చేస్తున్నామని ఎప్పుడైనా ఆలోచించారా? వర్షపు నీరు రోడ్ల మీద పారుతుంటే ట్రాఫిక్ జామ్ అయి కష్టాలు పడుతుంటామే తప్ప ఆ నీటిని ఎలా వాడుకోవచ్చో ఆలోచిస్తామా? చివరకి ఆ నీరు మ్యాన్‌హోల్స్ ద్వారా మురికి నీటిలో కలిసిపోతాయి. వాళ్లు, వీళ్లు చేస్తారని కాకుండా మనం చేయాలి. హైదరాబాద్ సిటీని 98 బేసిన్స్‌గా డివైడ్ చేసుకున్నా. అందులో ఒక్కో బేసిన్‌ని డెవలప్ చేసే ఆలోచనలో ఉన్నా. ఆ బేసిన్‌లో ఒక మోడల్ హౌజ్ కూడా అంటే రెయిన్ సెంటర్ చేయాలి. కట్టిస్తే.. దాన్ని బట్టి మిగతా వాళ్లు స్ఫూర్తి పొందుతారు.

### స్వచ్ఛందంగా..

కల్పనా రమేష్ ఇంటీరియర్ ఆర్కిటెక్చర్. బెంగళూరులో పుట్టి పెరిగారు. పెండ్లవ్వగానే అమెరికాకు మకాం మార్చారు. తొమ్మిదేండ్లు అక్కడే ఉన్నారు. తర్వాత సింగపూర్‌కు షిఫ్ట్ అయ్యారు. అనుకోని కారణాల వల్ల అక్కడా రెండేండ్లు ఉన్నారు. తర్వాత హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డారు. ఇక్కడా కొన్నేండ్లే ఉండాల్సి వస్తుందేమోనని ముందు సందేహపడ్డారు. వాతావరణ పరిస్థితులకు అలవాటు పడి ఇక్కడే ఉండిపోయారు. చదువుకున్న విద్యకు న్యాయం చేయాలని ఆర్కిటెక్చర్‌గా డిజైన్స్ చేయడం ప్రారంభించారు కల్పన. కానీ తన పని తాను చేసుకుపోవడంలో సంతృప్తి దొరకలేదు. ఈ సమాజం కోసం ఏదైనా చెయ్యాలనుకున్నారు. అందుకే 'సహి' పేరుతో స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. ఎండిపోయిన పదివేల బోర్లకు తిరిగి జీవం పోయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నీటి సంరక్షణ పాఠాలు చెప్పడమే కాదు.. చేసి చూపిస్తున్నారు.

... సౌమ్య నాగపురి

## క్యాప్సికమ్ లాభాలు అనేకం



- తరచూ క్యాప్సికమ్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరగకుండా చేస్తుంది.
- క్యాప్సికంలోని యాంటీ ఆక్సిడెంట్లు ఒత్తిని తగ్గిస్తాయి. మానసిక ప్రశాంతతను అందిస్తాయి.
- క్యాప్సికమ్‌లో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలున్నాయి. ఇవి ఫంగల్ ఇన్‌ఫెక్షన్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్స్‌ను నివారించడంలో సహాయపడుతాయి.
- క్యాప్సికమ్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే ముక్కు నుంచి రక్తం కారకుండా ఉంటుంది.
- ఇందులో యాంటీ యాక్సిడెంట్లు పుష్కలం. ఇవి చర్మాన్ని తాజాగా ఉంచుతాయి.
- అస్తమా, శ్వాస సంబంధిత సమస్యలున్నవారు క్యాప్సికమ్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే మంచిది.

## 'అచ్చు' బొమ్మలు

మంచు విష్ణు, విరానికల మొదటి కుమార్తె వివియాన ఇటీవల ఓ పెండ్లి వేడుకలో బంగారు ముద్దుగుమ్మలా మెరిసింది. కూతురి కోసం శంతను, నిఖిల్ డిజైనర్లతో ప్రత్యేకంగా గౌన్ తయారు చేపిచ్చింది. బంగారు పోగులతో ఉన్న లాంగ్ గౌనుకి సరిపోయేలా మెడలో వైట్ స్టోన్స్‌తో కూడిన హారం ధరించింది వివియాన. ఈ రెండింటి కలయికతో అమ్మాయికే అందం వచ్చింది. ఈ లుక్‌లో ఇదివరకే 'బ్రైడ్స్ టుడే' మ్యాగజైన్ కోసం ఫొటోషూట్ జరిగింది. అందులో కియారా అద్వాని మెరిసింది. గోల్డ్ మెటాలిక్ గౌన్, పోల్కీ డైమండ్ ఆభరణాలతో కియారా కనువిందు చేసింది. షిమ్మరీ ఐ మేకప్‌తో సెంటర్ అట్రాక్షన్‌గా మారింది. ఒకే డ్రెస్‌లో వీరిద్దరినీ చూసేందుకు రెండు కళ్లూ చాలవేమో అన్నట్లుంది.





## రంగులు పోవాలంటే..




**సోమవారం సాయంత్రం హోలీ మొదలై మంగళవారం సాయంత్రానికి ముగుస్తుంది హోలీ. ఎంతో సంతోషంగా జరుపుకునే ఈ వేడుకలో రంగులే ప్రథమం. హోలీ తర్వాత ఆ రంగులను తరిమికొట్టేందుకు విశ్వప్రయత్నాలు చేయకుండా కొన్ని చిట్కాలు పాటిస్తే చాలు.**

- ఒక్కోసారి శరీరానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా హోలీలో పాల్గొంటాం. దాంతో రంగులు శరీరానికి అంటుకొని పేరుకుపోతాయి. వాటిని తొలిగించేందుకు రంగులు అంటుకోగానే నీటితో కడిగేయాలి.
- కలర్స్ చర్మంపై ఎక్కువ సమయం ఉన్నప్పుడు శరీరంలోని చెమట బయటకు వస్తుంది. ఆ తేమ రంగును పీల్చుకుంటుంది. ఆ తర్వాత ఎంత రుద్దినా రంగును వదిలించుకోలేము.
- అయితే చల్లని నీరుకంటే, గోరువెచ్చని నీటితో కడుగడం వల్ల తొందరగా రంగు పోతుంది.
- గ్లిజరిన్, ఉప్పు, అరోమా ఆయిల్ వేసి బాగా కలుపాలి. దీనిని స్క్రబ్‌లా చేసి రాస్తే మంచిది.
- నీటితో శుభ్రపరుచుకున్న వెంటనే మాయిశ్చరైజర్ రాయాలి.
- జుట్టుని మైల్డ్ షాంపూతో క్లీన్ చేసుకోవాలి. ఈ తర్వాత ఆలీవ్ ఆయిల్, తేనె, నిమ్మరసం కలిపి ప్యాక్‌లా వేసుకోవాలి. ఇది జుట్టుకి మంచిది.
- సన్‌గ్లాసెస్ వాడడం వల్ల కండ్లకు ఎలాంటి ప్రభావం పడదు.
- స్కాల్ప్ మరీ సెన్సిటివ్‌గా ఉంటే మాడుకు నిమ్మరసాన్ని అప్లై చేయడం మంచిది. ఇది రంగులోని కెమికల్స్ నుంచి కాపాడుతుంది.
- సహజసిద్ధమైన రంగులు వాడటం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఎప్పుడైతే కెమికల్స్‌తో కూడిన రంగులు వాడతామో అప్పుడే ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.


లావణ్యత్రిపాఠి

# బాలీవుడ్ ఆఫర్ వదులుకుంది!

అసంబద్ధమైన, ప్రాధాన్యతలేని పాత్రల్లో నటించడం కంటే ఖాళీగా ఉండటమే మంచిదనే సిద్ధాంతాన్ని ఫాలో అవుతోంది కథానాయిక లావణ్యత్రిపాఠి. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో వైవిధ్యమైన సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నది ఈ డెహ్రాడూన్ సొగసరి. దక్షిణాది సినిమాల కారణంగా డేట్స్ సర్దుబాటు చేయలేక బాలీవుడ్‌లో నటించే అవకాశాన్ని వదులుకుంది లావణ్య త్రిపాఠి. ప్రస్తుతం తెలుగులో 'ఏ1ఎక్స్‌ప్రెస్' సినిమాలో కథానాయికగా నటిస్తున్నది లావణ్యత్రిపాఠి. క్రీడా నేపథ్య కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తాను హాకీ ప్లేయర్‌గా కనిపించబోతున్నట్లు చెప్పింది. పాత్రలో పరిపూర్ణత కోసం హాకీలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నట్లు తెలిపింది. అలాగే గీతా ఆర్ట్స్ సంస్థలో 'చావు కబురు చల్లగా'లో నటిస్తున్నట్లు పేర్కొంది. తమిళంలో అధర్వ మురళి హీరోగా కొరటాల శివ శిష్యుడు రవీంద్రమాధవ రూపొందిస్తున్న సినిమాలో గ్లామర్‌తో పాటు అభినయానికి ఆస్కారమున్న పాత్రలో కనిపించబోతున్నానని లావణ్య త్రిపాఠి తెలిపింది. మంచి కథల్లో భాగమవ్వడానికే తొలి ప్రాధాన్యతనిస్తానని, మనసుకు నచ్చిన పాత్రలకు న్యాయం చేయడానికి ఎలాంటి సవాళ్లకైనా సిద్ధమేనని ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేసింది.


రామ్‌చరణ్

# కొత్త దర్శకుడితో...

ప్రస్తుతం 'ఆర్ఆర్ఆర్' చిత్రీకరణలో బిజీగా ఉన్నారు అగ్రహీరో రామ్‌చరణ్. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. ఇదిలా వుండగా ఈ సినిమా అనంతరం రామ్‌చరణ్ నటించబోయే సినిమా ఏమిటన్నది అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సుకుమార్ లేదా విక్రమ్ కె కుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ ఓ సినిమా చేస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈసారి రామ్‌చరణ్ ప్రదీప్ అనే కొత్త దర్శకుడితో కలిసి పనిచేయబోతున్నట్లు తెలిసింది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ తెరకెక్కించబోతున్నదని సమాచారం. విశేషమేమిటంటే...రామ్‌చరణ్ తన కెరీర్‌లో ఇప్పటివరకు కొత్త దర్శకుడితో పనిచేయలేదు. ఆరంభం నుంచి అనుభవజ్ఞులైన డైరెక్టర్లను ఎంపిక చేసుకొని సినిమాలు చేస్తూ వచ్చారు. తాజాగా ఆ సంప్రదాయాన్ని బ్రేక్ చేస్తూ నూతన దర్శకుడికి రామ్‌చరణ్ అవకాశం ఇవ్వబోతుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సిని మా విషయంలో నిజానిజాలేమిటో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందేనంటున్నారు. మరోవైపు ఎన్టీఆర్, రామ్‌చరణ్ కలిసి నటిస్తున్న భారీ మల్టీస్టారర్ 'ఆర్ఆర్ఆర్' వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరిలో ప్రేక్షకుల ముందుకురానుంది. చారిత్రక ఇతివృత్తానికి కాల్పనిక అంశాల్ని జోడించి రూపొందిస్తున్నారు.

# ఐటెమ్ కాదు.. సెలబ్రేషన్ సాంగ్!

అగ్ర కథానాయికలు ప్రత్యేకగీతాల్లో నర్తించడం సాధారణ విషయమే. ఈ ట్రెండ్ గత కొన్నేళ్లుగా ఊపందుకుంది. ఈ ఒరవడిలోనే చెన్నై సోయగం రెజీనా తొలిసారి ఓ స్పెషల్‌సాంగ్‌లో నటించింది. అదీ మెగాస్టార్ చిరంజీవి సరసన కావడం విశేషం. చిరంజీవి కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో 'ఆచార్య' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇందులో రెజీనా ప్రత్యేకగీతాన్ని చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'నాకిది తొలిప్రత్యేకగీతం. బహుశా ఇదే చివరిది కావొచ్చేమో. మెగాస్టార్‌తో కలిసి డ్యాన్స్ అనగానే మరోమాట లేకుండా ఒప్పుకున్నా. అయితే ఈ పాటను ఐటెమ్‌సాంగ్ అనడం కంటే సెలబ్రేషన్ సాంగ్ అనడం బాగుంటుంది. చిరంజీవి నృత్యాల్లోని స్టైల్, పరిపూర్ణత చూసి ముచ్చటేసింది. నేను చేసిన డ్యాన్స్‌తో పాటు కళ్లతో పలికించిన హావభావాలు చాలా బాగున్నాయని చిరంజీవి మెచ్చుకున్నారు. నా జీవితం లో అత్యుత్తమ ప్రశంస అదే అనుకుంటున్నా' అని సంబరపడిపోతోంది రెజీనా. ప్రస్తుతం ఆమె 'నేనే నా' అనే సినిమాలో నటిస్తోంది.


రెజీనా

# చిత్తూరు పల్లె పడచుగా..

రష్మిక అంటే వెలుగు రేఖ అని అర్థం. ఇప్పుడీ కూర్గ్ సోయగం తెలుగుచిత్రసీమలో నూత్నకాంతుల్ని వర్షిస్తోంది. దర్శకనిర్మాతలు ఈ సుందరినే తమ సినిమాల్లో కోరుకుంటున్నారు. యువతలో కూడా తిరుగులేని ఫాలోయింగ్‌తో దూసుకుపోవడంతో అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకు తన అందచందాలతో, చక్కటి అభినయంతో మెప్పిస్తోన్న ఈ అమ్మడు సుకుమార్-అల్లు అర్జున్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా సినిమా కోసం డీగ్లామర్ అవతారంలో కనిపించనుంది. ఎర్రచందనం స్మగ్లింగ్ ప్రధాన ఇతివృత్తంగా చిత్తూరు నేపథ్యంలో నడిచే ఈ సినిమాలో రష్మిక మందన్న మారుమూల పల్లెటూరిలో నివసించే అమ్మాయి పాత్రలో కనిపించనుంది. ఇందుకోసం ఈ మధ్యే రష్మిక మీద ఓ టెస్ట్ షూట్ నిర్వహించారట దర్శకుడు సుకుమార్. పక్కా గ్రామీణ యువతి లుక్‌లో ఆమె ఒదిగిపోయిన తీరుతో సుకుమార్ సంతృప్తిచెందాడట. గతంలో 'రంగస్థలం' సినిమా కోసం సమంత మీద కూడా ఇదే తరహాలో టెస్ట్‌షూట్ నిర్వహించారు సుకుమార్. ఆ సినిమాలో రామలక్ష్మి పాత్రలో సమంత కనబరచిన అభినయం ప్రతి ఒక్కరిని మెప్పించింది. ఇప్పుడే అదే స్థాయిలో రష్మిక పాత్రను తీర్చిదిద్దే పనిలో ఉన్నారట సుకుమార్. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైన విషయం తెలిసిందే. అయితే ప్రధాన తారాగణంపై కీలక షెడ్యూల్‌ను ఈ నెలాఖరులో మొదలుపెట్టబోతున్నారు. ఇదిలావుండగా రష్మిక మందన్న ట్విట్టర్ ఖాతా మిలియన్ ఫాలోవర్స్‌ను చేరుకుంది. ఈ సందర్భంగా ఈ సొగసరి తన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపింది. 'ఒక మిలియన్ కుటుంబానికి చేరుకోవడం ఆనందంగా ఉంది. మీ అందరి దీవెనలు కావాలి' అంటూ తన ఆనందం వ్యక్తం చేసింది.


రష్మిక

# ముప్పై రోజుల ప్రేమకథ


ప్రదీప్, అమృత అయ్యర్

ప్రదీప్ మాచిరాజు కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం '30 రోజుల్లో ప్రేమించడం ఎలా'. మున్నా దర్శకుడు. అమృత అయ్యర్ కథానాయిక. ఎస్వీ ప్రొడక్షన్స్ పతాకంపై ఎస్వీబాబు నిర్మిస్తున్నారు. ఉగాది సందర్భంగా మార్చి 25న ఈ చిత్రం విడుదలకానుంది. నిర్మాత మాట్లాడుతూ 'రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. ముప్పై రోజుల్లో ఓ యువకుడి ప్రేమప్రయాణంలో ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయన్నది ఆసక్తిని పంచుతుంది. ప్రదీప్ పాత్ర భిన్న పార్శ్వాలతో సాగుతుంది. సుకుమార్ వద్ద 'ఆర్య-2', 'నేనొక్కడినే' చిత్రాలకు దర్శకత్వ శాఖలో పనిచేసిన మున్నా వినూత్నమైన పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. కథలోని నవ్యత నచ్చి జీఏ2, యూవీ క్రియేషన్స్ సంస్థలు ఈ చిత్రాన్ని విడుదలచేస్తున్నాయి. విభిన్నమైన ప్రేమకథగా తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచే చిత్రమిది' అన్నారు. శివన్నారాయణ, హేమ, పోసాని కృష్ణమురళి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: దాశరథి శివేంద్ర, సంగీతం: అనూప్ రూబెన్స్.

# దర్శకురాలిగా కల్యాణి


కల్యాణి

'ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు', 'పెదబాబు'తో పాటు తెలుగులో పలు విజయవంతమైన చిత్రాల్లో కథానాయికగా నటించింది కల్యాణి. విభిన్నమైన పాత్రలతో ఆకట్టుకున్న ఆమె తాజాగా మెగాఫోన్ పట్టబోతున్నారు. కే2కే ప్రొడక్షన్స్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఈ సినిమాలో చేతన్‌శీను, సిద్ధి, సుహాసిని మణిరత్నం కీలక పాత్రల్ని పోషించనున్నారు. హోలీ సందర్భంగా సోమవారం ఈ చిత్ర ప్రీలుక్‌ను దర్శకుడు పూరిజగన్నాథ్ విడుదలచేశారు. 'వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రమిది. విలక్షణ ప్రేమకథగా అలరిస్తుంది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపుదిద్దుకోనున్న ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది' అని చిత్రబృందం తెలిపింది.

# 'హేరామ్' స్ఫూర్తినిచ్చింది!


శైలేష్

'నిజమైన ఘటనల స్ఫూర్తితో రాసుకున్న కథ ఇది. ప్రపంచంలోని ఆసక్తికరమైన నేర వార్తల్ని సేకరించి వాటి ఆధారంగా ఈ స్క్రిప్ట్ తయారుచేసుకున్నా' అన్నారు శైలేష్ కొలను. ఇటీవల ప్రేక్షకులముందుకొచ్చిన 'హిట్' చిత్రం ద్వారా ఆయన దర్శకుడిగా పరిచయమయ్యారు. విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి నాని నిర్మాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా దర్శకుడు శైలేష్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'నేను స్వతహాగా నాని అభిమానిని. ఈ స్క్రిప్ట్‌తో ఆయన్ని కలిశాను. 'ఈ నగరానికి ఏమైంది' సినిమా చూసి విశ్వక్‌సేన్‌తో పనిచేయాలనుకున్నా. 'హిట్' కథ కొంత పూర్తికాగానే అతడైతేనే పక్కాగా సరిపోతాడనిపించింది. సినిమాకు మంచి స్పందన వస్తోంది. విభిన్న ఇతివృత్తంతో నిజాయితీగా ఓ థ్రిల్లర్ తీశాడని అందరూ అభినందిస్తున్నారు. నేను రాసుకున్న స్క్రిప్ట్‌ను యథాతథంగా తెరపై తీసుకొచ్చాననే సంతృప్తి మిగిలింది. కమల్‌హాసన్ నటించిన 'హేరామ్' చిత్ర స్ఫూర్తితో నేను సినీరంగంలోకి వచ్చాను. ఆ సినిమాను యాభైకంటే ఎక్కువసార్లు చూసుంటా. దర్శకుడిగా ఏదో ఒక జోనర్‌కు పరిమితమైపోవడం ఇష్టం లేదు. ప్రస్తుతం నా దగ్గర నాలుగు బౌండెడ్ స్క్రిప్ట్‌లున్నాయి. అందులో ఒకటి మ్యూజికల్ ప్రేమకథ. అందులో 17పాటలుంటాయి. ప్రస్తుతం 'హిట్-2' కోసం ఇదే టీమ్‌తో పనిచేయబోతున్నా. ఈ కథలో మరికొన్ని పాత్రలు ఉంటాయి. మే లేదా జూన్‌లో ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభిస్తాం. 2021లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అన్నారు.

# నా మైండ్ స్లో అయ్యిందా?



జేడీ చక్రవర్తి, రామ్‌గోపాల్ వర్మ

'ట్రైలర్ చూస్తుంటే నా మైండ్ స్లో అయ్యిందా? లేదా సినిమా తీసిన వారి మైండ్ ఫాస్ట్ అయ్యిందా అనిపించింది. అర్థంకానీ ఇలాంటి ట్రైలర్‌ను చూడటం నా జీవితంలో ఇదే మొదటిసారి' అని అన్నారు దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ. జె.డి. చక్రవర్తి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఎం.ఎం.ఓ.ఎఫ్'. రాజశేఖర్, జేడీ ఖాసిం నిర్మాతలు. ఎన్.ఎస్.సి దర్శకుడు. ఈ చిత్ర ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో రామ్‌గోపాల్‌వర్మ విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'సరికొత్త ఆలోచనలతో ప్రయోగాత్మకంగా ఈ సినిమాను తెరకెక్కించినట్లుగా కనిపిస్తున్నది. అర్థం తెలియని టైటిల్స్ ఆసక్తిని పంచుతాయి' అని అన్నారు. 'నేను ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి వర్మ కారణం. 'శివ' సినిమా కోసం ఆయన దగ్గరకు వెళ్లినప్పుడు నేను వర్జిన్‌ను(నవ్వుతూ)'. సినిమాలకు సంబంధించిన ఏబీసీడీలు అన్నీ ఆయన దగ్గరే నేర్చుకున్నా' అని జేడీ చక్రవర్తి తెలిపారు. సినిమాలపరంగా, వ్యక్తిగతంగా వర్మది ప్రత్యేకమైన బాణీ అని, ఆయనలా ఎవరూ బ్రతకలేరని, ట్రైలర్ వినూత్నంగా సాగుతూ సినిమా చూడాలనే ఆసక్తిని రేకెత్తిస్తున్నదని శివనాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌నందం, ఉత్తేజ్, సిరాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# రాజస్థానీ ప్రణయగాథ


దిలీప్, పూనమ్‌శర్మ, వాల్మీకి

దిలీప్ రాథోడ్, పూనమ్‌శర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'ఘాటి'. వాల్మీకి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్, నిర్మాత గురురాజ్ ఆవిష్కరించారు. దర్శకనిర్మాత మాట్లాడుతూ 'రాజస్థాన్‌లోని ఘాటి అనే ప్రాంతంలో జరిగే కథ ఇది. రెండు వర్గాల మధ్య ఏర్పడిన అంతరాల నేపథ్యంలో ప్రేమ, యాక్షన్ భావోద్వేగాలకు ప్రాముఖ్యతనిస్తూ రూపొందించాం. తెలుగు, బంజారా భాషల్లో ఏకకాలంలో రూపొందిస్తున్నాం' అని తెలిపారు. చిత్రీకరణ యాభై శాతం పూర్తయిందని, నటుడిగా తనకు మంచి పేరు తెచ్చిపెడుతుందనే నమ్మకముందని దిలీప్ రాథోడ్ అన్నారు. ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'తెలుగు తెరపై ఇప్పటివరకు రాని సరికొత్త కథాంశంతో సినిమాను తెరకెక్కిస్తున్నారు. ట్రైలర్ దర్శకుడికి ప్రతిభాపాటవాల్ని చాటిచెబుతున్నది' అని పేర్కొన్నారు. బంజార భాషల్లో మరిన్ని మంచి సినిమాలు రావాలని బంజారజాతీయ అధ్యక్షుడు బెల్లయ్యానాయక్ చెప్పారు. ఈ కార్యక్రమంలో అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎముకలు, కీళ్ల సమస్యలు పెద్దవాళ్లలోనే కాదు.. చిన్న వయసులో కూడా కనిపిస్తున్నాయి. క్రీడల్లో ఉన్న చిన్న పిల్లల్లో కూడా ఇటువంటి సమస్యలు సర్వసాధారణం అయిపోయాయి. స్పోర్ట్స్ ఇంజురీస్, ఆర్థరైటిస్ లాంటి సమస్యలకు మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సలే కాకుండా, జాయింట్ పాడైపోకుండా కాపాడే ముందస్తు ప్రిజర్వేషన్ చికిత్సలు కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. పెద్దవాళ్లయితే సర్జరీ ఎలాగూ తప్పదు. కాని పిల్లల శరీరం ఏ ఆటలకు సరిపోతుందో ముందే విశ్లేషించి, ఆ ఆటలో చేర్పిస్తే వాళ్లలో ఎముకలు, కీళ్ల సమస్యలు రాకుండా నివారించొచ్చంటున్నారు నిపుణులు.

# కీళ్లు.. ఎముకలు ఇలా క్షేమం!

## భుజం సమస్యలు

**సాధారణంగా కీళ్ల సమస్యలు వృద్ధాప్యంలోనే వస్తాయనుకుంటాం. కానీ భుజం కీలు, కండరాలు, దాని చుట్టుపక్కల భాగాలకు సంబంధించిన సమస్యలు ఏ వయసువారిలో అయినా రావొచ్చు.**

**యువతలో** అయితే ఆటలాడేటప్పుడు గాయాలవడం, భుజం కీలు జారిపోవడం (డిస్‌లొకేషన్) వల్ల భుజంలో సమస్యలు వస్తాయి. కొందరిలో ఫిట్స్ వల్ల కూడా భుజం కండరానికి సంబంధించిన సమస్యలు వస్తాయి. ఫిట్స్ వల్ల భుజం దగ్గరి కండరం తీవ్రంగా సంకోచించి సమస్య కావొచ్చు. భుజం డిస్‌లొకేట్ కావొచ్చు. ఇక వృద్ధుల్లో డీజనరేటివ్ వ్యాధులే ఎక్కువ. డీజనరేషన్ వల్ల భుజానికి చిన్న దెబ్బ తగిలినా భుజం టేర్ అవుతుంది. రొటేటరీ కఫ్ టేర్‌ను సకాలంలో చికిత్స చేయకపోతే ఆర్థరైటిస్‌కి దారితీస్తుంది.



### లక్షణాలు

- డిస్‌లొకేషన్ వల్ల తీవ్రమైన నొప్పి వస్తుంది.
- భుజాన్ని కదిలించడం కూడా కష్టమవుతుంది.
- రొటేటరీ కఫ్ సమస్య ఉండడం వల్ల చేయి పైకి లేపలేని పరిస్థితి వస్తుంది. చేతులతో ఏ పని చేయకుండా విశ్రాంతిగా ఉంటే నొప్పి ఉండదు.
- భుజాన్ని ఉపయోగించి చేసే పనులేవీ చేయలేని స్థితి వస్తుంది. తల దువ్వుకోవడం, చేత్తో ఆహారం తీసుకోవడం, షర్ట్ బటన్ పెట్టుకోవడం లాంటివి చేయలేరు.
- భుజం ఆర్థరైటిస్ ఉంటే ఏ పని చేయాలన్నా నొప్పి ఉంటుంది. రాత్రి సమయంలో నొప్పి ఎక్కువగా ఉంటుంది.



### భుజం కీలును ఎలా కాపాడుకోవాలి?

రెగ్యులర్‌గా స్ట్రెచింగ్ వ్యాయామాలు, మజిల్ బ్యాలెన్సింగ్ ఎక్సర్‌సైజులు చేయాలి.

వ్యాయామం ఒక్కసారిగా తీవ్రంగా చేయొద్దు. సడెన్‌గా యాక్టివిటీ పెంచడం వల్ల సమస్యే.

వ్యాయామం వల్ల ఏజ్ రిలేటెడ్ ఆర్థరైటిస్‌ని కూడా వాయిదా వేయొచ్చు.

పురుషుల్లో షోల్డర్ డిస్‌లొకేషన్, స్త్రీలలో రొటేటరీ కఫ్ సమస్యలు ఎక్కువ కాబట్టి వాటికి సంబంధించిన వ్యాయామాలు చేయాలి.

### చికిత్స

ఇంతకుముందు వరకు ఓపెన్ సర్జరీ ఉండేది. కాని ఇప్పుడు ఆర్థ్రోస్కోపీతో మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ చేస్తున్నారు. పదేళ్ల క్రితమే ఇది అందుబాటులోకి వచ్చింది. అయిదారేళ్లుగా ప్రాచుర్యం పొందింది. ఆర్థ్రోస్కోపీ కోసం 5 మి.మీ. సైజులో మూడు నాలుగు రంధ్రాలు పెడతారు. వీటి ద్వారా స్కోప్, ఇతర పరికరాలు పంపిస్తారు. వీటి ద్వారా రొటేటరీ కఫ్ అయితే రిపేర్ చేస్తారు. నర్వ్ కంప్రెషన్ ఉంటే దాన్ని రిలీజ్ చేస్తారు. సాధారణంగా ఈ సర్జరీ టేర్స్‌కీ, డిస్‌లొకేషన్‌కీ చేస్తారు. టేర్ అయిన లేబ్రమ్‌ని సరిచేసి అమరుస్తారు. ఇలాంటి సమస్యల్లో ఎముక ఇన్వాల్వ్ అవదు. బోన్ ఆర్థరైటిస్‌కు కూడా ఈ సర్జరీ చేయవచ్చు. నార్మల్ వయసు వల్ల వచ్చే ఆర్థరైటిస్ కాకుండా, రొటేటరీ కఫ్ సమస్యను అశ్రద్ధ చేస్తే కూడా ఆర్థరైటిస్ వస్తుంది. ఈ రకమైన ఆర్థరైటిస్‌ను రొటేటరీ కఫ్ ఆర్థ్రోపతి అంటారు. వయసు వల్ల వచ్చే ప్రైమరీ ఆర్థరైటిస్‌కు టోటల్ షోల్డర్ ఆర్థ్రోప్లాస్టీ (టోటల్ షోల్డర్ రీప్లేస్మెంట్) చేస్తారు. రొటేటరీ కఫ్ ఆర్థ్రోపతికి రివర్స్ షోల్డర్ ఆర్థ్రోప్లాస్టీ (రివర్స్ షోల్డర్ రీప్లేస్మెంట్) చేస్తారు. రొటేటరీ కఫ్ కండరం లేకపోయినా కూడా రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ పనిచేస్తుంది. ఈ రకమైన భుజం కీలు మార్పిడిలో కీలులోని బంతి భాగాన్ని (మెటల్) గిన్నె (కప్) దగ్గర, గిన్నె భాగాన్ని (ప్లాస్టిక్) బంతి దగ్గర మార్చి అమరుస్తారు. కండరాలు బలహీనంగా ఉన్నా, వయసు ఎక్కువగా ఉన్నా ఈ సర్జరీ మంచి ఫలితాలను ఇస్తుంది.

## స్పోర్ట్స్ ఇంజురీలు

**క్రీడలు** అంటే ఒకప్పుడు ప్రొఫెషనల్‌గా ఆడేవాళ్లు మాత్రమే ఎక్కువగా ఉండేవాళ్లు. ఇప్పుడు చిన్నప్పుడే పిల్లల్ని రకరకాల స్పోర్ట్స్‌లో చేరుస్తున్నారు. అందుకే వయసుతో సంబంధం లేకుండా స్పోర్ట్స్ ఇంజురీలు ఎక్కువ అవుతున్నాయి. స్కూల్ చదువుతో పాటు షటిల్, బ్యాడ్మింటన్ వంటివి పిల్లల జీవితంలో భాగమైపోయాయి. పెద్దవాళ్లు కూడా కనీసం వారాంతాల్లో అయినా ఏదో ఒక ఆట ఆడుతున్నారు. అయితే స్పోర్ట్స్ వల్ల కలిగే గాయాలను ఎలా తప్పించుకోవాలో చాలామందికి అవగాహన ఉండడం లేదు. వృత్తిపరంగా క్రీడాకారులు కాకుండా రెగ్యులర్‌గా ఆటలాడేవాళ్లలో ముఖ్యంగా రెగ్యులర్‌గా రన్నింగ్, జాగింగ్ చేసేవాళ్లలో, అప్పుడప్పుడూ జిమ్‌కి వెళ్లడం, వారాంతాల్లో ఆడేవాళ్లలో స్పోర్ట్స్ ఇంజురీస్ కనిపిస్తుంటాయి. వార్మప్ లేకుండా ఆడడం, ఫిట్‌నెస్ లేకపోవడం, ఆడేటప్పుడు వాడే ఎక్విప్‌మెంట్ సరిగ్గా లేకపోవడం, రక్షణ కవచాలు సరిగ్గా లేకపోవడం ఇందుకు కారణమవుతున్నాయి.

### ఇవీ సమస్యలు

- పిల్లల్లో కూడా తొడ ఎముక కండరం బలహీనం కావడం, స్ట్రెస్ ఫ్రాక్చర్లు, భుజం సమస్యలు, లిగమెంట్ ఇంజురీలు, మోకాలి చిప్ప జారిపోవడం లాంటి సమస్యలు కనిపిస్తున్నాయి.
- మజిల్ క్రాంప్స్. షోల్డర్ డిస్‌లొకేషన్, రొటేటరీ కఫ్ మజిల్ టేర్
- మోచేతి సమస్యలు. లిగమెంట్ టేర్ కావొచ్చు.
- తుంటి కీలును బంతి గిన్నె కీలు అంటారు. దీనిలో బంతి భాగం చుట్టూ లేబ్రమ్ అనే ఒక కణజాలం ఉంటుంది. ఇది సాక్ అబ్‌సార్బెంట్‌గా పనిచేస్తుంది. ఈ లేబ్రమ్ టేర్ అయినప్పుడు సమస్య వస్తుంది.
- తుంటి దగ్గరి కండరం టేర్ కావడం. చీలమండల దగ్గర స్ప్రెయిన్ కావడం.
- మోకాలి దగ్గర లిగమెంట్లకు దెబ్బ తగలవచ్చు. కార్టిలేజ్‌కు గాయాలవ్వొచ్చు. కార్టిలేజ్‌కి అయ్యే ఫ్రాక్చర్లను ఆస్టియో కాండ్రల్ ఫ్రాక్చర్లంటారు.
- హెడ్ కంకషన్. అకస్మాత్తుగా బంతి వచ్చి తలకు తగిలినప్పుడు, కింద పడినప్పుడు తలకు గాయమై మెదడు అటూ ఇటూ కదులుతుంది. దీన్ని హెడ్ కంకషన్ అంటారు. దీనివల్ల ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు.



### చికిత్స

తీవ్రమైన గాయాలైతే తప్ప హాస్పిటల్‌లో ఉండాల్సిన అవసరం లేదు. ఫ్రాక్చర్లు, డిస్‌లొకేషన్, కంకషన్ లాంటి సమస్యలకు మాత్రం హాస్పిటల్ అవసరం. అలా కాకుండా చిన్న చిన్న గాయాలైతే విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. ఇలాంటి చిన్న గాయాలకు రైస్ (ఆర్ఐసిఇ) అనే పేరుతో చికిత్స ఉంటుంది.
అంటే, రెస్ట్ – 48 గంటలు విశ్రాంతి తీసుకోవాలి. ఐస్ – 3–4 గంటలకోసారి 10 నిమిషాలు ఐస్‌తో కాపడం పెట్టాలి. కంప్రెస్ – గాయం తగిలిన చోట క్రేప్ లేదా ఎలాస్టిక్ బ్యాండేజ్ వేయాలి. ఎలివేషన్ – దెబ్బ తగిలిన భాగాన్ని ఎత్తులో పెట్టి ఉంచాలి. స్పోర్ట్స్ ఇంజురీస్ స్పెషలిస్టును కలవడం మాత్రం తప్పనిసరి.

### సర్జరీ ఎప్పుడు?

లిగమెంట్ ఇంజురీలు, మజిల్ టేర్, డిస్‌లొకేషన్, ఫ్రాక్చర్లు ఉన్నప్పుడు మాత్రమే సర్జరీ అవసరం అవుతుంది. సర్జరీ అంటే ఇప్పుడు భయపడాల్సిన అవసరం లేదు. కేవలం 0.5 సెంటీమీటర్ కోతతో మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ అందుబాటులో ఉంది. ఆర్థ్రోస్కోపీ, టార్గెటెడ్ ట్రీట్‌మెంట్స్ కూడా మంచి ఫలితాలను ఇస్తున్నాయి.

### కొత్త చికిత్సలు

- ఆర్థ్రోస్కోపీని భుజం సమస్యలకు, తుంటి సమస్యలకు కూడా చేయవచ్చు. షోల్డర్ ఆర్థ్రోస్కోపీ ద్వారా భవిష్యత్తులో షోల్డర్ డిస్‌లొకేషన్‌ని నివారించొచ్చు.
- తుంటి సమస్యలకు హిప్ ఆర్థ్రోస్కోపీని మనదేశంలో చాలా తక్కువమంది చేస్తున్నారు. ఇంతకుముందు కేవలం ఫిజియోథెరపీ మాత్రమే అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఈ సర్జరీ ద్వారా తుంటి కండరాల్లోని టేర్స్‌ని సరిచేయొచ్చు.
- మోకాలి కీలులోని కార్టిలేజ్‌ను రీప్లేస్ చేయడం ఇప్పుడు సాధ్యం అవుతోంది.
- మెనిస్కల్ ట్రాన్స్‌ప్లాంట్ టెక్నిక్ ద్వారా మెనిస్కస్ మార్పిడి చేయొచ్చు.

సర్జరీ అయిపోయిన తరువాత తొందరగా ఎప్పటిలా క్రీడల్లోకి వెళ్లాలంటే ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ అవసరం అవుతుంది. ఒక



ట్రెండు నెలలు ఫిజియోథెరపీ చేయించుకుంటే చాలు. మళ్లీ ఇంజురీ కాకుండా కూడా నివారించొచ్చు. సర్జరీ అయిన రెండోరోజు నుంచి ఆటలు ఆడడం తప్ప మిగతా పనులన్నీ నార్మల్‌గా చేసుకోవచ్చు. సిమెంట్ పట్టీ సమస్య చాలావరకు ఉండదు.

### ఎలా నివారించాలి?

ఎముకలు, కండరాలు బలహీనంగా ఉండి, లిగమెంట్లు వదులుగా ఉండడం లాంటి నిర్మాణాత్మక లోపాలున్నప్పుడు వాటిపై ఒత్తిడి కలిగించే క్రీడలు ఆడితే సమస్య మరింత పెద్దదై గాయాలు, కీళ్ల సమస్యలు వస్తాయి. అందుకే మొదటిసారిగా ఆటలు ఆడాలనుకున్నప్పుడు ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి.
పిల్లల్ని ఏదైనా క్రీడలో చేర్పించాలనుకున్నప్పుడు ముందుగా ఫిజియోథెరపిస్టు లేదా కోచ్‌లు స్క్రీన్ చేయాలి. ఏమైనా తెలియని ఇంజురీస్ ఉన్నాయా అని. కండరాలు బలహీనంగా ఉన్నాయా అని చూడాలి. ఎముక వంకర ఏమైనా ఉందా.. ఏమైనా తేడాలున్నాయా చెక్ చేసుకోవాలి.
ఎముకలు, కీళ్ల నిర్మాణాన్ని, వాటి స్ట్రాంగ్‌నెస్‌ని బట్టి ఎవరు ఏ రకమైన క్రీడలు ఆడడానికి సరిపోతారని అసెస్ చేసిన తర్వాతే ఆయా ఆటలు ఆడాలి. లిగమెంట్లు వదులుగా ఉంటే షటిల్, బ్యాడ్మింటన్ లాంటివి ఆడితే జాయింట్ డిస్‌లొకేట్ అvg
కొన్నిసార్లు ఆడే పవర్ తగ్గొచ్చు. చిన్న చిన్న నొప్పులు ఉండొచ్చు. ఆడి వచ్చిన తరువాత చాలాసేపు నీరసంగా, బలహీనంగా అనిపించవచ్చు. ఇలాంటప్పుడు వెంటనే ఫిజియోథెరపిస్టులను లేదా డాక్టర్‌ని కలవాలి. చిన్న చిన్న గాయాలుగా ఉన్నప్పుడు 90 శాతం కేసుల్లో సర్జరీ అవసరం ఉండదు.

## నీ ప్రిజర్వేషన్ సర్జరీలు

**ఆర్థరైటిస్ వల్ల** మోకాళ్ల నొప్పులకు కీలు మార్పిడి సాధారణం. 55 ఏళ్లు దాటినవాళ్లకు పరవాలేదు గానీ నాలుగు పదుల్లోనే మోకాళ్ల సమస్యలున్నవాళ్లకు కీలుమార్పిడి సరికాదు. ఎందుకంటే కొత్త కీలు 15 ఏళ్లు ఉంటుంది. ఆ తరువాత మరోసారి కీలుమార్పిడి అవసరం అవుతుంది. అందుకే జాయింట్ పాడవడాన్ని ఆపడానికి, డీజనరేషన్ ప్రక్రియను వాయిదా వేయడానికి నీ ప్రిజర్వేషన్ సర్జరీలు ఉపయోగపడుతాయి.
ఏం చేస్తారు?

- **ఇంజెక్షన్లు** – ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా (పిఆర్‌పి), బోన్ మ్యారో (స్టెమ్‌సెల్) ఇంజెక్షన్లు ఇస్తారు. ప్లాస్మాలో ఉండే గ్రోత్ ఫ్యాక్టర్లు హీలింగ్ సామర్థ్యాన్ని పెంచుతాయి.
- **ఆస్టియోటమీస్** – జాయింట్‌కి ఒకవైపు భాగం (మీడియల్) చిన్న వయసు వాళ్లలో అరుగుతుంటుంది. ఇలాంటప్పుడు అరిగిన వైపు రెండు ఎముకల మధ్య ఉండే గ్యాప్ తగ్గుతుంది. అలా కాకుండా రెండువైపుల సమానమైన గ్యాప్ ఉండేట్టుగా అమరుస్తారు. దీనివల్ల కార్టిలేజ్ గాయం తగ్గే అవకాశం ఉంటుంది.
- **కార్టిలేజ్ రీజనరేషన్ సర్జరీ (స్టెమ్‌సెల్ ట్రీట్‌మెంట్)** – దీనిలో ఆటోలోగస్ కాండ్రోసైట్ ఇంప్లాంటేషన్ (ఎసిఐ) లేదా బోన్‌మ్యారో యాస్పిరేట్ కాన్‌సన్‌ట్రేషన్(బిఎంఎసి) అనే రెండు పద్ధతులున్నాయి. సాధారణంగా ఆస్టియోటమీ తరువాత ఇది చేస్తారు. పేషెంటు నుంచే



కొంత కార్టిలేజ్‌ను సేకరించి కల్చర్ చేసి పెంచుతారు. ఈ కార్టిలేజ్ కణజాలాన్ని లోపం ఉన్న చోట అతికిస్తారు. ఇకపోతే బిఎంఎసి ద్వారా 60 మి.లీ బోన్‌మ్యారో సేకరిస్తారు. దాన్ని ప్రాసెస్ చేస్తే 5 మి.లీ. మూల కణాలు వస్తాయి. వీటికి జిగటగా ఉండే ఎంజైమ్‌ను కలుపుతారు. దీన్ని లోపం ఉన్న కార్టిలేజ దగ్గర అతికిస్తారు. ఈ మూలకణాల నుంచి కొత్త కార్టిలేజ్ వస్తుంది.

- పదేళ్లుగా ఈ చికిత్సలున్నప్పటికీ 4–5 ఏళ్ల నుంచి మన దగ్గరికి వచ్చాయి.

## కీలు మార్పిడి

### ఆర్థరైటిస్ నాలుగు దశల్లో ఉంటుంది

**స్టేజ్ 1** కార్టిలేజ్ కొంచెం మెత్తబడి ఉంటుంది. ఈ దశలో లక్షణాలేమీ ఉండవు.

**స్టేజ్ 2** కార్టిలేజ్ పైన చిన్న గీతలా పడుతుంది. ఇప్పుడు కూడా లక్షణాలేవీ ఉండవు.

**స్టేజ్ 3** కీలులో గ్యాప్ కొంచెం తగ్గుతుంది. నొప్పి మొదలవుతుంది. అయితే కీలుకు పని చెప్తేనే నొప్పి ఉంటుంది.

**స్టేజ్ 4** కీలు ఎప్పటికీ నొప్పిగానే ఉంటుంది. 100 మీటర్ల కన్నా ఎక్కువ నడవలేరు కూడా. రాత్రి పూట నొప్పి ఎక్కువగా ఉంటుంది. ప్రతిరోజూ పెయిన్ కిల్లర్ వాడాల్సి వస్తుంది. జాయింట్‌లో గ్యాప్ మొత్తం తగ్గిపోతుంది. కొందరిలో అదనంగా ఎముక (ఆస్టియోఫైట్) పెరుగుతుంది.




### మార్పిడి ఎప్పుడు?

ఆర్థరైటిస్ నాలుగోదశకు చేరిన తరువాత మాత్రమే కీలుమార్పిడి అవసరం అవుతుంది. అప్పటివరకు అంటే మూడో దశలో ఉన్నప్పుడు జాయింట్ ప్రిజర్వేషన్ చికిత్సలు ఉపయోగపడుతాయి. గ్లూకజమైన్స్ లాంటి మందులు డీజనరేషన్ వేగాన్ని తగ్గిస్తాయి. పిఆర్‌పి, స్టెమ్‌సెల్ ఇంజెక్షన్లు వ్యాధి పెరగడాన్ని నెమ్మది చేస్తాయి. హైలురోనిక్ యాసిడ్ ఇంజెక్షన్లు లూబ్రికెంట్‌గా పనిచేస్తాయి. క్వాడ్రిసెప్స్ స్రెంతనింగ్ వ్యాయామాలు తొడ ఎముకను బలంగా చేసి కీలును కాపాడుతాయి. హామ్‌స్ట్రింగ్ స్రెంతనింగ్ ఎక్సర్‌సైజుల ద్వారా తొడ వెనుక కండరాలను బలంగా చేయవచ్చు.

### మార్పిడి ఎలా?

సంప్రదాయిక కీలుమార్పిడి కన్నా ఆధునికమైన పద్ధతులెన్నో వచ్చాయి. కంప్యూటర్ నావిగేటెడ్, రోబోటిక్ సర్జరీలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. యుని కంపార్ట్‌మెంటల్ నీ ఆర్థ్రోప్లాస్టీ (యుకెఎ) ద్వారా పార్షియల్ నీ రీప్లేస్‌మెంట్ కూడా చేస్తున్నారు. చిన్న వయసువాళ్లకు, కీలు కొద్దిగా మాత్రమే డ్యామేజ్ అయినప్పుడు ఇది ఉపయోగపడుతుంది.


### మోకాళ్లు.. ఇలా భద్రం!

- కృత్రిమ ఉపరితలాల మీద ఎక్కువసేపు పరిగెత్తొద్దు. అంటే ట్రెడ్‌మిల్‌ను ఎక్కువ సేపు ఉపయోగిస్తే కీలు దెబ్బ తినవచ్చు.
- సాధ్యమైనంతవరకు కింద మోకాళ్లు ముడుచుకుని కూర్చోకపోవడం మంచిది.
- మెట్లు ఎక్కి దిగడం ఎక్కువగా చేయొద్దు.
- ప్రతిరోజూ 40 నిమిషాల నడక మంచిది.
- జాయింట్ స్ట్రెంతనింగ్ ఎక్సర్‌సైజులు చేయాలి.

**డాక్టర్ సుఖేశ్ రావు**
సీనియర్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్, యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్
8121022333



**డాక్టర్ పూర్ణచంద్ర తేజస్వి**
సీనియర్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్, యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్
8121022333



**డాక్టర్ బ్రిజేష్ కిడియూర్**
సీనియర్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్, యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్
8121022333



# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ అఫ్ ఇండియా (సెబీ) అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

## బీఎస్ఎన్ఎల్‌లో

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) తెలంగాణ సర్కిల్‌లో కింది అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- అప్రెంటిస్ (కాలవ్యవధి: ఏడాది)
- **మొత్తం ఖాళీలు:** 100 (ఈసీఈ)
- వీటిలో... గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–75, టెక్నికల్ (డిప్లొమా) అప్రెంటిస్–25.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో ఇంజినీరింగ్ డిప్లొమా, ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఎంపిక విధానం:** సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ
- **దరాఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** మార్చి 16
- **వెబ్‌సైట్:** http://www.telangana.bsnl.co.in

## ఐసర్‌లో

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐసర్)లో కింది నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 4
- **పోస్టులు:** ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్, లైబ్రేరీ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీ–స్కిల్).
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** ఏప్రిల్ 22
- **వెబ్‌సైట్:** www.iisertirupati.ac.in

## సెబీలో 147 పోస్టులు

- **పోస్టు:** ఆఫీసర్ గ్రేడ్ ఏ (అసిస్టెంట్ మేనేజర్)
- **మొత్తం ఖాళీలు:** 147
- **విభాగాలు:** జనరల్–80, లీగల్–34, ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ–22, ఇంజినీరింగ్ (సివిల్–1, ఎలక్ట్రికల్–4, రిసెర్చ్–5), అధికారిక భాష–1 ఉన్నాయి.
- **అర్హత:** పోస్టును బట్టి సంబంధిత విభాగాల్లో డిగ్రీ, సీఏ/ సీఎస్/ సీఎఫ్ఏ/ సీడబ్ల్యూఏ, పీజీ, ఎంసీఏ ఉత్తీర్ణత.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **రాతపరీక్ష:** రెండు ఫేజ్‌లలో ఉంటుంది. ఫేజ్– 1 ఏప్రిల్ 12న ఉంటుంది. ఫేజ్–2 మే 3న నిర్వహిస్తారు.
- **వయస్సు:** 2020 ఫిబ్రవరి 29 నాటికి 30 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఫీజు:** రూ.1000/-
- **చివరితేదీ:** మార్చి 23
- **వెబ్‌సైట్:** https://www.sebi.gov.in

## భరోసాలో

తెలంగాణ ప్రభుత్వానికి చెందిన వరంగల్, భరోసా-సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ విమెన్ అండ్ చిల్డ్రన్ ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 06
- **పోస్టులు:** సెంటర్ కోఆర్డినేటర్ కమ్ సైకాలజిస్ట్–1, సపోర్ట్ పర్సన్–1, లీగల్ సపోర్ట్ ఆఫీసర్–1, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్–1, డీటీపీ కమ్ అకౌంటెంట్–1, రిసెప్షనిస్ట్–1
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో, **చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** http://www.womensafetywing.telangana.gov.in

## జలమండలిలో 93 ఖాళీలు

రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డ్ (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) ఇంజినీరింగ్ సర్వీస్‌లో కింది పోస్టుల భర్తీకి తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టు:** మేనేజర్ (ఇంజినీరింగ్)
- **మొత్తం ఖాళీలు:** 93
- **విభాగాలవారీగా ఖాళీలు:** సివిల్–79, మెకానికల్–6, ఎలక్ట్రికల్–4, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్–3, కంప్యూటర్ సైన్స్/ ఐటీ–1 ఉన్నాయి.
- అర్హతలు, వయస్సు, ఎంపిక, పరీక్షతేదీ, చివరితేదీ తదితర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
- **వెబ్‌సైట్:** https://www.tspsc.gov.in

నమస్తే తెలంగాణ
ఆట
12
[ కరీంనగర్ ]
మంగళవారం 10 మార్చి 2020
WWW.NTNEWS.COM

# విశ్వక్రీడలకు మేరీకోమ్

**టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత**

**అమిత్, సిమ్రన్‌జిత్ కూడా..**

**ఆసియా ఒలింపిక్ బాక్సింగ్ క్వాలిఫయర్స్**

**అమన్(జోర్డాన్):** ఆరుసార్లు ప్రపంచ చాంపియన్, భారత అగ్రశ్రేణి బాక్సర్ మేరీకోమ్, ప్రపంచ చాంపియన్‌షిప్ రజత పతక విజేత అమిత్ పంగల్, కాంస్య పతక విజేత సిమ్రన్ జిత్ కౌర్ టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. సోమవారం ఇక్కడ జరిగిన ఆసియా ఒలింపిక్స్ క్వాలిఫయర్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో విజయం సాధించి సెమీస్‌కు చేరి టోక్యో బెర్తులు దక్కించుకున్నారు. మహిళల 51కేజీల విభాగం క్వార్టర్స్‌లో రెండో సీడ్ మేరీ 5-0తో ఐరిశ్ మాంగో(ఫిలిప్పీన్స్)పై సునాయాస విజయం సాధించి, రెండోసారి ఒలింపిక్స్‌లో అడుగుపెట్టనుంది. సెమీస్‌లో యువాన్ చాంగ్(చైనా)తో మేరీ మంగళవారం తలపడనుంది. పురుషుల విభాగంలో టాప్ సీడ్ అమిత్ పంగల్(52కేజీలు) 4-1తేడాతో కార్లో పాలమ్(ఫిలిప్పీన్స్)ను చిత్తుచేశాడు. దీంతో అమిత్ తొలిసారి ఒలింపిక్స్‌లో అడుగుపెట్టనున్నాడు. మహిళల విభాగంలో సిమ్రన్‌జిత్ కౌర్(60కేజీలు) 5-0తో నమున్ మన్‌కోర్ (మంగోలియా) పై గెలిచి, తొలిసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. క్వార్టర్స్‌లో మరో భారత బాక్సర్, ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత మనీశ్ కౌశిక్(63కేజీలు) 2-3తేడాతో మూడో సీడ్ చింగోరిజ్ బాతాసుఖ్(మంగోలియా) చేతి లో ఓడాడు. అయితే, క్వార్టర్స్‌లో ఓడిన బాక్సర్ల మధ్య బాక్స్‌ఆఫ్‌లో హారిసన్ గర్సైడ్(ఆస్ట్రేలియా)తో కౌశిక్ గెలిస్తే ఒలింపిక్స్ బెర్త్ దక్కుతుంది. మహిళల విభాగంలో క్వార్టర్స్‌లో జూనియర్ ప్రపంచ మాజీ చాంపియన్ సాక్షి చౌదరి(57కేజీలు) 0-5తేడాతో ఇమ్ అజే(కొరియా) చేతిలో ఓడి ఒలింపిక్స్ అవకాశాన్ని చేజార్చుకుంది. ఇప్పటి వరకు టోక్యో ఒలింపిక్స్‌కు భారత్ తరపున 8మంది బాక్సర్లు అర్హత సాధించారు. 2012 లండన్ విశ్వక్రీడలకు గరిష్ఠంగా 8మంది బాక్సర్లు అర్హత సాధించగా.. ఈసారి ఆ రికార్డు బద్దలయ్యే అవకాశం ఉంది.


మేరీకోమ్
అమిత్

# షఫాలీ కన్నీళ్లు బాధించాయి




**బ్రెట్ లీ వ్యాఖ్య**

**మెల్‌బోర్న్:** టీమ్‌ఇండియా యువ సంచలనం షఫాలీ వర్మ కన్నీరు పెట్టుకున్న దృశ్యాన్ని చూడడం తనకు బాధగా అనిపించిందని ఆస్ట్రేలియా మాజీ పేసర్ బ్రెట్ లీ అన్నాడు. మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఆసీస్ చేతిలో ఓడాక షఫాలీ మైదానంలోనే ఏడ్చిన సంగతి తెలిసిందే. అయితే, ప్రపంచకప్ ప్రదర్శనతో షఫాలీ గర్వపడొచ్చని లీ సోమవారం చెప్పాడు. 'ఆమె ఎంతో మెరుగై ఆస్ట్రేలియా నుంచి వెళుతున్నది. ఈ అనుభవం నుంచి నేర్చుకొని షఫాలీ మరింత బలంగా తిరిగివస్తుంది. మరోసారి ఆస్ట్రేలియాకు వచ్చినప్పుడు ఆమె భారీ స్కోర్లు చేసినా ఎవరూ ఆశ్చర్యపోవక్కర్లేదు'అని బ్రెట్ లీ అన్నాడు.

**ఒకటి నుంచి మూడుకు**

భారత యువ సంచలనం షఫాలీ వర్మ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం నుంచి మూడో ర్యాంక్‌కు పడిపోయింది. మెగాటోర్నీలో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన ఆసీస్ హార్డ్‌హిట్టర్ బేత్ మూనీ(762) రెండు ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని టాప్ ర్యాంక్‌కు చేరుకుంది. స్మృతి మందన, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్‌కౌర్ వరుసగా ఏడు, తొమ్మిది, పన్నెండు ర్యాంక్‌ల్లో ఉన్నారు.

# వరల్డ్ టీ20 ఎలెవన్‌లో పూనమ్

**దుబాయ్:** ఆస్ట్రేలియా వేదికగా తాజాగా ముగిసిన మహిళల టీ20 ప్రపంచకప్‌లో సత్తాచాటిన క్రికెటర్లతో వరల్డ్ ఎలెవన్ జట్టును ఐసీసీ సోమవారం ప్రకటించింది. ఇందులో భారత్ నుంచి సీనియర్ స్పిన్నర్ పూనమ్ యాదవ్‌కు మాత్రమే చోటు దక్కగా, మిగతావారికి నిరాశే ఎదురైంది. బ్యాటింగ్‌లో అదరగొట్టిన యువ సంచలనం షెఫాలీవర్మ 12వ ప్లేయర్‌గా ఎంపికైంది. ఐదోసారి ప్రపంచకప్ గెలిచిన ఆసీస్ జట్టు నుంచి ఐదుగురు ఎంపికయ్యారు.

**ఐసీసీ వరల్డ్ టీ20 ఎలెవన్:** ఎలీసా హీలీ, బేత్ మూనీ, నాట్ స్కీవర్, హీథర్ నైట్, మెగ్ లానింగ్, లారా వోల్వార్డ్, జెస్ జొనాసెన్, సోఫీ ఎక్లస్టోన్, అన్య శ్రుభ్‌సోల్, మేగన్ స్కట్, పూనమ్ యాదవ్, షఫాలీవర్మ(12వ ప్లేయర్)




# ఐపీఎల్‌లో రాణిస్తేనే..



ధోనీ

**రాజ్‌కోట్:** ఐపీఎల్ టోర్నీలో రాణిస్తేనే.. ధోనీకి జాతీయ జట్టులో తిరిగి చోటు దక్కుతుందని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. నూతన చైర్మన్ సునీల్ జోషి సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ ధోనీ భవిష్యత్తుపై ప్రస్తుతమున్న పరిస్థితిని కొనసాగించేందుకు మొగ్గుచూపింది. 'దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు జట్టును ఎంపిక చేయడం మినహా ధోనీ గురించి భేటీలో చర్చకు రాలేదు. ఐపీఎల్‌లో రాణిస్తేనే..అతనికి తిరిగి జట్టులో చోటు దక్కుతుంది. అతని ఒక్కనికే కాదు సీనియర్లు, జూనియర్లన్న తేడా లేకుండా ఎవరూ రాణించినా ఎంపికవుతారు' అని బీసీసీఐ సీనియర్ అధికారి అన్నాడు.

# సౌరాష్ట్ర 206/5



**రాజ్‌కోట్:** సౌరాష్ట్ర బ్యాట్స్‌మెన్ అవి బారోత్(54), విశ్వరాజ్ జడేజా(54) అర్ధ శతకాలు చేసినా.. చివర్లో పేసర్ అక్ష్‌దీప్(3/41) చెలరేగడంతో ప్రతిష్ఠాత్మక రంజీ ట్రోఫీ ఫైనల్లో బెంగాల్ పైచేయి సాధించింది. సోమవారం ఇక్కడ జరిగిన తుదిపోరు తొలి రోజు ఆటలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు కోల్పోయి 206పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో అర్పిత్(29నాటౌట్) ఉన్నాడు. ఓపెనర్ హర్విక్ దేశాయ్(38) ఫర్వాలేదనిపించగా.. మరో ఓపెనర్ అవి బారోత్ నిలకడగా ఆడి అర్ధశతకం తర్వాత అక్ష్‌దీప్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. మూడో స్థానంలో వచ్చిన విశ్వరాజ్(54) కూడా హాఫ్ సెంచరీ చేయడంతో ఓ దశలో సౌరాష్ట్ర రెండు వికెట్లకు 163 పరుగులతో పటిష్ఠంగా నిలిచింది. ఆ తర్వాత విశ్వరాజ్ సహా షెల్డన్ జాక్సన్(14) త్వరగా ఔటయ్యారు. అనంతరం టీమ్‌ఇండియా టెస్టు ఓపెనర్ చతేశ్వర్ పుజారా(5) బరిలోకి దిగినా గొంతు సంబంధిత ఇన్ఫెక్షన్ కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. అయితే మంగళవారం ఆటకు పుజారా బరిలోకి దిగే అవకాశం ఉంది. కాగా, ఫైనల్ జరుగుతున్న సౌరాష్ట్ర క్రికెట్ సంఘం మైదానం పిచ్ నాసిరకంగా ఉందని బెంగాల్ కోచ్ అరుణ్ లాల్ అసంతృప్తి వ్యక్తం చేశాడు.



# నాకౌట్ ఫోబియా

2014 నుంచి ఐసీసీ టోర్నీల్లో భారత క్రికెట్ అభిమానుల హృదయాలు కలచివేసే సందర్భాలు జరుగుతూనే ఉన్నాయి. దాదాపు ఏడేండ్ల నుంచి మెగాటోర్నీల్లో సెమీస్ లేదా ఫైనల్స్ వరకు వెళ్లగలుగుతున్న భారత పురుషుల, మహిళల జట్లు రిక్తహస్తాలతోనే తిరిగివస్తున్నాయి. టోర్నీ ప్రారంభంలో అదిరే ప్రదర్శనతో దూసుకెళుతూ నాకౌట్ మ్యాచ్‌ల్లో తేలిపోతున్నాయి. తప్పక గెలవాల్సిన పోటీల్లో ఒత్తిడికి చిత్తవుతున్నాయి. టోర్నీ ఆరంభం నుంచి అద్భుత ప్రదర్శన చేసిన ప్లేయర్లు సైతం నాకౌట్ దశకు వచ్చే సరికి చేతులెత్తేస్తున్నారు. దీంతో ఏడేండ్లుగా ఎనిమిది మెగాటోర్నీల్లో మొత్తం ఎనిమిది నాకౌట్ మ్యాచ్‌ల్లో భారత సీనియర్ జట్లు నిరాశపరిచాయి.




**మెగాటోర్నీల్లో భారత జట్ల తడబాటు**

**నాకౌట్ మ్యాచ్‌ల్లో ఒత్తిడికి చిత్తు**

**ఐసీసీ టైటిల్ సాధించి ఏడేండ్లు**

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ప్రతి ఐసీసీ టోర్నీలో ఫేవరెట్‌గా అడుగుపెడుతున్న భారత క్రికెట్ జట్లు నాకౌట్ దశలో చతికిలపడుతున్నాయి. గ్రూప్ దశలో అదిరే ఆటతో ఆకట్టుకుంటూ దూసుకెళ్లడం.. సెమీస్ లేదా ఫైనల్స్‌లో ఒత్తిడి భరించలేక ఓటమి పాలవడం పరిపాటిగా మారింది. దీంతో దాదాపు ఏడేండ్లుగా భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు ఒక్క ఐసీసీ మేజర్ టోర్నీ టైటిల్‌ను కైవసం చేసుకోలేకపోయాయి. మహేంద్ర సింగ్ ధోనీ సారథ్యంలోని భారత పురుషుల జట్టు 2013 చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను చివరిసారి అందుకుంది. ఆ తర్వాత జరిగిన అన్ని ఐసీసీ టోర్నీల్లోనూ నిరాశే ఎదురైంది. 2013 తర్వాత రెండు సార్లు ఫైనల్స్ (2014 టీ20ప్రపంచకప్, 2017 చాంపియన్స్‌ట్రోఫీ)లో, మూడు సార్లు సెమీఫైనల్స్(2015, 2019 వన్డే ప్రపంచకప్, 2016 టీ20 వరల్డ్ కప్)లో ఓడి రిక్తహస్తాలతోనే టోర్నీల నుంచి వైదొలిగింది. మహిళల పరిస్థితీ అంతే. 2017 వన్డే, 2020 టీ20 ప్రపంచకప్ ఫైనల్స్‌లో భారత మహిళల జట్టుకు ఓటమి ఎదురవగా.. 2018 టీ20వరల్డ్‌కప్‌లో సెమీస్‌లోనే పరాజయం పాలైంది.

## 2014 నుంచి 2019

**2014 టీ20 ప్రపంచకప్ ఫైనల్**

ఈ టోర్నీ గ్రూప్-1లో భారత్ అగ్రస్థానాన నిలిచి, సెమీఫైనల్లోనూ దక్షిణాఫ్రికాను ఓడించింది. శ్రీలంక సైతం తుదిపోరుకు దూసుకురావడంతో 2011 వన్డే ప్రపంచకప్ మరోసారి రిపీట్ అవుతుందని అందరూ అనుకున్నారు. అయితే, ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ కోహ్లీ(77) రాణించడంతో 130పరుగుల మోస్తరు స్కోరు చేసింది. సంగక్కర(52) అదరగొట్టడంతో శ్రీలంక 17.5ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.


యువరాజ్

**2015 ప్రపంచకప్ సెమీఫైనల్**

ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ హోదాలో అడుగుపెట్టిన భారత్ గ్రూప్ దశలో అదరగొట్టి సెమీస్ చేరింది. ఆ మ్యాచ్‌లో స్టీవ్ స్మిత్(105) శతకంతో దుమ్మురేపడంతో ఆసీస్ 328 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ధోనీ(65) మినహా మరెవరూ రాణించలేకపోవడంతో భారత్ 233పరుగులకే ఆలౌటైంది.

**2016 టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్**

స్వదేశంలో ఈ టోర్నీ జరుగడంతో టైటిల్ భారత్‌దే అని అందరూ అంచనా వేశారు. అందుకు తగ్గట్టుగానే సెమీస్‌లో కెప్టెన్ కోహ్లీ(47 బంతుల్లో 89పరుగులు) అదరగొట్టడంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 193 పరుగుల భారీ స్కోరు చేసింది. విండీస్ బ్యాట్స్‌మన్ సిమన్స్(51బంతుల్లో 82) అదరగొట్టడంతో 7వికెట్ల తేడాతో భారత్ పరాజయం పాలైంది.

**2017 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్**

భారత అభిమానులను ఈ టోర్నీ ఎప్పుడూ చేదు జ్ఞాపకంగానే గుర్తుంటుంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన టోర్నీ ఫైనల్లో భారత్ 180పరుగుల ఓటమి చవిచూసింది. 338 పరుగుల లక్ష్యఛేదనలో 158కే ఆలౌటై తీవ్రంగా నిరాశపరిచింది.



కోహ్లీ

**2019 వన్డే ప్రపంచకప్ సెమీస్**

ఇటీవల భారత అభిమానులను ఎక్కువ బాధించిన మ్యాచ్ 2019 వన్డే విశ్వకప్ సెమీఫైనల్. కివీస్‌తో జరిగిన ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించడంతో రెండురోజుల పాటు జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 239 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ధోనీ (50)తో పాటు చివర్లో జడేజా (77) మినహా ఎవరూ నిలువలేకపో వడంతో 18పరుగుల తేడాతో ఓడింది.

## 2017 నుంచి 2020

**2017 మహిళల ప్రపంచకప్ ఫైనల్స్**

ఈ టోర్నీలో ఫైనల్లో భారత్ తప్పక గెలుస్తుందన్న స్థితికి చేరింది. 229పరుగుల లక్ష్యఛేదనలో పూనమ్ రావత్(86) రాణించడంతో ఓ దశలో మూడు వికెట్లకు 191పరుగులు చేసింది. ఆ దశలో ఒక్కసారిగా భారత బ్యాటింగ్ కుప్పకూలింది. 28పరుగుల వ్యవధిలో ఏడు వికెట్లు కోల్పోయి ఇంగ్లండ్ చేతిలో 9పరుగుల తేడాతో ఓడింది.

**2018 మహిళల టీ20 ప్రపంచకప్ సెమీస్..**

భారత మహిళల జట్టు ప్రపంచకప్ టైటిల్ ఆశలను ఇంగ్లండ్ మరోసారి ఈ టోర్నీలో చెరిపేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఓ దశలో 89 పరుగులకు రెండు వికెట్లు పటిష్ఠ స్థితిలోనే నిలిచింది. ఆ తర్వాత 23పరుగుల వ్యవధిలో 8వికెట్లు చేజార్చుకొని 112కే పరిమితమైంది. ఆ తర్వాత ఇంగ్లండ్ 17బంతులు మిగిలుండగానే 8వికెట్ల తేడాతో లక్ష్యాన్ని ఛేదించడంతో భారత్‌కు మరోసారి నిరాశ తప్పలేదు. ఈ మ్యాచ్‌లో సీనియర్ ప్లేయర్ మిథాలీ రాజ్‌ను పక్కనబెట్టడంతో దుమారం రేగిన సంగతి తెలిసిందే.

**2020 మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్స్..**

తాజాగా జరిగిన ఈ టోర్నీలో ప్రారంభం నుంచి అదరగొట్టిన భారత్ ఫైనల్లో విఫలమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాను కట్టడి చేయలేకపోయింది. ఓపెనర్లు అలీసా హేలీ(75), మూనీ(78) రెచ్చిపోవడంతో ఆసీస్ 184పరుగుల భారీ స్కోరు చేసింది. టోర్నీ ఆసాంతం అదరగొట్టిన భారత యువ కెరటం షఫాలీ(2) సహా మిగిలిన వారు విఫలమవడంతో భారత్ 99పరుగులకే ఆలౌటైంది. దీంతో తొలిసారి ప్రపంచకప్ గెలువాలన్న భారత మహిళల కల మరోసారి చెదిరింది.


మిథాలీ

# కరోనా హైరానా


ప్రేక్షకులు లేకుండానే సాగుతున్న జువెంటస్, ఇంటర్ మిలాన్ మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్

**న్యూఢిల్లీ:** ప్రమాదకర కరోనా వైరస్ హైరానా పుట్టిస్తున్నది. ఇప్పటికే పలు క్రీడా టోర్నీలు వాయిదా పడగా, మరికొన్ని అదే బాట పడుతున్నాయి. భారత్‌తో మూడు వన్డేల సిరీస్ కోసం సోమవారం ఇక్కడకు చేరుకున్న దక్షిణాఫ్రికా జట్టు ముందస్తు జాగ్రత్తలు పాటించేందుకు సిద్ధమైంది. వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు తాము షేక్‌హ్యాండ్స్‌కు దూరంగా ఉంటామని జట్టు చీఫ్ కోచ్ మార్క్ బౌచర్ అన్నాడు. వైద్య బృందం సూచనల మేరకు తాము నడుచుకుంటామని బౌచర్ చెప్పుకొచ్చాడు. మరోవైపు వైరస్ వ్యాప్తిని దృష్టిలో పెట్టుకుని ఇండియన్ వెల్స్ టోర్నీని రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ప్రకటించారు. అమెరికాలో కరోనా కారణంగా రద్దయిన తొలి మెగా టోర్నీగా ఇది నిలిచింది. లాస్‌ఏంజిల్స్‌లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించినందువల్ల ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. టోక్యో ఒలింపిక్స్ టార్చ్ రిలే కార్యక్రమం కూడా వైరస్ ప్రభావంతో ప్రేక్షకులు లేకుండానే సాదాసీదాగా జరిగింది. ఇక ట్యూరిన్(ఇటలీ)లో జువెంటస్, ఇంటర్ మిలాన్ మధ్య మ్యాచ్ ప్రేక్షకులు లేకుండానే జరుగడం విశేషం.

# షెడ్యూల్ ప్రకారమే ఐపీఎల్



**ముంబై:** ఈ ఏడాది ఐపీఎల్‌పై ఒకింత సందిగ్ధత కొనసాగుతూనే ఉన్నది. కరోనా వైరస్ కారణంగా ఐపీఎల్‌ను వాయిదా వేసే అవకాశముందంటూ మహారాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి రాజేశ్ తోపే వ్యాఖ్యలకు బీసీసీఐ బాస్ సౌరవ్ గంగూలీ స్పందించాడు. కరోనా వైరస్ ఉన్నా..షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందంటూ మీడియాతో అన్నాడు. లీగ్‌కు ముందుకు సాగుతున్న సమయంలో వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కావాల్సిన అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని దాదా పేర్కొన్నాడు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 29 నుంచి ఐపీఎల్ 13వ సీజన్ మొదలుకాబోతున్నది.